

ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 120 | మంగళవారం | 31-03-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


### తెలంగాణ ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం

'తెలంగాణ ద్రవ్య వినిమయ బిల్లు' శాసనసభ, శాసనమండలి ఉభయ సభలలో సోమవారం రాత్రి ఆమోదం పొందింది. ద్రవ్య వినిమయ బిల్లును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉభయ సభలలో ప్రవేశపెట్టారు. బిల్లుపై జరిగిన చర్చలో బిజెపి శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం ఎంఎల్ఏ అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, సిపిఐ శాసనసభా పక్షనేత కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ ఎంఎల్ఏలు సి.విజయరమణ రావు, బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ చర్చలో సభ్యులు ప్రస్తావించిన అంశాలకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. అనంతరం ద్రవ్య వినిమయ బిల్లును సభ ఆమోదించగా, సభను స్పీకర్ గడ్డం ప్రసాద్ నిరవధికంగా వాయిదా వేశారు.

## హైడ్రా, ఈగిల్ మాదిరిగా
# ఆహార కల్తీపై స్వతంత్ర వ్యవస్థ

- 50 శాతం సీట్లు పెంచితే ద్వితీయ శ్రేణిపౌరులుగా దక్షిణ భారతీయులు
- ప్రజలందరికీ త్వరలో కేన్సర్ పరీక్షలు
- వంద శాతం జనాభాకైనా సన్నబియ్యం ఇచ్చేందుకు సిద్ధం
- పంట మార్పిడి చేస్తే రైతులకు ప్రభుత్వం సహకారం : సిఎం రేవంత్‌రెడ్డి

### సన్నబియ్యం పథకానికి ఏడాది పూర్తి

### అసెంబ్లీలో సన్నబియ్యం బిర్యానీ, బగారా

రాష్ట్రంలో సన్నబియ్యం పథకం ప్రారంభించి ఏడాది పూ ర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ సెంట్రల్ హాల్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు, మీడియా పాయింట్ సమీపంలో మీడియా ప్రతినిధులకు సన్న బియ్యంతో భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డితో సహా మంత్రులు హాజరయ్యారు. సన్న బియ్యం తో వండిన మటన్ దమ్ బిర్యాని, వైట్ రైస్, బగరా రైస్, పుదీనా రైస్, పులిహోర, సన్న బియ్యం ఖీర్, కొబ్బరి పేడ తదితర వంటకాలు అద్భుతంగా ఉన్నాయని సిఎం తో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు కొనియాడారు.


అసెంబ్లీలో ఎంఎల్ఏలతో కలిసి సన్నబియ్యం బిర్యానీ తిన్న సిఎం

ప్రజాపక్షం / హైదరాబాద్

చెరువులను కాపాడేందుకు హైడ్రా, డ్రగ్స్ రవాణాను చేధించేందుకు ఈగిల్ తరహాలో ఆహార కల్తీని నియంత్రించేందుకు స్వతంత్ర వ్యవ్థను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 50 శాతం నియోజకవర్గాల పెంపు, పునర్విభజన ప్రతిపాదన నూటికి నూరు శాతం దక్షిణ భారత పౌరులను దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చుతుందని అన్నారు. ఈ ప్రతిపాదన దక్షిణ భారతదేశానికి వ్యతిరేకమని, ఇది రాజకీయ పార్టీల సమస్య కాదని, ప్రజల సమస్య అని అన్నారు. లోక్‌సభ నియోజవర్గాలు పెంచినా, ప్రస్తుతం ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య ఎన్ని సీట్ల తేడా ఉందో అన్నే సీట్ల తేడా ఉండాలా పెంచాలని సూచించారు. ఆహార భద్రత కింద ఏడాదిగా రాష్ట్రంలోని 85 శాతం జనాభాకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, ఇకపై విద్యా, ఆహారం నాణ్యత లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఒకప్పుడు విద్య, భోజనం లేదని, ఇప్పుడు విద్య ఉన్నప్పటికీ, ప్రజలు నాణ్యత, సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకునే విద్యను కోరుకుంటున్నారని, అలాగే భోజనంలో పౌష్టికాహారం, ఆర్గానిక్ (సేంద్రియ) ఆహారం అందించే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. సన్న వడ్లకు బోనస్, అలాగే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ ద్వారా ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు లబ్ధి జరుగుతోందని, సన్న బియ్యం సాగు కూడా పెరిగిందన్నారు. ఇకపై రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించాలని, ఇందుకు ప్రభుత్వం సహకరిస్తుందని, ఇప్పటికే మూడేళ్ళ తరువాత పంట వచ్చే పామాయిల్ రైతులకు సహకరిస్తోందన్నారు. సన్న బియ్యం పథకం ప్రవేశపెట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా పౌర సరఫరాల శాఖ మంత్రి

తరువాయి 2లో

## విద్వేషపూరితమైన ప్రసంగం బిల్లు
# సెలక్ట్ కమిటీకి

- అసెంబ్లీలో తీర్మానం
- బిల్లులో నిబంధనలు, శిక్షలు, పౌర హక్కుల అంశాలపై సభలో భిన్నాభిప్రాయాలు
- బిల్లును ఉపసంహరించుకునేందుకు పునరాలోచన చేయాలని సిపిఐ సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్

'తెలంగాణ విద్వేష ప్రసంగం, ద్వేషపూరితమైన నేరాల నివారణ బిల్లు 2026'ను సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేస్తూ శాసనసభ తీర్మానం చేసింది. సిఎం రేవంత్ రెడ్డి తరపున ఈ బిల్లును మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో సోమవారం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులోని నిబంధనలు, శిక్షలు, పౌర హక్కుల అంశాలపై సభలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు కాంగ్రెస్ సభ్యులు, బిజెపి, ఎంఐఎం సభ్యులు సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేయాలని కోరగా, సిపిఐ మాత్రం ఈ బిల్లును ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించింది. తొలుత మంత్రి పొన్నం ప్రభాకర్ బిల్లును ప్రవేశపెడుతూ ఈ బిల్లు భావ ప్రకటన స్వేచ్ఛకు, వాక్ స్వాతంత్ర్యానికి ఎటువంటి భంగం కలిగించబోదని, రాజకీయ కక్ష సా ధింపు చర్యలు ఉండబోవని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు దేశ వ్యాప్తంగా ఈ చట్టం అమలులో ఉన్నదని, ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో ఈ బిల్లును ప్రవేశపెట్టామని వివరించారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, ఈ చట్టం అందరి కీ వర్తిసుందని స్పష్టం చేశారు. సభలో ఈ బిల్లుపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తమైన నేపథ్యంలో

తరువాయి 2లో

### పశ్చిమ ఆసియాలో యుద్ధ నివారణకు
## కేంద్రం చొరవ తీసుకోవాలి

తీర్మానానికి శాసన సభ ఏకగ్రీవ ఆమోదం

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కొనసాగిస్తున్న యుద్ధాన్ని నిలువరించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలంగాణ శాసనసభ కోరింది. ఈ మేరకు సోమవారం శాసనసభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఒక తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ పశ్చిమ ఆసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య మొదలైన ఈ యుద్ధం అనేక రూపాంతరాలు చెంది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుందన్నారు. క్రూడాయిల్

తరువాయి 2లో

## ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా సెక్షన్లు : కూనంనేని

సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ బిల్లులలోని సెక్షన్లు ప్రజాస్వామ్యానికి వ్య తిరేకంగా ఉన్నాయన్నారు. ఈ చట్టాన్ని ప్రవేశపెట్టే విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన కోరారు. 5వ నిబంధన ప్రకారం తమ సిపిఐ వాట్సాప్ గ్రూప్‌లో ఎవరైనా పోస్ట్ చేస్తే అందుకు బాధ్యులుగా పోస్ట్ చేసిన వ్యక్తితో పాటు మొత్తం పార్టీని, పార్టీ కార్యదర్శిపై కూడా కేసు నమోదు చేస్తారని వివరించారు. ప్ర స్తుతం ఉన్న చట్టాలు సరిపోతాయని, ఈ బిల్లులోని అనే క అంశాలపై స్పష్టత లేదన్నారు. తప్పు చేసిన వారికే వర్తిస్తుందని చెబుతున్నారని, ఇంతకు ఆ తప్పుకు నిర్వచనం ఏమిటని

తరువాయి 2లో

## తెలంగాణలోఏ ఒక్క ప్రాజెక్ట్‌కూ జాతీయ హోదా ఇవ్వలే


కేంద్రంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపాటు

రాష్ట్రంలో నీటి పారుదల ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధనకోసం అందరం కలిసి ఢిల్లీకి పోదామని శాసన సభలో సభ్యులకు సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని నీటి పారుదల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదాను సాధించుకునేందుకు అందరం కలిసి ఢిల్లీకి పోదామని, ఆ దిశగా ప్రయత్నిద్దామని సూచించారు. రాష్ట్రాల హక్కు ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాకుండా చేస్తున్నారని, అయినప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల కోసం తాము సమాఖ్య స్ఫూర్తితో కొనసాగిస్తూ ప్రజాస్వామికంగా ముందుకు వెళ్తున్నామని భట్టివిక్రమార్క అన్నారు. శాసనసభలో సోమవారం 'తెలంగాణ ద్రవ్య వినిమయ బిల్లు' పై జరిగిన చర్చకు, పలువురు సభ్యులు ప్రస్తావించిన అంశాలకు భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా

తరువాయి 12లో

## బస్తర్‌లో నక్సలిజాన్ని దాదాపు నిర్మూలించాం




- ఈ ప్రాంతంలో రేషన్ షాపులు,స్కూళ్ళు తెరుస్తాం
- నిర్మూలన ఘనత భద్రతాదళాలు,గిరిజన ప్రజలదే
- లోక్‌సభలో అమిత్ షా ప్రకటన

**న్యూఢిల్లీ:** బస్తర్‌లో నక్సలిజాన్ని దాదాపు నిర్మూలించామని కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా సోమవారం లోక్‌సభలో ప్రకటించారు. వామ పక్ష తీవ్రవాద కార్యకలాపాలనుండి విముక్తి చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిపై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా సమాధానం చెబుతూ, దేశంలో నక్సలిజం నిర్మూలనకు చేసిన కృషి ఘనత,గొప్పతనం కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు ప్రత్యేకించి కోబ్రా, సిఆర్‌పిఎఫ్, సెక్యూరిటీ ఏజన్సీలు,ఛత్తీస్‌గఢ్ పోలీసులు, డిఆర్‌జి సిబ్బంది,గిరిజన ఆవాస ప్రజలకే దక్కుతుందని ప్రశంసించారు. ఈనాడు దేశంలో నక్సలిజాన్ని ముఖ్యంగా బస్తర్ ప్రాంతం నుండి దాదాపుగా నిర్మూలించామన్నారు. ఈ ప్రాంతంలోని ప్రతి గ్రామంలో నూ స్కూలు భవనాలు నిర్మిస్తామని, ఈ మేరకు విస్తృత ప్రచారం చేశామన్నారు. బస్తర్‌లోని ప్రతి గ్రామంలోనూ

తరువాయి 12లో

## అసంఘటిత కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- 58 ఏళ్ల తర్వాత వారికి కనీస పెన్షన్ రూ.10-15 వేలు అమలు చేయాలి
- గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమ బిల్లు-2026పై చర్చలో ప్రభుత్వానికి సిపిఐ శాసన సభాపక్షనేత కూనంనేని విజ్ఞప్తి
- న్యాయవాదుల రక్షణకు చట్టం తేవడం అభినందనీయమని వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో 2 కోట్లకు పైగా ఉన్న అసంఘటిత కార్మికులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు 58 ఏళ్ల తర్వాత వారికి కనీసం రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు పెన్షన్ అమలు చేయాలని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో సోమవారం తెలంగాణ ప్లాట్‌ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమ బిల్లు2026పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిక్కు మొక్కు లేని గిగ్ కార్మికుల కోసం ప్రభుత్వం చట్టం తీసుకురావడం అభినందనీయమన్నారు. అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు భద్రత కల్పించడం వారికి ఎంతో మేలు చేయనుందన్నారు. వ్యక్తి కేంద్రంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలని, అలా ఉంటే ప్రతి వర్గానికి న్యాయం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఉన్న అసంఘంటిత రంగ కార్మికులందరిని పిఎఫ్ పరిధిలోకి తీసుకురావాలని, 58 ఏళ్ల తర్వాత వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇది

తరువాయి 2లో



## టూరిజంలో అక్రమాలు

- ఏడాది కాలంలో బోటింగ్ రంగం ద్వారా రూ.1.48 కోట్లకు గండి
- నాగార్జున సాగర్ బోటింగ్ కేంద్రంలో నకిలీ టిక్కెట్ బుక్కులతో లక్షల రూపాయల ప్రభుత్వ ఆదాయం కొల్లగొట్టిన ఇన్‌చార్జ్
- విధుల నుంచి తొలగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ పర్యాటక శాఖలో బయట పడుతున్న వరుస కుంభకోణాలు ఆ శాఖ అధికారులను విస్మయానికి గురి చేస్తున్నాయి. రెండేళ్ల వ్యవధిలోనే నాలుగు కేసులు నమోదు కావడం, మరోపక్క ఆరుగురు అధికారులపై వేటుపడడం జరిగింది. తాజాగా బోటింగ్ రంగంలో కోటిన్నర రూపాయలు నష్టం జరిగింది. ఈ కుంభకోణంపై ఉన్నతాధికారులు విచారణ జరిపిస్తున్నారు. తెలంగాణలోని 27 పర్యాటక కేంద్రాల్లో దాదాపు 99 బోట్లను నడిపిస్తున్న పర్యాటక శాఖ 2024లో బోటింగ్ ద్వారా రూ.14.60

తరువాయి 12లో

## వ్యక్తిగత సమాచారం గోప్యం

పథకాల లబ్ధికి ఉపయోగించొద్దు : జనగణన కమిషనర్




05



శాసన మండలి సభ్యత్వానికి..

## నితీశ్ రాజీనామా

**న్యూఢిల్లీ :** పాట్నా: బిహార్ సీఎం నితీశ్ కుమార్ తన శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇటీవల రాజ్యసభకు ఆయన ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని వదులుకున్నారు. సిఎం పదవికి కూడా త్వరలో రాజీనామా చేయనున్నారు. మార్చి 16న బిహార్ స్థానాలకు జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో నితీశ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే రెండు సభల్లో సభ్యత్వం కలిగి ఉన్నప్పుడు,

తరువాయి 12లో




### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
## సింగరేణి సిరిని దోచుకుంటున్నాయ్


12



సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి: తీవ్ర ఉద్రిక్తం

సింగరేణి నేతలు, కార్మికులు - పోలీసుల మధ్య తోపులాట

### పరస్పర దాడులు విస్తృతం
## పెరిగిన యుద్ధ భయం



- ట్రంప్ గగనతల మార్గంలో కలకలం సృష్టించిన డ్రోన్,పౌర విమానం
- ఫ్లోరిడాలో ఎలర్ట్ః రంగంలోకి ఎఫ్-16 విమానాలు
- ఇజ్రాయెల్ పారిశ్రామిక వాడపై క్షిపణి దాడులు
- అమెరికా-ఇజ్రాయెల్ అధికారుల ఇళ్ళపై దాడులు:ఐఆర్‌జిసి హెచ్చరిక
- ఇజ్రాయెల్ హైఫా ఆయిల్ రిఫైనరీ ధ్వంసం
- తబ్రిజ్ నగరంలో కెమికల్ ప్లాంట్, ఎయిర్‌పోర్ట్ ధ్వంసం

**దుబాయ్:** పశ్చిమాసియాలో అమెరికా కొత్త సేనలను మోహరించడంతో యుద్ధ భయం మరింతగా విస్తరించింది. 31వ రోజు సోమవారం యుద్ధంలో గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలు,మౌలిక సదుపాయాలపై ఇరాన్ విస్తారంగా డ్రోన్లు, క్షిపణి దాడులు చేసింది. ఇరాన్, హెజ్బొల్లా క్షిపణి దాడులతో ఉత్తర ఇజ్రాయెల్ కోస్తా రేవు నగరం హైఫాలోని బాజన్ ఆయిల్ రిఫైనరీలో మంటలు చెలరేగాయి. ఆకాశంలో నల్లటి పొగలున కమ్ముకున్నాయి. ఇరాక్‌లో ఉన్న విక్టరీ బేస్‌పై ఇరాన్ దాడులు చేయగా, ఇరాన్‌లో ప్రభుత్వ మౌలిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ విధ్వంసానికి పాల్పడింది. దీంతో ఇరాన్‌లో విద్యుత్ సంక్షోభం తలెత్తింది. టెహ్రాన్‌లో క్రీడా మందిరం, స్కూలుపై అమెరికా గగనతల దాడులు చేసింది. ఉత్తర ఇరాన్‌లో వరుస పేలుళ్ళు సంభవించాయి. విధ్వంసం కొనసాగుతుండగా, వాయువ్య ఇరాన్‌లోని అతిపెద్ద

తరువాయి 2లో

## సైకిల్‌పై వెళ్ళి పారిస్ మేయర్‌గా

# బాధ్యతలు చేపట్టిన వామపక్షనేత

**పారిస్:** ఫ్రాన్స్‌లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయభేరీ మోగించిన వామ పక్ష, సోషలిస్టు నాయకులు పదవీ బాధ్యతలు తీసుకోవడం ప్రారంభించారు. ఇందులో భాగంగా మళ్ళీ విజయం సాధించిన పారిస్ సిట్టింగ్ మేయర్ ఇమ్మాన్యుయెల్ గ్రెగోయిర్ ఎంతో ఉన్నత విలువలు పాటించారు. ఎలాంటి ఆర్భాటాలు,మందీమార్బలం వెంట లేకుండా తాను ఒక్కడే సైకిల్ తొక్కుకుంటూ నిరాడంబ రంగా సిటీ హాల్‌కు చేరుకుని పదవీ బాధ్యతలు తీసుకున్నారు. మార్చి 22వ తేదీన జరిగిన పారిస్ మేయర్ ఎన్నికల్లో గ్రెగోయిర్ 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు సంపాదించారు. గ్రెగోయిర్ విజయం ద్వారా దేశ రాజధానిలో సోషలిస్టు లకు సుదీర్ఘకాలంగా ఉన్న ఆధిపత్యాన్ని నిలబెట్టి ఆ వారసత్వాన్ని కొనసాగించారు. ఆయన విజయం పారిస్‌లో వామపక్షాలు 25 సంవత్స రాలుగా కొనసాగిస్తున్న పరిపాలనకు చిహ్నం.



పారిస్, మార్సెయిల్, లియోన్ నగరాలలో మేయర్ పదవులను తిరిగి చేజిక్కించుకుని తమ ప్రాధాన్యతను, నియంత్రణను,ఆధిపత్యాన్ని రుజువుచేశారు. లిల్లే,రెన్నెస్ వంటి కీలక నగరా లలో సోషలిస్టులు ఆధిపత్యం నిలబెట్టుకు న్నారు. అతిపెద్ద నగరాల్లో మేయర్ పదవులను వామపక్షాలు తిరిగి కైవసం చేసుకున్నాయి.ఈ విజయాలు అత్యంత ఉత్తేజకరమైనవిగా పేర్కొంటూ "పారిస్ నగరం ఎన్నటికీ మితవా దుల వశం కాబోదు" అని గ్రెగోయిర్ వ్యాఖ్యా నించారు. పారిస్ నగరం తన గత చరిత్రకు కట్టుబడే ఉంటుందని అన్నారు. మార్సెయిల్ నగరంలో కూడా ప్రస్తుత మేయర్ బెనోయిట్ పాయన్ అత్యంత సునాయాసంగా తిరిగి విజయం సాధించారు. వచ్చే ఏడాది దేశాధ్యక్ష పదవికి జరిగే ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరిం తగా జరుగుతాయని విశ్లేషకులు అంచనావేస్తు న్నారు. హవ్రేలో మళ్ళీ ఘన విజయం సాధిం చిన ఎడ్వర్డ్ ఫిలిప్ వచ్చే ఏడాది అధ్యక్ష ఎన్ని కల్లో మితవాద నేషనల్ ర్యాలీకి వ్యతిరేకంగా అత్యంత శక్తిమంతమైన అభ్యర్థిగా బరిలోకి రానున్నారు.నేషనల్ ర్యాలీ తరపున మెరైన్ లీపెన్ లేదా జోర్డాన్ బార్డెల్లా అభ్యర్థిగా ఉండే అవకాశం ఉంది.

## మనీ లాండరింగ్ కేసులో ముగ్గురు

# నేపాల్ మాజీ ప్రధానులపై విచారణ ప్రారంభం

కాఠ్మండు: మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరో పణలపై ముగ్గురు మాజీ ప్రధానమంత్రులతో సహా మరో ఇద్దరు మాజీ మంత్రులపై కూడా నేపాల్‌లో సమగ్ర విచారణ ప్రారంభమైంది. ఒకవైపు మాజీ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి, మాజీ హోంమం త్రిపై కేసులు నమోదయ్యాయి. జనరేషన్ జెడ్ ఉద్యమాన్ని అణచివేసి మానవతా ఉల్లంఘనకు పాల్పడ్డారని కె.పి.శర్మ ఓలీ,మాజీ హోంమంత్రిపై పెట్టిన కేసులు చట్ట విరుద్ధమైనవని పేర్కొంటూ ఆ దేశ సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్‌లపై సుప్రీంకోర్టు విచారణ జరుపనున్నది. ఇదే సమయంలో మనీ లాండరింగ్ కేసు దర్యాప్తు కూడా మొదలైంది. నేపాల్‌లో ఈ విధంగా పాలక రాజకీయ అధిప తులు మనీలాండరింగ్ కేసు విచారణ ఎదుర్కో వడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి.

ఈ కేసులో మాజీ ప్రధానమంత్రులు కె.పి.శర్మ ఓలి, పుష్ప కమల్ దహాల్ (ప్రచండ), షేర్ బహ దూర్ దేవ్‌బా, మాజీ మంత్రులు అర్జూ రాణా దేవుబా, దీపక్ ఖడ్కాలపై నేపాల్ పోలీసుల సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో సహాయంతో మనీ









లాండరింగ్ విభాగం ఈ విచారణ ప్రారంభిం చింది. పోలీసు ప్రధాన కార్యాలయానికి మనీలాం డరింగ్ విభాగం రాసిన లేఖ మేరకు పోలీసులు ఆదివారం మంత్రి ఖడ్కాను ఆయన నివాసం నుండి అరెస్టు చేసి విచారణ ప్రారంభించారు. ఈ కేసు ఈ స్థాయికి చేరుకోవడానికి ముందు గత ఆరునెలలుగా చాపకింద నీరుగా ముమ్మరంగా ప్రాథమిక దర్యాప్తు కొనసాగింది.

2025 సెప్టెంబరునెలలో జనరేషన్ జెడ్ ఉద్యమ సమయంలో ఉద్యమకారులు ఈ నాయకుల ఇళ్ళపై దాడులు చేశారు. ఇళ్ళను దగ్ధం చేశారు. ఈ సమయంలో కాలిపోయిన కరెన్సీ నోట్లు బయట పడటంతో అప్పటినుండీ అధికారులు తమ దర్యాప్తు ముమ్మరం చేశారు.

# విద్యుత్ కేంద్రాలు, చమురు బావులు నేలమట్టం

మాకు ఆయిల్ కావాలి

ఖర్గ్‌ను స్వాధీనం చేసుకుంటాం

ఇరాన్‌కు మళ్ళీ ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్ :** వీలైనంత త్వరగా ఒప్పందానికి రాక పోతే ఇరాన్‌లో ఉన్న విద్యుత్ కేంద్రాలను నేల మట్టం చేస్తామని, చమురు బావులను బాంబు దాడులతో తుడిచిపెడతామని అమెరికా అధ్య క్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరిక జారీ చేశారు. ఫ్లోరిడాలోని వెస్ట్‌పామ్ బీచ్ నుండి వాషిం గ్టన్‌కు వెళుతూ విమానంలో సోమవారం పాత్రికే యులతో ట్రంప్ మాట్లాడారు. ఒకవేళ మొజ్తాబా ఖమేనీ బ్రతికి ఉంటే ఆయన చాలా తీవ్రంగా గాయపడి ఉంటారని ట్రంప్ అన్నారు. ఇరాన్ సర్వాధినేతగా నియమితుడైన మొజ్తాబా చాలా సురక్షితంగా రష్యాకు చేరుకుని శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారని విస్తారంగా వార్తలు వెలు వడుతున్న తరుణంలో ట్రంప్ పైవిధంగా వ్యాఖ్యా నించారు. తాను ప్రతిపాదించిన 15 అంశాల ప్రణాళికపై ఒప్పందానికి రావాలని, లేకపోతే పర్య వసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించిన ట్రంప్ ఇప్పటివరకూ మూడు విడతలుగా ఇరా న్‌కు మొత్తం 16 రోజులపాటు గడువు పొడిగిం చారు. ఈ గడువు ఏప్రిల్ ఆరో తేదీనాటికి ముగిసి పోతుంది. ఇరాన్‌లో కొత్త,హేతుబద్ధమైన ప్రభు త్వంతో అమెరికా చర్చలు కొనసాగిస్తోందని చెప్పారు. తమ ప్రణాళికను అంగీకరించి కాల్పుల విరమణకు ఒప్పుకోకపోతే ఇరాన్‌లో తాము ఇంకా తాకని ప్రదేశాలను నేలమట్టం చేస్తామని



అన్నారు. హోర్ముజ్ సమీపంలో ప్రపంచ దేశాలకు రవాణా చేసేందుకు ఎంతో అనుకూలంగా ఉన్న ఖర్గ్ ద్వీపంలో ఉన్న ఇరాన్ చమురు నిల్వల కేంద్రాన్ని స్వాధీనం చేసుకుంటామన్న హెచ్చరి కను కూడా పునరావృతం చేశారు. "మాకు ఇరాన్ చమురు కావాలి, ఇరాన్‌కు ఎంతో కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం" అని చాలా స్పష్టంగా ఆయన అసలు రంగు బయట పెట్టారు. కాగా ఇంతకుముందు ట్రంప్ చెప్పినవిధంగానే 15 అంశాల ప్రణాళికకు ఇరాన్ అంగీకారం తెలి యజేసిందని, త్వరలోనే ఒక ఒప్పందం కుదురు తుందని మరోవైపు మళ్ళీ వార్తలు రావడం ప్రారం భమయ్యాయి. చాలా డిమాండ్లను ఇరాన్ ఒప్పు కుందని, పాలనా మార్పుల దిశగా ఇరాన్ ప్రయాణం చేస్తోందని ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పి నట్లు ఫైనాన్సియల్ టైమ్స్ (ఎఫ్.టి) పత్రిక పేర్కొంది. ఇరాన్ చమురు తమకు కావాలి,ఖర్గ్‌ను ఆక్రమిస్తాం అని ట్రంప్ చెప్పారని ఎఫ్.టి. పేర్కొంది.

**పశ్చిమాసియాలో 60వేలకు పెరిగిన అమెరికా సైనికుల సంఖ్య**

పశ్చిమాసియా ప్రాంతానికి కొత్తగా వేల సంఖ్యలో భూతల ఉభయచర సామర్థ్యంగల సైనికులను తరలించడంతో అక్కడున్న మొత్తం అమెరికా సైని కుల సంఖ్య 50,0000 దాటిపోయిందని న్యూయార్క్ టైమ్స్ (ఎన్‌వైటి) పత్రిక ప్రకటిం చింది. అణుసామర్థ్యంగల యుఎస్ఎస్ ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర నౌకతోపాటు 5000 మంది ఆది వారంనాటికి పశ్చిమాసియాకు చేరుకున్నారు. ఉభయచరాల తరహాలో భూతలంపైన, సముద్ర రంగంలోనూ పోరాటం చేయగల ప్రత్యేక నైపు ణ్యంగల ఈ సైనికులంతా హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు, ఖర్గ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే ఆపరేషన్‌లో పాల్గొంటారు. న్యూయార్క్ టైమ్స్ సమాచారం ప్రకారం 2,500 మంది మెరైన్లు, మరో 2,500 మంది నావికులు పశ్చిమా సియా జలాల్లో అడుగుపెట్టినట్టు ఎన్‌వైటిని ఉటం కిస్తూ రష్యన్ వార్తాసంస్థ టాస్ ప్రకటించింది.పశ్చి మాసియాలో ప్రస్తుతం సాధారణంకంటే 10,000 మంది అమెరికా సైనికులు ఎక్కువగా ఉన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాల్లో ఎప్పటి నుండో 50,000 మంది సైనికులు తిష్ఠవేసి ఉన్నారు. ఐతే గెరాల్డ్ ఆర్.ఫోర్స్ నౌకలో ఉన్న 4,500 మంది సైనికులను కూడా కలిపితే ఈ సంఖ్య ఇంకా పెరుగుతుంది. మార్చి రెండోవారం తర్వాత ఈ నౌకపై ఇరాన్ క్షిపణి దాడి చేయడంతో నౌక బాగా దెబ్బతింది. ఈ నౌకకు మరమ్మతులు చేసేందుకు క్రొయేషియా అడ్రియాటిక్ తీరంలో ఉన్న స్ప్లిట్ ఓడరేవుకు తరలించారు.

# క్యూబా చేరుకున్న రష్యా చమురు నౌక

సంక్షోభ సమయంలో మానవతా సాయం

క్యూబాకు దూరంగా ఉండాలని

కోస్టారికాకు ట్రంప్ బెదిరింపు

**హవానా :** క్యూబాను లొంగదీసుకునేందుకు ట్రంప్ అష్టదిగ్బంధన జూదం ఆడుతున్నప్పటికీ సోషలిస్టు దేశాలు ఆ దేశానికి అండగా నిలబడుతున్నాయి. ఈ చర్యల్లో భాగంగా రష్యా నుండి ఒక చమురు నౌక క్యూబా ప్రత్యేక ఆర్థిక మండలి ప్రాంతానికి చేరుకుంది. రష్యా నౌక క్యూబా వెళ్ళి ఆ దేశానికి ఇంధన సహాయం చేసేందుకు ట్రంప్ తన అంగీకారం తెలియజేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చా రని న్యూయార్క్ టైమ్స్ (ఎన్‌వైటి) పత్రిక ఒక కథనం రాసుకొచ్చింది.మాన వతా దృక్పథంతో అప్పుడప్పుడు ఇతర దేశాలు క్యూబాకు చమురు,ఇతర విధాలుగా సహాయం చేస్తే అమెరికా ఎప్పటికీ వ్యతిరేకించదని డోనాల్డ్ ట్రంప్ చెప్పినట్లు ఎన్‌వైటి పేర్కొంది. "మా ట్యాంకర్ ఒకటి అక్కడ ఉంది, ఎవరైనా ఓడనిండా చమురు తెచ్చుకోవడానికి మాకు అభ్యంతరం లేదు, క్యూబా కూడా బ్రతికాలి కదా" అని ఫ్లోరిడాలోని వెస్ట్‌పామ్ బీచ్ నుండి వాషింగ్టన్‌కు వెళుతూ విమానంలో పాత్రికేయులకు ట్రంప్ చెప్పారని ఎన్‌వైటి పేర్కొంది. "ప్రస్తుతం క్యూబాకు ఏ దేశమైనా చమురు, ఇతర సహాయం పంపాలనుకుంటే నాకు ఎలాంటి అభ్యంతరం లేదు, అది రష్యా కావచ్చు, మరో దేశం కావచ్చు..." అని ట్రంప్ వ్యాఖ్యానించారు. "ఈ తాత్కాలిక ఇంధన సరఫరాల వల్ల క్యూబాలో సంక్షోభం పరిష్కారం కాదు, ఈ సరఫరాలు ఎలాంటి ప్రభావం చూపించవు, క్యూబా పని ఐపోయింది" అని ట్రంప్ అన్నారు. ఐతే పశ్చిమాసి యాలో సమస్య పరిష్కారం తర్వాత తన పూర్తి దృష్టిని క్యూబా మీదే కేంద్రీకరి స్తానని ఆయన అన్నారు. క్యూబాను లొంగదీసుకోవడమే లక్ష్యంగా ఆయన పావులు కదుపుతున్నారు. క్యూబాలో వామపక్ష కమ్యూనిస్టు ప్రభుత్వ పాల నను ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. క్యూబాలో తమకు అనుకూలమైన పరిపాలకులను నియమించుకుంటామని ఆయన గతంలో కూడా ఉద్ఘాటిం చారు. ఇదే సమయంలో క్యూబాతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న కోస్టారికా దేశానికి ట్రంప్ బెదిరింపులు చేయడంతో ఆ దేశం క్యూబాతో తన సంబంధా లను రద్దు చేసుకుంది. క్యూబా రాజధాని హవానాలో ఉన్న కోస్టారికా దౌత్య కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. క్యూబాతో సంబంధాలను పరిమితం చేసుకుని, ఏప్రిల్ ఒకటో తేదీ నుండీ కాన్సులర్ స్థాయిలో సంబం ధాలు కొనసాగిస్తామని ప్రకటించింది.

## కేంద్రం చొరవ తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

(పెట్రోల్, డీజిల్, గ్యాస్) ఉత్పత్తి రవాణాలపై యుద్ధం ప్రభావానికి గురై సరఫరాపై ప్రభావం పడడంతో తద్వారా ప్రతీ దేశ ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేస్తు న్నాయన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్, లెబ నాన్‌పై అలాగే ఇరాన్ కూడా గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశా లలో ఉన్నటువంటి అమెరికాకు చెందిన రక్షణ స్థావరా లను లక్ష్యంగా చేసుకుని దాడి కొనసాగించడంతో ఈ యుద్ధంలో ఇప్పటికే 4 వేల మంది అమాయకులు మర ణించారని వివరించారు. ఈ మరణాలు ఆ దేశాలకే పరి మితమైనప్పటికీ ఆర్థిక విధ్వంసం మాత్రం ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తుందని, ముఖ్యంగా ఆసియా దేశాలకు మరింత ప్రమాదకరంగా మారిందన్నారు. భార తదేశంపై కూడా తీవ్రమైన ప్రభావం పడుతోందని ఇంత టితోనైనా ఈ యుద్ధాన్ని ఆపకపోతే ప్రపంచ భవష్యత్తు ఆందోళనకరంగా మారనుందని, ఇది మూడో ప్రపంచ యుద్ధానికి కూడా దారితీయవచ్చని పేర్కొన్నారు. ఇది ప్రపంచ మానవాళి మనుగడకే ముప్పు అని, ఇలాంటి అత్యంత ప్రమాదకర పర్యవసనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని యుద్ధాన్ని ఆపడానికి ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి తగిన చొరవ తీసుకోవా లని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు.

## ఏవియేషన్ రంగంలో మెరుగైన అవకాశాలు



వే ఫర్ స్కై చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రైహాన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏవియేషన్ రంగంలో భారతదేశంలో మెరుగైన అవకాశాలు ఉన్నా యని వే ఫర్ స్కై చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రైహాన్ రెసక్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైహాన్ రెసక్ మాట్లాడుతూ విద్యార్థులకు పైలట్ కావాలన్న ఆకాంక్ష ఉంటుందని, కాని అది నెరవేర్చుకునే వేదిక తెలియక చాలా మంది వెనుక బడి పోతున్నారన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఏవియేషన్ ఎక్స్‌పోకు 900 మంది విద్యార్థులు హాజరయ్యారని, వారికి ఏవియేషన్ రంగంపై అవగాహన కల్పించామన్నారు. నగరంలో నాలుగు ఎయిర్‌ఫోర్స్ అకాడమీలు ఉన్నాయని, హైదరాబాద్ ఏవియేషన్ హబ్‌గా మారుతోందని తెలిపారు. విశ్రాంత డీజీసీఏ అధికారి అరవింద్ తప్లియాల్ మాట్లాడుతూ పైలెట్ కావాలంటే డబ్బు ఉన్న వారే కాదు, పేద, మధ్యతరగతి విద్యార్థులకు సైతం అవకాశం కల్పించా లన్నది తమ లక్ష్యమన్నారు. ఇతర దేశాల్లోనూ పైలెట్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారి లైసెన్సులు భారతదేశంలోనూ పనిచేస్తాయని తెలిపారు. దేశంలో ఏవియేషన్ రంగాన్ని మరింత విస్తృతం చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్నేషనల్ ఏవియేషన్ ఫ్లైట్ అకాడమీ ప్రతినిధి కెప్టెన్ యోహాన్, ఉరుగ్వే, జోహాన్స్ బర్గ్, శ్రీలంక దేశాలకు చెందిన ప్రతి నిధులు మారియో సంతోష్, కెప్టెన్ మూసా ధనుంజయ వీరసింహా, స్కై ప్రో అకాడమీ ప్రతినిధి రిషబ్, పునీత్, అంబిక తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన యుద్ధ భయం

(మొదటి పేజీ తరువాయి)

నగరం తబ్రిజ్‌లో పెట్రోకెమికల్ ప్లాంట్‌పైన,అంత ర్జాతీయ విమానాశ్రయంపైన ఇజ్రాయెల్–అమె రికా క్షిపణులు దాడులు చేశాయి. గల్ఫ్ వ్యాప్తంగా ఉన్న అమెరికా, ఇజ్రాయెల్ అధికారుల నివాసా లపై దాడులు చేస్తామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ హెచ్చరించింది. లెబనాన్‌లో ఐక్యరాజ్య సమితి శాంతిదళ సైనికుడు ఇజ్రాయెల్ దాడుల్లో మరణించాడు. దీంతో ఇజ్రాయెల్ చర్యను ఐక్యరా జ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్రంగా ఖండించారు. ఖతార్‌లో అమెరికా దౌత్య కార్యాలయ సిబ్బంది చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక జారీ చేశారు. అత్యవసర సిబ్బందితప్ప ఎవ్వరూ ఉండకూడదని ఆదేశాలు జారీ అయ్యా యి. ఇజ్రాయెల్‌లోని బీర్‌షెబా ప్రాంతంలో ఇరాన్ చేసిన క్షిపణి దాడిలో 13 మంది ఇజ్రాయెలీ పౌరులు గాయపడ్డారు.

ఫ్లోరిడా రాష్ట్రంలో గుర్తుతెలియని డ్రోన్ కలకలం సృష్టించింది. వెస్ట్‌పామ్ బీచ్ నుండి వాషింగ్టన్‌కు ట్రంప్ ప్రయాణం చేసే ఎయిర్‌ఫోర్స్–1 విమాన ప్రయాణమార్గంలో సోమవారం ఒక గుర్తు తెలి యని డ్రోన్ కలకలం సృష్టించింది. ఈ డ్రోన్ రెండు సార్లు ఆయన విమానమార్గంలో ఉల్లంఘటనకు పాల్పడటంతో ఉత్కంఠ రేగింది. ఫ్లోరిడా రాష్ట్రంలో భద్రతా ఆందోళన నెలకుంది. వాషింగ్టన్‌కు ట్రంప్ విమానం బయలుదేరడానికి కొద్ది నిమిషాల ముందు అనుమానాస్పద డ్రోన్ కనిపించిందన్న నివేదికలతో గగనతలాన్ని సురక్షితం చేయడానికి అత్యవసర నిబంధనల అమలు, వేగంగా హెలికా ప్టర్లను రంగంలోకి దించడం, ట్రంప్ విమానాన్ని నిలిపివేయడం వంటి అనేక పరిణామాలకు ఈ పరిస్థితి దారితీసింది. ఈ పరిస్థితులు కొనసాగు తుండగా కొద్ది క్షణాలకే ఒక పౌర విమానం ట్రంప్ విమాన మార్గంలో నిషేధిత గగనతలాన్ని ఉల్లంఘించడంతో ఉద్రిక్తతలు మరింతగా పెరి గాయి. దీంతో నార్త్ అమెరికన్ డిఫెన్స్ ఏరోస్పేస్ కమాండ్ అప్రమత్తమై ఎఫ్–16 యుద్ధ విమానా లను రంగంలోకి దించింది. ఎఫ్–16 యుద్ధ విమానాలు ఆ పౌర విమానాన్ని అడ్డగించి ఫ్లేర్లు ఉపయోగించి సురక్షితంగా గమ్యానికి తరలిం చింది. ఇక ట్రంప్ విమాన మార్గానికి ఎలాంటి భయం లేదని నార్త్ కమాండ్ ప్రకటించినప్పటికీ ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన ట్రంప్ విమానం చుట్టూ ఉన్న భద్రతావలయంపై అనేక సందేహాలు చోటుచుకున్నాయి.

**కువైట్‌లో విషాదం**

**క్షిపణి దాడిలో భారత కార్మికుడు మృతి**

ఇక కువైట్‌లో విషాదం చోటు చేసుకుంది. కువై ట్‌లో విద్యుత్, నీటి శుద్ధి కర్మాగార కేంద్రంపై ఇరాన్ సోమవారం క్షిపణి దాడులు చేసింది. ఆ పక్కనే ఒక సర్వీస్ భవనం కూడా ఉంది. క్షిపణి దాడి తీవ్రతను తట్టుకోలేక భారతీయ కార్మికుడు మరణించాడు. భద్రతా కారణాల రీత్యా ఈ విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారం ఎక్కడ ఉందనే విషయాన్ని కువైట్ ప్రభుత్వం ప్రకటించలేదు. గల్ఫ్‌లో ఒక్కవారంలోనే రెండో భారతీయ కార్మి కుడు మరణించడంపై భారత దౌత్యకార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. మృతుడి వివరాల సేక రణ ప్రారంభించింది. కాగా ఇరాన్‌లో దాడులకు గురైన ఖాన్‌దాబ్ నీటి శుద్ధి కర్మాగారం ఇక పనిచే యడం సాధ్యం కాదని ఐఎఇఎ (అంతర్జాతీయ అణుఇంధన సంస్థ) ప్రకటించింది. దక్షిణ ఇజ్రా యెల్ పారిశ్రామిక వాడపై ఇరాన్ క్షిపణి దాడులు చేయగా బీరూట్ అంతటా ఇజ్రాయెల్ సైనిక దాడులు కొనసాగాయి. నెలరోజులుగా ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంవల్ల 1,340 మంది మరణించారు. మరో 3,500 మంది గాయపడ్డారు.

యుద్ధం ఇంకా పెరిగిపోతుందని భయాలు పెరగ డంతో చమురు ధర సోమవారం ఒక్కసారిగా బ్యారెల్‌కు 115 డాలర్లకు పెరిగింది. భారత్ రూపాయి కూడా యుద్ధంవల్ల వేగంగా పతనమ వుతూ సోమవారంనాటికి డాలరుతో పోలిస్తే మార కం విలువ 95.22 రూపాయల హీనస్థాయికి చేరింది. ఈ పరిస్థితుల్లో బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ వ్యాపారవేత్తలతో టెన్ డౌనింగ్ స్ట్రీట్‌లో కీలక సమావేశం జరిపారు. ఈ యుద్ధం మనది కాదని, ఈ యుద్ధంతో మనకు ఎలాంటి సంబం ధం లేదని మరోసారి ఆయన స్పష్టం చేశారు.

## స్వతంత్ర వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ్ కుమార్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్‌లు బీర్ల అయిలయ్య, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి సోమవారం శాసన మండలిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జర్నలిస్టులతో సిఎం రేవంత్ రెడ్డి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తమ ఉత్పత్తిపై ధర నిర్ణయించే అధికారం లేని ఏకైక ఉత్పత్తి దారుడువ్యవసాయదారుడు మాత్రమేనని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఎస్‌పి విధానా న్ని1950–60లలో ప్రవేశపెట్టి రైతులకు కొత్త ఊపిరిని ఇచ్చిందని ఆయన అన్నారు. అలాగే అందరికీ ఆహారం అందించే లక్ష్యంతో ప్రజాపం పిణీ వ్యవస్థను కూడా కాంగ్రెసే ప్రారంభించింద న్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరగడంతో రేషన్ షాపుల్లో పంపిణీ చేసే దొడ్డు బియ్యం తినడం లేదని, దీనిని అదునుగా తీసుకొని సబ్సిడీ బియ్యాన్ని తక్కువకే కొన్నుకునే మాఫియా తయా రైందన్నారు. అందుకే అందరు తినే విధంగా సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా వ్యక్తికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించి, 2025 మార్చి 30న ప్రారంభించామని రేవంత్ రెడ్డి తెలి పారు. దీని కోసం ఏటా రూ.14, 560 కోట్లు ఖర్చు చేస్తున్నామని, రాష్ట్రంలోని 3.39 కోట్ల మంది (86 శాతం జనాభా) సన్నబియ్యం పథ కాన్ని అనుభవిస్తున్నారని చెప్పారు. దేశంలో మొదలు పెట్టిన నాడు 2.80 కోట్ల లబ్దిదారులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 3.39 కోట్లకు పెరి గిందని, భవిష్యత్తులో వంద శాతం జనాభాకు ఇవ్వాలన్నా కూడా సన్నబియ్యం అందిస్తామ న్నారు. అటు సన్న బియ్యానికి బోనస్, ఇటు ఉచి తంగా సన్న బియ్యం సరఫరాతో మార్కెట్‌లో సన్న బియ్యం రేటు కిలోకు రూ.60 నుంచి రూ.45కి తగ్గిపోయిందన్నారు. అలాగే సన్న వడ్ల విస్తీర్ణం, దిగుబడి పెరిగిందని, రైతులు ఇతర వాణిజ్య పంటలు కూడా పండిస్తే, దాని ఆధారంగా పప్పు, ఇతర నిత్యావసరాలను కూడా రేషన్ షాపు ద్వారా పంపిణీ చేసే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. తెలంగాణ నేలలో జిల్లాకు ఒక పంట పండించే భౌగోళిక పరిస్థితులు ఉన్నాయని, దానికి అనుగు ణంగా ప్రణాళికలు రూపొందించేందుకు వ్యవ సాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ విశ్వవి ద్యాలయం, తదితరులతో టాస్క్ ఫోర్స్ వేయించి, సమగ్ర వ్యవసాయ ప్రణాళిక కోసం అధ్యయనం చేయిస్తామని, కమిటీ సిఫార్సుల ద్వారా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏయే జిల్లాల్లో, ఏయే నేలలో ఏ పంటలు పండుతాయో వారి నిపుణుల కమిటీ అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. గతంలో కెసిఆర్ కూడా వరి వద్దు అని అన్నారు, మీరు అదే మాటను చెబుతున్నట్లుందనే ప్రశ్నకు సిఎం రేవంత్ రెడ్డి బదులిస్తూ, తాను కెసిఆర్‌లాగా బలవంత పెట్టనని, విషయం చెప్పి రైతులే మారే విధంగా అర్థమయ్యేలా చేస్తామన్నారు.

**నియోజకవర్గాల పెంచితే దక్షిణాదికి నిధులు రావు:** నియోజవర్గాల పునర్విభజన కింద నియో జకవర్గాల పెంప, మహిళా రిజర్వేషన్, జమిలీ ఎన్నికలు అనే అంశాలు ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఉన్న లోక్‌సభ 543 స్థానా లకు అదనంగా 50 శాతం సీట్లు కలిపి, 815కు పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తుంద న్నారు. అయితే, పెరిగే సీట్లు, మహిళా రిజర్వేష న్‌ల కింద కేటాయించే సీట్లు రెండే 272 సీట్లే అవు తాయని తెలిపారు. ప్రస్తుతం ఉత్తర భారతదేశంలో 411, దక్షిణ భారతదేశంలో 132 లోక్‌సభ సీట్లు ఉన్నాయని, రెండిటి మధ్య తేడా 279 సీట్లు అని అన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 50 శాతం సీట్ల పెంపుతో ఉత్తరాదిలో సీట్ల సంఖ్య 616, దక్షిణాదిలో 198 అవుతుందని, కానీ తేడా గతంలో కంటే భారీగా పెరిగి 418 అవుతుందని వివరించారు. గతంలో వాజ్‌పేయి ఒక్క ఓటు(సీ టు)తేడాతో వాజ్‌పేయి ప్రభుత్వం పడిపోయిం దని, ఇంత తేడా ఉంటే , దక్షిణాది రాష్ట్రాలలో ఒక్క సీటు లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడుతాయన్నారు. ఇప్పటికే దక్షిణాది పట్ల రాజ కీయ, ఆర్థిక వ్యత్యాసాలను కేంద్రం చూపిస్తోం దని, 50 శాతం స్థానాలు అక్కడ పెరిగితే దక్షిణ భారతదేశాన్ని అసలు పట్టించుకోదని, బండి సంజయ్‌కు మళ్ళీ మంత్రి పదవి కూడా రాదని చెప్పారు. రాష్ట్రపతి పాలన పెట్టి పునర్విభజన కోసం తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని బిజెపి ఎంపి లక్ష్మణ్ అంటున్నాడని, తెలంగా ణలో పెట్టినప్పుడు బిజెపి పాలిత రాష్ట్రాలలో పెట్టరా అని ఆయన ప్రశ్నించారు. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నందునే లక్ష్మణ్ ఉత్తరాదికి లబ్ది చేకూరే ప్రతిపాదనకు మద్దతిస్తున్నాడని, నిజాయితీ ఉంటే రాజీనామా చేసి పో రాదాలన్నారు.

**కెసిఆర్ వల్లే నాకు గుర్తింపు :** రావణుడు ఉన్నం దునే రాముడికి గుర్తింపు వచ్చిందని, శకుని ఉన్నందునే భారతంలో కృష్ణుడి పాత్రకు గుర్తింపు లభించిందని, అట్లాగే కెసిఆర్ ఉన్నందునే తనకు గుర్తింపు వచ్చిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. చెడు ఉన్నప్పుడే మంచికి గుర్తింపు లభిస్తుందని చెప్పారు.

**సన్నబియ్యం రేవంత్‌రెడ్డి బ్రెయిన్ చైల్డ్: ఉత్తమ్**

సన్నబియ్యం పథకం ఆలోచన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని, ఇది పూర్తిగా ఆయన బ్రెయిన్ చైల్డ్ అని పౌర సరఫరాల మంత్రి ఎన్.ఉత్తమ్‌కు మార్ రెడ్డి అన్నారు. యుపిఎ చైర్‌పర్సన్‌గా సోని యగాంధీ అందించిన ఆహార భద్రతా చట్టానికి ఈ పథకం ద్వారా పూర్తి న్యాయం జరిగిందన్నారు. కాగా, సన్నబియ్యం ఆలోచన తనదైనా విజయవం తంగా అమలు చేసింది మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన శాఖ సిబ్బంది అని అన్నారు.

## కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయగలిగితే ఇంతకన్నా మంచి పని ఏది ఉండబో దన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని లెక్కలతో సహా ఆయన సభకు వివరించారు. వివిధ కులాల వారు తమకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారని, ఆలాంటి వారందరికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**న్యాయవాదుల రక్షణకు చట్టం తేవడం అభినందనీయం**

న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావడం అభినందనీయమని సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేనిసాంబశివ రావు అన్నారు. శాసనసభలో సోమవారం తెలం గాణ న్యాయవాదుల రక్షణ బిల్లు2026పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సాంబశివరావు మాట్లాడుతూ అందరికీ న్యాయం దక్కేలా ధర్మం కోసం పనిచేస్తున్న న్యాయవాదులు భయంభ యంగా తమ విధులను నిర్వహించాల్సి వస్తోంద న్నారు. ఈ నేపథ్యంలో వారికి రక్షణ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం సైతం ప్రభుత్వం కృషి చేయా లని, న్యాయవాదులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు యువ న్యాయవాదుల శిక్ష ణకు గాను అకాడమీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటా యించి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విప్తి చేశారు. యువ న్యాయ వాదులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.5 వేల స్టైఫం డ్‌ను రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచ డంతో పాటు మహిళా న్యాయవాదులకు కోర్టు హాళ్లలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. న్యాయవాదులు మరణిస్తే ప్రస్తుతం ఇస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచ డంతో పాటు ప్రమాద బీమాను రూ.25 లక్షలకు పెంచాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

## వ్యతిరేకంగా సెక్షన్లు : కూనంనేని

(మొదటి పేజీ తరువాయి)

కూనంనేని ప్రశ్నించారు. ఇప్పటికే దేశంలో ప్రజాస్వామ్యం నిర్బంధంలో ఉన్నదని, ఉపా చట్టంతో పాటు ఎన్‌ఐఎ కూడా కేసులు నమోదు చేస్తుందని, దీనికి తోడు కేంద్ర నిర్బం ధాలకు రాష్ట్రం కూడా తోడవుతుందని సాంబశి వరావు ఆవేదన వ్యక్తం చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛపై, భాష, కవులు, కళాకారులు, సాంస కృతిక రంగాలపై దాడులు చేసే విధంగా ఈ బిల్లు ఉన్నదని, ఇలాంటి చట్టాలు బ్రిటీష్ కాలంలో ఉండేవని ఆయన అన్నారు. ఈ మధ్య కాలంలో మావోయిస్టుల సంతాప సమావేశా నికి హాజరైన సిపిఐ నాయకులు మంద పవన్‌పై కేసు నమోదు చేశారని అన్నారు.

## సెలక్ట్ కమిటీకి

(మొదటి పేజీ తరువాయి)

ఈ బిల్లును పూర్తి స్థాయిలో పరిశీలించేందుకు 'సె లెక్ట్ కమిటీ'కి సిఫారసు చేస్తూ మంత్రి ప్రతిపాదిం చగా సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపిస్తున్నట్టు స్పీకర్ స్థానంలో ఉన్న ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రకటించారు. అంతకుముందు బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ బిల్లు ద్వారా ప్రజా స్వామ్యం గొంతును నొక్కేందుకు ప్రయత్నిస్తున్నా రని, సామాన్యులపై కక్ష సాధింపుచర్యలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై కూడా కక్షపూరిత చర్యలు తీసుకునే అవకాశాలు ఉంటా యని, అధికారులకు రక్షణ కవచంగా, సామా న్యులకు శిక్షగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం తీరు పోలీసు రాజ్యం వైపు వెళ్తున్నట్టుగా ఉంద న్నారు. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేయాలని సూచించారు. ఎంఐఎం ఎంఎల్‌ఏ అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా ఇప్పటికే ప్రజలలో విద్వే షాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నార న్నారు. ఈ బిల్లు ద్వారా భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగే అవకాశాలు ఉన్నందున సెలెక్ట్ కమి టీకి పంపించాలని సూచించారు. కాంగ్రెస్ సభ్యు లు యశస్వినీరెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడి యాలో మహిళల పట్ల అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు కొత్త బిల్లు ఎంతో ఉపయోగంగా ఉంటుందని, కానీ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేయాలని కోరారు.



## మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై విచారణ చేపట్టాలి

### బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అక్రమ మైనింగ్, భూకబ్జాలకు పాల్పడిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైన విచారణ చేపట్టాలని బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామరావు, బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు ఆధ్వర్యంలో ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలు హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైన విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ' మైనింగ్ నిబంధనలను ఉల్లంఘించిందని, అక్రమంగా జంట జలాశయాల పరిధిలో మైనింగ్ నిషేధం ఉన్నప్పటికీ మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. శాసనసభా సంఘాన్ని ఏర్పాటు చేస్తే అన్ని వాస్తవాలు బయటకు వస్తాయని, మంత్రి పొంగులేటి వందల కోట్ల రూపాయల అక్రమ మైనింగ్‌తో పాటు అక్రమ భూకబ్జాలు బయటకు వస్తాయని కెటిఆర్ తెలిపారు. సిబిసిఐడి లేదా రాష్ట్ర హోం శాఖ అధికారులతో న్యాయం జరుగుతుందనే నమ్మకం తమకు లేదని, అందుకే శాసనమండలి, శాసనసభ్యులతో కూడిన సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని లేదా ఒక ఇండిపెండెంట్ జుడీషియల్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ అవినీతిపైన ఒక స్వతంత్ర విచారణ లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జి, కేంద్ర ప్రభుత్వ సంస్థలతో విచారణకు ఆదేశించేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్టు కెటిఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, పొంగులేటి అక్రమ మైనింగ్ భూకబ్జాల పైన త్వరలోనే తమ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

# కేంద్రం సవతితల్లి ప్రేమ చూపిస్తోంది



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** "తెలంగాణ విలువ ఆధారిత పన్ను (సవరణ) బిల్లు 2026"ను శాసనసభ సోమవారం ఆమోదించింది. బిజెపేతర రాష్ట్రాలకు ఒక పద్ధతి, బిజెపి పాలిత రాష్ట్రాలకు మరో పద్ధతిగా కేంద్రం సవతితల్లి ప్రేమ చూపిస్తోందని, రాజకీయ కోణంలోనే నిధుల కేటాయింపులు జరుగుతోందని విమర్శించారు. ఏ ప్రతిపాదికన ఒక్కో రాష్ట్రానికి కేంద్రం నిధులను కేటాయిస్తుందని ప్రశ్నించారు. ఈ బిల్లును ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిలయన్స్ పెట్రోల్ పంప్, బిపి మొబిలిటీ ద్వారా 2020 సంవత్సరం నుంచి రాష్ట్రానికి వ్యాట్ రావడం లేదని,సెకండ్ సెట్ కింద వ్యాట్ వసూలు చేసేందుకు ఇదివరకే జివోను జారీ చేశామని, దీనిని బిల్లు రూపంలోకి తీసుకొచ్చామని వివరించారు. 2025 జులై నుంచి 2026 ఫిబ్రవరి వరకు రూ.250 కోట్లను వసూలు చేశామన్నారు. అంతకుముందు రూ.220కోట్లు వచ్చేదన్నారు. రిలయన్స్ సంస్థ నుంచి బిపి మొబిలిటి సంస్థ పెట్రోలియంను కొనుగోలు చేసి బంకులకు సరఫరా చేస్తుందని తెలిపారు. బిల్లు ద్వారా ఏడాదికి ప్రతి నెలా రూ.20 నుంచి రూ.47 కోట్లకు రాష్ట్ర ఆదాయం వస్తుందన్నారు. రాష్ట్ర ఆదాయం పెంచేందుకే ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. తమిళనాడు రాష్ట్రం కేంద్రానికి రూ.9,84,627 కోట్లు చెల్లిస్తే, తిరిగి కేంద్రం నుంచి రూ.2,56,000 కోట్లు, కర్నాటక ప్రభుత్వం రూ.16,17,530 కోట్లు చెల్లిస్తే, రూ2,44,480 కోట్లు వస్తుందని, మధ్యప్రదేశ్ రాష్ట్రం రూ.2,60,000 కోట్లు, రూ.4,86,000 కోట్లు వచ్చాయని, బిహార్‌లో రూ.90,663 కోట్లు చెల్లించగా, కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి రూ.6,23,425 కోట్ల నిధులను విడుదల చేశారని వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఒక ఏడాది పాటు చార్జీలను ఎన్నికలు ఎక్కడ వస్తే అక్కడ తగ్గిస్తున్నారని, ఎన్నికల కోసమే ధరలు తగ్గిస్తున్నారని వివరించారు.

**రిలయన్స్ నుంచి ఎగ్గొట్టిన డబ్బులను వసూలు చేయండి : కూనంనేని**



సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రిలయన్స్ కంపెనీ 2025 జూన్ వరకు చార్జీలను చెల్లించకుండా తప్పించుకున్నారని, వారు ఎగ్గొటిన డబ్బులను రికవరీ చేస్తారా? అని ప్రశ్నించారు. రియలన్స్ ఎగ్గొటిన సొమ్మును జరిమానాతో సహా వసూలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాగే ఎగవేతలు, దుర్మార్గ పనుల వల్ల అదానీ, అంబానీలు లక్షల కోట్ల ఆదాయం సంపాదిస్తున్నారని, వారికి పెద్ద పెద్ద వారి అండదండలు ఉంటాయని, అందుకే వారు కావాలనుకున్నప్పుడే కుబేరులు అవుతారని, కానీ సామాన్యులను కాపాడేవారే లేరన్నారు. రాష్ట్రానికి ఉన్న నిధులు, రాష్ట్రం చేతిలో లేదని, కేంద్రం చేతుల్లోకి పోయిందన్నారు. యుద్ధం నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ దొరికే పరిస్థితి ఉండబోదని, ముందస్తుగానే తగిన చర్యలు తీసుకోవాలని, ధరలు పెరగకుండా చూడాలని సూచించారు. పెట్రోల్, ఎక్సైజ్ చార్జీలను తగ్గించేందుకు ప్రయత్నిస్తే, ద్రవ్యోల్బణం నియంత్రణలోకి వస్తుందని, తద్వారా వ్యాపారాలు మళ్లీ పెరుగుతాయని వివరించారు. రైల్వేకు డీజిల్ ట్యాక్స్ 4శాతం, జెట్ ఫ్యూయల్‌కు 19.5 శాతం, ఆర్‌టిసి 27 శాతం ఇస్తున్నారని వివరించారు.



పన్నుల రూపంలో తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూ.4,32,000 కోట్లు వెళ్లగా, కేంద్రం నుంచి 2021 నుంచి 2025 వరకు రూ. 1,76,000 కోట్లు మాత్రమే వచ్చాయని, ఇందులో పనులు, కేంద్ర ప్రయోజిత నిధులు కూడా ఉన్నాయని వివరించారు. రాష్ట్రానికి ఆయువు పట్టుగా ఉన్న పన్నులు జిఎస్‌టి రూపంలో కేంద్రం చేతిలో పోయిందన్నారు.

సిజి ఎస్‌టిలో రూ.60,504 కోట్లు, ఎస్‌జిఎస్‌టిలో రూ.70,963 కోట్లు, ఐజిఎస్‌టిలో రూ.730840 కోట్లు, సెస్ రూపంలో రూ.29,130 కోట్లు, 16వ ఆర్థిక సంఘం నుంచి రూ.3000 కోట్లు వస్తుందని కూనంనేని వివరించారు. పన్నులపైన స్వల్పకాలిక చర్చ పెట్టాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. బిజెపి ఎంఎల్‌ఎ పాయల శంకర్ మాట్లాడుతూ ఏ రంగం నుంచి పన్నులు ఎక్కువగా వస్తాయో ఆ రంగాన్ని ప్రభుత్వాలు పట్టిపీడించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్‌పైన రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలని కోరారు. రైతులకు డీజిల్ విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించాలన్నారు. ఎంఎల్‌ఎ దానం నగేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సింది రాలేదని తద్వారా సమస్యలు వస్తున్నాయన్నారు.

## మూడు కీలక బిల్లులకు ఆమోదం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ సోమవారం మూడు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. మరో బిల్లును సెలక్ట్ కమిటీకి నివేదించింది. తెలంగాణ ప్లాట్ ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, ఉపాధి, రక్షణ,ఆరోగ్యం, సంక్షేమ బిల్లు 2026, కార్మిక, సంక్షేమ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లు 2026ను శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, "తెలంగాణ విలువ ఆధారిత పన్ను (సవరణ )బిల్లు 2026 ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సభలో ప్రవేశపెట్టగా ఈ మూడు బిల్లులను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. "తెలంగాణ విద్వేషపూరితమైన ప్రసంగం, ద్వేషపూరితమైన నేరాలను (వివారించు) బిల్లు 2026"ను మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో ప్రతిపాదించగా బిల్లును సభా సెలక్ట్ కమిటీ నివేదించింది.

**గిగ్ వర్కర్లకు సమాజిక భద్రత : మంత్రి వివేక్**



రాష్ట్రంలో 4 లక్షల మంది గిగ్ వర్కర్లు సేవలను అందిస్తున్నారని, ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ ప్లాట్ ఫాం ఆధారిత గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత, ఉపాధి, రక్షణ,ఆరోగ్యం, సంక్షేమ బిల్లు2026తో వారందరికీ ఉద్యోగ ,సామాజిక భద్రత లభించనుందని మంత్రి వివేక్ తెలిపారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డుతో పాటు సంక్షేమ నిధి కూడ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అదేవిధంగా గిగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించడానికి గ్రివెన్స్ సెల్ కూడ ఉంటుందన్నారు. ఇందుకు బోర్డులో సంబంధింత శాఖ అధికారులతో పాటు గిగ్ వర్కర్లు, యాజమన్యాలు సభ్యులుగా ఉంటారని వెల్లడించారు. బోర్డు ఏర్పాటు తర్వాత విధి విధానాలను ఖరారు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ సభ్యులు మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్, బిజెపి సభ్యులు పాల్వాయి హరీష్‌లు చర్చలో పాల్గొన్నారు.

**న్యాయవాదులకు రక్షణ కవచం : శ్రీధర్‌బాబు**



ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లు 2026 న్యాయవాదులకు రక్షణ కవచం కానుందన్నారు. రాష్ట్రం వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో న్యాయవాదులపై భౌతిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వారి రక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బిల్లును తీసువచ్చిందని తెలిపారు. మంథనిలో న్యాయవాదులు వామనరావు, నాగమణి దంపతులను అత్యంత పాశవికంగా హత్య చేశారని ఇప్పటికీ ఆ కుటుంబానికి న్యాయం జరగలేదని వెల్లడించారు. బిల్లుపై కాంగ్రెస్ సభ్యులు జి.మధుసూదన్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన న్యాయవాదులకు రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం అభినందనీమన్నారు. బిజెపి సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి యువ న్యాయవాదులు కేసులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆలాంటి వారిని ఆదుకునేందుకు 5 ఏళ్ల పాటు గౌరవ వేతనంగా కనీసం నెలకు రూ.50వేలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పరంగా నియమించే అడ్వకేట్ జనరల్ తదితర 70 శాతం పోస్టులను బిసి, ఎస్‌సి, ఎస్‌టిలను నియమించాలన్నారు. ఎఐఎంఐఎం సభ్యులు మోహిద్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లును పూర్తిగా మద్దతు ఇస్తున్నామని తెలిపారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కేంద్రానికి తప్పుడు నివేదికలు అందించారు

### బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించిన కాంగ్రెస్, అంచనాలు, అనుమతులు తదితర అంశాలపై కేంద్రానికి తప్పుడు నివేదికలు సమర్పించారని బిజెపి ఎంఎల్‌ఎ కాటిపల్లి వెంకటరమణ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఘోష్ కమిషన్ కమిటీ నివేదిక ఆధారంగా సిబిఐ విచారణ కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా తమ పార్టీ నేతలు ఈ అంశంపై కట్టుబడి ఉన్నామని తెలిపారు. ముఖ్యమంత్రి మెగా ఇంజనీరింగ్ కంపెనీకి సంబంధించిన కాంట్రాక్టుల అంశాన్ని ఎక్కడా ప్రస్తావించలేదని, మన ఊరు మన బడి పథకం కింద అదే సంస్థకు మళ్లీ పనులు ఇవ్వడం సరైంది కాదని విమర్శించారు. అయితే ఘోష్ కమిటీ నివేదికను ప్రజలకు విడుదల చేయకుండా సిబిఐ విచారణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మైనింగ్ అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని కోరితే, సిబిసిఐడికి అప్పగిస్తామని చెప్పడం సరైన నిర్ణయం కాదని అన్నారు.

**మంత్రి పొంగులేటిపై బిఆర్ఎస్ నిరాధార ఆరోపణలు : పాయం వెంకటేశ్వర్లు**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై బిఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి వ్యాఖ్యలు సమంజసం కాదని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు సభలో నిరాధార ఆరోపణలు చేస్తూ, మంత్రుల వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ సమయాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారని చెప్పుకొచ్చారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మైనింగ్, సాండ్ మాఫియాలపై సిబిసిఐడి విచారణకు ఆదేశించినందుకే సభను సజావుగా నడవనివ్వలేదని పేర్కొన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్‌కు గట్టి సమాధానం ఇచ్చినా వారి తీరు మారలేదని అన్నారు.

**బడ్జెట్ ఓ అంకెల గారడీ : బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీలా ఉందని బిజెపి ఎమ్మెల్యే అంజిరెడ్డి అభిప్రాయపడ్డారు. శాసన మండలి మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ రెండు సభల్లో బడ్జెట్‌పై సమగ్రంగా చర్చ జరపకుండా అధికార, ప్రతిపక్ష పార్టీలు గందరగోళం సృష్టిస్తూ బిల్లులను ఆమోదించాయని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన డిఎ, పిఆర్‌సి, సరెండర్ లీవ్ అంశాల్లో స్పష్టత లేకపోవడం, పోలీస్ శాఖ ఉద్యోగుల డిమాండ్లపై కూడా ప్రభుత్వం స్పందించడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 5.5 లక్షల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, ప్రతి ఉద్యోగి జీతం నుంచి రూ.8 వేల వరకు అవినీతి జరుగుతోందని, మొత్తంగా ప్రతి నెల సుమారు రూ.400 కోట్ల అవినీతి జరుగుతోందని వివరించారు.

**సభలో గందరగోళం సృష్టించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం: అద్దంకి దయాకర్**



ద్రవ్య వినిమయ బిల్లు మోదం పొందే కీలక సమయంలో సభలో గందరగోళం సృష్టించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, సభలో అల్లర్లు సృష్టించిన సభ్యులపై శాశ్వత సస్పెన్షన్ విధించాలని అద్దంకి దయాకర్ కోరారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు ముందుగానే ప్రణాళిక రచించి సభలో అల్లర్లు సృష్టించి, అనంతరం గవర్నర్‌ను ఆశ్రయించడం అనుచితమని విమర్శించారు. శాసనమండలి పునరుద్ధరణ తర్వాత మొదటిసారిగా సభ్యుల సస్పెన్షన్ జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ అంశంపై ప్రభుత్వం సిబిసిఐడి విచారణకు సిద్ధంగా ఉందని, గతంలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుని నాయకులు బాధ్యతతో వ్యవహరించాలని దయాకర్ సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పీకర్, చైర్మన్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### ఎమ్మెల్సీ విజయశాంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. శాసనమండలిలో సోమవారం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన వారి కుటుంబాలను ఆదుకుంటామని ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, అలాగే నెలకు రూ.25 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చామని, కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఈ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. జూన్ 2న తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేస్తామని చెప్పినప్పటికీ, ఆ ఊసే లేదని ఆమె అన్నారు. ఉద్యమ సమయంలో నమోదైన కేసులను ఎత్తివేస్తామన్న హామీ కూడా పెండింగ్‌లో ఉండటంపై విజయశాంతి అసహనం వ్యక్తం చేశారు. 'మనం అధికారంలోకి రాక ముందు ఉద్యమకారులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని చెప్పాం. ఇప్పుడు ఆ ఉద్యమకారులే రోడ్ల మీదకు వచ్చి తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడుగుతున్నారు. వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది' అని విజయశాంతి అన్నారు. ఉద్యమకారుల త్యాగాల పునాదులపై ఏర్పడిన రాష్ట్రంలో వారిని విస్మరించడం సరికాదని విజయశాంతి అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే ఉద్యమకారుల గుర్తింపు కార్డులు జారీచేయాలనికోరారు.

## శాసనమండలిలో కీలక బిల్లుల ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనమండలి సోమవారం పలు కీలక బిల్లులను ఆమోదించింది. సభలో మంత్రులు అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సి.దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, జి.వివేక్ వెంకటస్వామి బిల్లులను ప్రవేశపెట్టగా సుదీర్ఘ చర్చ అనంతరం బిల్లులు ఆమోదం పొందాయి. తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం బిల్లు, పన్నుల వ్యవస్థలో పారదర్శకత, సరళీకరణకు ఉద్దేశించిన తెలంగాణ వస్తు సేవలు, పన్ను (టిజిఎస్‌టి) సవరణ బిల్లు సభ ఆమోదించింది. దీనితో పాటు వ్యాట్ సవరణ బిల్లు కూడా సభ ఆమోదం పొందింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ రద్దు బిల్లు, అసంఘటిత రంగంలో ఉన్న డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్ల వంటి గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ఉద్దేశించిన గిగ్ వర్కర్ల బిల్లు, తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లుకు కూడా సభ ఆమోద ముద్రవేసింది.

## పారాక్వాట్ డైక్లోరైడ్ నిషేధించాలి

### అసెంబ్లీలో తీర్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం శాసనసభలో కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వ్యవసాయంలో విస్తృతంగా వినియోగిస్తున్న పారాక్వాట్ డైక్లోరైడ్ (24శాతం) ఎస్ఎల్ అనే ప్రమాదకర గడ్డిమందును తక్షణమే నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ మంత్రి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజ, పర్యావరణ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ఈ తీర్మానం చేసిందని స్పష్టం చేశారు. పారాక్వాట్ వినియోగం వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, అనేక సందర్భాల్లో ఇది ప్రాణాంతకంగా మారుతున్నదని ఆయన పేర్కొన్నారు. క్షణికావేశంలో ఈ రసాయనం సేవించడం వల్ల జరుగుతున్న ప్రాణ నష్టాలు కూడా ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపారు.ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. పారాక్వాట్ వంటి అత్యంత విషపూరిత రసాయనాల వినియోగం సుస్థిర, సహజ వ్యవసాయ విధానాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే యూరప్ సహా అనేక దేశాలలో పారాక్వాట్ పై నిషేధంతో కఠిన నియంత్రణలు అమలులో ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రంలో కూడా ఇలాంటి ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని అరికట్టడం అత్యవసరమని పేర్కొన్నారు. పారాక్వాట్‌కు ప్రత్యామ్నాయంగా అనేక గడ్డిమందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని పారాక్వాట్ డైక్లోరైడ్ తయారీ, దిగుమతి, నిల్వ, రవాణా, విక్రయం వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించాలని రాష్ట్ర అసెంబ్లీ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి మంత్రి విజ్ఞప్తి చేశారు. మంత్రి ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది.

## ఆటోగ్యాస్ కొరతను అధిగమించడానికి ప్రజా రవాణా సేవల విస్తరణ

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాహనా గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రజా రవాణా సేవలను మరింత విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నామని పౌర సరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.ఎల్.పి.జి గ్యాస్ కొరతతో ఆటోలతో సహా గ్యాస్ ఆధారిత వాహనాలు ఎదుర్కొంటున్న ఇక్కట్లపై సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పౌర సరఫరాల శాఖ అధికారులతో పాటు ఎల్.పి.జి గ్యాస్ సరఫరా చేస్తున్న ప్రధాన పంపిణీ దారులతో డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర,హైదరాబాద్ కలెక్టర్ హారిచందనలతో పాటు ఐ.ఓ.సి.ఎల్, గోగ్యాస్,ఫ్రెంచ్ కీ చెందిన టోటల్ ఎనర్జీలతో పాటు సూపర్ గ్యాస్,ప్రమ్ గ్యాస్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలతో ఏర్పడిన కొరతను భర్తీ చేయడానికి గాను ఐ.ఓ.సి.ఎల్, హెచ్.పి.సి.ఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుకు రావాలన్నారు. వాహనాలకు సరఫరా చేసే ఎల్.పి.జి గ్యాస్ సరఫరాలో ఏర్పడ్డ సంక్షోబాన్ని నివారించేందుకు గాను సరఫరాలను పెంచాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖామంత్రి హార్‌దీప్ సింగ్ పూరీ కి లేఖ రాయలని పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అదే సమయంలో గ్యాస్ ఆధారిత ఆటో సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితిని పారదర్శకంగా వివరించాలని ఆయన సూచించారు. గ్యాస్ ఆధారిత ఆటోలతో పాటు ఆటోలకు రోజువారీగా 202 మెట్రిక్ టన్నుల గ్యాస్ అవసరం ఉండగా ప్రస్తుతం రోజు వారీగా 147 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంటుండగా లోటు 55 మెట్రిక్ టన్నులు లోటు ఏర్పడుతోందని చెప్పారు. ఆటో ఎల్.పి.జి సరఫరాలో 75 శాతం వాటాను ప్రైవేటు సంస్థలు కలిగి ఉండడంతో ఈ రంగంపై ఆ కొరత ఉంటుందని చెప్పారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఔటర్ రింగ్ రోడ్డు లోపల 116 , బయట 27తో కలిపి మొత్తం 143 ఉండగా అందులో 23 ఔట్ లెట్లు పనిచేయడం లేదన్నారు. వాటిలో 17 నగరం నడిబొడ్డున ఉన్నాయన్నారు. పలు సంస్థలు ప్రత్యామ్నాయ అంతర్జాతీయ వనరులను పరిశీలిస్తున్నాయని అయితే ఖచ్చితమైన సమయం చెప్పలేమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## రిటైర్డ్ ప్రొఫెసర్ అన్సారీకి పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మహమ్మద్ అన్సారీకి రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, వైద్య సహాయం అందించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం ఆయన సిఎంకు లేఖ రాశారు. ఉస్మానియా యూనివర్సిటీ లింగ్విస్టిక్ విభాగంలో సేవలందించిన రిటైర్డ్ ప్రొఫెసర్ మహమ్మద్ అన్సారీ అనారోగ్యంతో చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారని, వైద్యానికి కూడ డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం మానవతా దృక్పథంతో అన్సారీకి రావాల్సిన పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ కోరారు.

## శాసనమండలిలో సభను అడ్డుకున్న బిఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనమండలిలో సోమవారం అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యుల ఆందోళనతో సభలో గందరగోళం నెలకొంది. అక్రమ మైనింగ్ అంశంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాలంటూ నినాదాలు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వస్తున్న ఆరోపణలపై చర్చకు పట్టుబట్టిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీలను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఒకరోజు పాటు సభ నుంచి సస్పెండ్ చేశారు. సభ ప్రారంభం కాగానే బిఆర్ఎస్ సభ్యులు మంత్రి పొంగులేటి వ్యవహారంపై హౌజ్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ పోడియం వద్దకు దూసుకెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. చైర్మన్ పదే పదే విజ్ఞప్తి చేసినా సభ్యులు శాంతించకపోవడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో మార్షల్స్ రంగంలోకి దిగడంతో సభ్యులకు, మార్షల్స్‌కు మధ్య తోపులాట జరిగింది. కొందరు సభ్యులు సీట్లపైకి ఎక్కి మరీ నిరసన తెలపడంపై చైర్మన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ సభ్యులు



పేపర్లు చించి, చైర్మన్‌పైకి విసిరివేశారు. పలుమార్లు సీట్లలోకి వెళ్లాలని చైర్మన్ విజ్ఞప్తి చేసినప్పటికీ సభ్యులు వినకపోవడంతో సభలో గందరగోళం నెలకొంది. సభా నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించినందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్సీలను సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రతిపాదించడంతో బిఆర్ఎస్ సభ్యులను సస్పెండ చేస్తూ చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో బిఆర్ఎస్ఎల్‌పి నేత మధుసూదనాచారి, రవీందర్ రావు, దేశపతి శ్రీనివాస్, ఎల్. రమణ, యాదవ రెడ్డి, సుంకరి రాజు, నవీన్ కుమార్ రెడ్డి, మధుసూదన్, వాణిదేవి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎం. కోటిరెడ్డి తదితరులు ఉన్నారు. 'పెద్దల సభ గౌరవాన్ని కాపాడాలి. ఇలాంటి ప్రవర్తన సరికాదు. ఇలాంటి వారు మండలికి రావడం దురదుష్టకరం' అంటూ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభ్యుల తీరుపై మండిపడ్డారు.

**బిఆర్ఎస్ సభ్యుల తీరును తప్పుబట్టిన మంత్రి శ్రీధర్ బాబు**

బిఆర్ఎస్ సభ్యుల తీరును మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రంగా తప్పుపట్టారు. 2014 నుంచి జరిగిన మైనింగ్ అక్రమాలపై ఇప్పటికే సిబిసిఐడి విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని ఆయన గుర్తు చేశారు. 'గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేసిన హౌజ్ కమిటీలు నివేదికలే ఇవ్వలేదు. ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసమే సభను అడ్డుకుంటున్నారు' అని విమర్శించారు. ప్రభుత్వ విచారణకు సహకరించకుండా హౌజ్ కమిటీ పేరుతో కాలయాపన చేయడం సరికాదని ఆయన హితవు పలికారు.

# యాదగిరిగుట్ట దేవస్థానంలో బదిలీల వేటు

### పాతుకుపోయిన అధికారుల్లో 'వణుకు'!

**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఉక్కుపాదం మోపింది. రాజకీయ అండదండలతో దేవస్థానాన్ని అడ్డాగా మార్చుకున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, ప్రక్షాళన పర్వానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే, సుదీర్ఘ కాలంగా ఇక్కడే కొనసాగుతున్న ఉప కార్యనిర్వహణ అధికారి (డిప్యూటీ ఈఓ) డి.భాస్కర్ శర్మను సోమవారం వేములవాడకు బదిలీ చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేయడం ఇప్పుడు ఆలయ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది.

**రాజకీయ పలుకుబడికి 'చెక్'..**
కారుణ్య నియామకం ద్వారా విధుల్లోకి చేరిన భాస్కర్ శర్మ, తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని ఏళ్ల తరబడి గుట్టలోనే పాతుకుపోయారనే విమర్శలు ఉన్నాయి. 18 నెలల క్రితం వేములవాడ నుంచి డిప్యూటీ ఈఓగా బదిలీపై వచ్చిన నవీన్ కుమార్ అనే అధికారికి, భాస్కర్ శర్మ తన పరపతితో అడ్డుతగిలినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. సీనియర్ అధికారి అయిన నవీన్ కుమార్కు డిప్యూటీ ఈఓ విధులు అప్పగించకుండా, కేవలం ఏఈఓ స్థాయి బాధ్యతలకే పరిమితం చేసిన వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతోనే బదిలీ వేటు పడినట్లు సమాచారం.

**డిప్యూటేషన్ల మాయాజాలం**
రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం దేవాలయాల పరిపాలనను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తుంటే, కొందరు అధికారులు మాత్రం 'డిప్యూటేషన్' మంత్రాన్ని జపిస్తున్నారు. గతంలో బదిలీ అయినప్పటికీ, వేములవాడ, కొమురవెల్లి వంటి ప్రాంతాల నుంచి తిరిగి యాదగిరిగుట్టకే డిప్యూటేషన్ మీద రావడం గమనార్హం.

గతంలో ఎండోమెంట్ డైరెక్టర్, ఈ దేవస్థానం ఇంచార్జ్ ఈఓగా ఉన్న ఎస్.వెంకట్రావు డిప్యూటేషన్ అధికారులను వెనక్కి పంపుతూ ఉత్తర్వులు ఇచ్చినా, రాజకీయ ఒత్తిళ్లతో కొద్ది రోజుల్లోనే ఆ ఉత్తర్వులను రద్దు చేయాల్సి వచ్చిందంటే ఇక్కడి అధికారుల ప్రభావం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.



**వివిఐపి 'సేవ'లో తరిస్తూ.. తిష్టవేసి!**
ఆలయంలోని కీలక విభాగాల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు భక్తుల సేవ కంటే వి.వి.ఐ.పిల సేవకే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యమైన పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు, ఉన్నత అధికారుల పుట్టినరోజులు, పెళ్లిరోజుల సమయంలో స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేస్తూ వారిని 'ప్రసన్నం' చేసుకుంటున్నారు. ఈ రకమైన సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని ఆలయ పరిపాలనలో తమదే పైచేయిగా వ్యవహరిస్తున్నారు.

**అధికారుల్లో మొదలైన వణుకు**
తాజా బదిలీతో దేవస్థానంలోని వివిధ విభాగాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న సహాయ కార్యనిర్వహణ అధికారులు, పర్యవేక్షణ అధికారులకు బదిలీ భయం పట్టుకుంది. ప్రభుత్వం ప్రక్షాళనను ఇలాగే కొనసాగిస్తే ఏళ్ల తరబడి దేవస్థానంలో తిష్ట వేసిన కొందరి అధికారుల సీట్లు కదలడం ఖాయమని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## భగ్గుమన్న పాత కక్షలు...

### కర్రలతో ఇరువర్గాల దాడి

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని అడ్లూరు పునరావాస కేంద్రంలో జరిగిన గ్రామసభలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామ కార్యదర్శి అవినాష్ రెడ్డి గత గ్రామసభలో చర్చించుకున్న విషయాల పురోగతిపై సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచ్ గువ్వల శిరీష అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామంలోని పలు అంశాలపై చర్చిస్తుండగా వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఉపసర్పంచ్ తన అనుమతి లేకుండా నిధులు ఎలా విత్డ్రా చేస్తారని ఆరోపించారు. సర్పంచ్, ఉపసర్పంచ్ జాయింట్ చెక్పవర్ అంశం, గ్రామంలోని దేవాలయ నిర్మాణం, ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన అంశాలపై ఇరు వర్గాలకు తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాలు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువర్గాలను అదుపు చేసి చదరగొట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 30 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 25, జిల్లా గ్రామీణ అభివృద్ధి 2, హౌసింగ్ 2, మున్సిపాలిటీ ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి తక్షణ కృషి

### జిల్లా ఎస్పి కె.నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజల సమస్యల చట్టపర పరిష్కారానికి తక్షణ కృషి అవసరమని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పి కె నరసింహ దిశానిర్దేశం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు, సూచనలు చేశారు. సమస్యలపై తక్షణమే స్పందించి బాధితులకు బరోసా కల్పించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## తెలంగాణ క్రీడా ప్రాజెక్టులకు కేంద్రం మద్దతునివ్వాలి

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన నిధులు విడుదల చేయాలని భువనగిరి లోక్సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖను ఉద్దేశించి ఆయన పలు కీలక ప్రశ్నలు సంధించారు. గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి అథ్లెటిక్స్ స్టేడియం ఆధునీకరణ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో అత్యాధునిక షూటింగ్ రేంజ్ ఏర్పాటుతో పాటు రాష్ట్రంలో స్పోర్ట్స్ హబ్, స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు అవసరమైన కేంద్ర ఆర్థిక సహాయం అందించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఎంపీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వక సమాధానం ఇస్తూ.. క్రీడలు అనేది రాష్ట్ర పరిధిలోని అంశమని, ప్రాథమికంగా మౌలిక సదుపాయాల కల్పన బాధ్యత రాష్ట్రాలదేనని పేర్కొంది. అయితే, 'ఖేలో ఇండియా' వంటి పథకాల కింద రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతిపాదనలను నిబంధనల మేరకు పరిశీలించి, అర్హతను బట్టి తగిన ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించింది. ఈ నేపథ్యంలో చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో అద్భుతమైన క్రీడా నైపుణ్యం కలిగిన యువత ఉన్నారని, వారికి అంతర్జాతీయ స్థాయి వేదికలు కల్పించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సకాలంలో మద్దతు మరియు నిధులు లభిస్తే, రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి, యువతకు మెరుగైన అవకాశాల కల్పనకు ఎంతో దోహదం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రణాళిక

### పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అన్ని రంగాల్లో ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రణాళిక రూపొందిస్తున్నామని పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నూతన పాలకవర్గం ఏర్పాటైన మొదటి కౌన్సిల్ సమావేశం ఆయన అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. తెలంగాణ పురపాలక సంఘముల చట్టం ప్రకారం 2026–27 వార్షిక ఫైనాన్షియల్ బడ్జెట్ అంచనా వ్యయాల నివేదికను వివరించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరుల నుండి అంచనా బడ్జెట్ రూ.859.25 లక్షలు గాను ఉద్యోగుల జీతభత్యాలు పార్కుల నిర్వహణ పారిశుద్ధ్య నిర్వహణ ఔట్సోర్సింగ్ సిబ్బంది జీతాలు కార్యాలయ సాధారణ ఖర్చులు వార్డుల వారిగా సాధారణ ఖర్చులకు ఇంకా ఇతర వాటికోసం కోసం అంచనా బడ్జెట్ రూ.859.25 లక్షలుగా నివేదికలను రూపొందించి కౌన్సిల్చే ఆమోదించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కమిషనర్ వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్స్ శ్రీరామ మంజుల లింగస్వామి, కొండమడుగు ఎల్ల స్వామి, రావుల జంగయ్య, పెద్దల చక్రపాణి, బాత్క లింగస్వామి, కర్నాటి వరలక్ష్మి నరసింహ, రాపోలు కావ్య వేణు, దేవరాయ కుమార్, జింకల లావణ్య యాదగిరి, సూరేపల్లి రాధిక రమేష్, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ప్రణాళికాబద్ధంగా సమస్యల పరిష్కారం

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మున్సిపాలిటిలో సమస్యలను ప్రణాళికబద్ధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సోమవారం పట్టణంలోని రవి మహాల్ ఫంక్షన్ హాల్లో మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అధ్యక్షతన నిర్వహించిన పురపాలక సంఘం 2025–26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026–27 ముసాయిదా బడ్జెట్ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. వార్డు స్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా పరిష్కరించడం మున్సిపల్ పాలకమండలి బాధ్యతన్నారు. నూతన పాలక మండలి తొలి సమావేశంలోనే రూ.107.30లక్షలతో బడ్జెట్ రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ బడ్జెట్ లక్ష్యాలకు అనుగుణంగా మున్సిపాలిటి ఆదాయ వనరులను పెంపొందించి పట్టణ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్ళాలని సూచించారు. పరిశుభ్రత నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. రోడ్లు, మురిగి కాల్వలు, కల్వర్టులు, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మున్సిపాలిటికి రావల్సిన ఇంటి పన్ను, నల్లా బిల్లులు, ఇతర బకాయిల వసూళ్లలో ప్రజలను చైతన్యపరిచి సమయానికి చెల్లించేలా ప్రోత్సహించాలన్నారు. అక్రమ భవన నిర్మాణాలను అరికట్టి, మున్సిపాలిటికి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో సూర్యాపేట మున్సిపాలిటి సాధించిన గుర్తింపును తిరిగి సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీఉల్లా, కమీషనర్ హన్మంత రెడ్డి, మున్సిపల్ పాలక మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## సమన్వయంతో సంఘాలు పనిచేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రభుత్వ ఉద్యోగులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని,వారి సేవలు ప్రజలకు చేరువ కావడానికి సంఘాలు సమన్వయంతో పనిచేయడం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టిఎస్ ఎంఈఎస్ఏ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఏ.ఏ.ఖాన్ భవిష్యత్తులో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు సహకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం,సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎప్పటికప్పుడు కృషి చేస్తోందని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలతో కలిసి చర్యలు పని చేస్తామన్నిరు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)వై.అశోక్ రెడ్డి, చండూర్ ఆర్డిఓశ్రీదేవి, డిఆర్డిఓ వై.శేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మహ్మద్ మోయిజ్, ప్రొఫసర్ సయ్యద్ అలీ, జనరల్ సెక్రటరీ మహ్మద్ మహమూద్, అసోసియేట్ ప్రెసిడెంట్ సయ్యద్ అన్వరుద్దీన్, ఎండి అతీక్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ ఎస్కె అఫ్జల్ బాబా, అబ్దుల్ హాఫీజ్, ఎంఏ గఫార్, ఎండి నజీర్ అలీ, ఎండిఅన్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డ్రైవర్లకు కంటి పరీక్షలు

### నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా ఉంటాం: సూర్యాపేట జిల్లా ఎస్పి కె.నర్సింహ

**ప్రజాపక్షం/కోదాడ:** రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడం ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర పోలీస్, డిజిపి ప్రారంభించిన ఆరవ్ అలైవ్ మహా ఉద్యమం కార్యక్రమం 3వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కోదాడ పబ్లిక్ క్లబ్ పంక్షన్ హాల్లో పోలీసుల ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పి కె.నర్సింహ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచివారికి పోలీస్ మిత్రుడు, ప్రెండ్లీ పోలీస్, నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా ఉంటామని, ప్రజల రక్షణలో అనుక్షణం పని చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలు ప్రధాన సమస్యగా మారాయని వీటినివారణకు జాగ్రత్తలు పాటించి అవగాహన చేసుకోవడం ముఖ్యమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీస్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేయించామన్నారు. ఈ శిబిరంలో కోదాడ పట్టణానికి చెందిన అశోక్ కంటి ఆసుపత్రి, పుల్లారి కంటి ఆసుపత్రి, సురభి కంటి ఆసుపత్రి, లక్ష్మి కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. రోడ్డు భద్రత అంటే రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, వాహనాలను



జాగ్రత్తగా డిఫెన్సివ్తో నడిపి ప్రమాదాలను నివారంచడం రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకంగా, ప్రతి వాహనదారుడు ఎక్కడ పడితే అక్కడ వాహనాలు అపవద్దని, ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్ఫోన్ వాడవద్దని, సీటుబెల్టు , ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. ఈ శిబిరం ద్వారా 500 మందికి పైగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, పట్టణ సిఐ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐ సుధీర్, కంటి డాక్టర్లు అశోక్కుమార్, మల్లీశ్వరి, రామతులసి, రామ్చరణ్, పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

## అన్నారంలో పించన్ పంపిణీలో అవకతవకలు

### ప్రతి వ్యక్తికి పింఛన్లో రూ.16 ఇవ్వడంలో గోల్మాల్

### పోస్టుమాస్టర్పై చర్యలు తీసుకోవాలని ఆందోళన

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** గత కొన్ని సంవత్సరాలుగా పింఛన్ పంపిణీ ప్రక్రియలో ఇష్టారాజ్యంగా నెలకు వేల రూపాయలు పింఛన్దారులు నష్టపోతున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూశాయి. తుంగతుర్తి మండలం, అన్నారం గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా సుమారు 800పై చిలుకు పింఛన్దారులు ప్రతినెలా పింఛన్లు తీసుకుంటున్నారు. ఒక్కరికి రూ.2,016, రూ.4,016లు పంపిణీ చేయాల్సి ఉండగా సంబంధిత పోస్టల్ అధికారి కొందరికి రూ.16లు ఇవ్వకపోవడం, మరికొందరికి రూ.6 ల చిల్లర ఇవ్వకపోవడం, మరి కొంతమంది నెలనెల దాచుకున్న డబ్బులు ఎఫ్.డి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, పూర్తయినా, నేటి వరకు కూడా వారి కుటుంబానికి డబ్బులు అందించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అన్నారం గ్రామానికి చెందిన పోస్టుమాస్టర్ కనీసం పింఛన్దారుల పాసుబుక్లు కూడా ఇవ్వకపోవడం దారుణమని విమర్శిస్తున్నారు. ఒక్క గ్రామంలోనే పింఛన్దారుల డబ్బులు వేల రూపాయలు మిగిలిచ్చుకుంటున్నారని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. దీనితో మొత్తం మండలంలో ప్రతి సంవత్సరం లక్షల రూపాయలు పింఛన్దారులు నష్టపోతున్నారు. గ్రామాల్లో ఇది ఎందుకు జరుగుతుందని, ఏవిధంగా జరుగుతుందని ప్రశ్నించే వారే లేకపోయారు. మండలంలో వందల మంది



పింఛన్దారులకు జరుగుతున్న సమస్యలను జిల్లా కలెక్టర్, జిల్లా పోస్టల్ ఉన్నత శాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి పేద పింఛన్దారులకు న్యాయం చేయాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

**పోస్టల్ జిల్లా ఉన్నతాధికారి బుచ్చిబాబు వివరణ...**
పింఛన్దారులకు జరుగుతున్న అన్యాయంపై జిల్లా పోస్టల్ ఉన్నతాధికారి బుచ్చిబాబును ఫోన్లో బాధితులు వివరణ కోరగా తమకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపించి నిజమని తేలితే అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రాష్ట్రంలో వేలాది మంది పనిచేస్తున్న ఆశ వర్కర్సను రాష్ట్ర ప్రభుత్వం కనీస కాంట్రాక్ట్ వర్కర్గా గుర్తించాలని కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని ఏఐటియుసి అనుబంధ సంఘమైన ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ తీసి, కొత్తబస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ ఎన్ కవిత, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం వెంటనే కల్పించాలని ప్రతి ఆశాకు రూ.10లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం, లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. మెడికల్ డిపార్టుమెంట్లో నూతనంగా విడుదల చేసిన నోటిఫికేషన్లు ఆశల అర్హతను బట్టి ఏఎన్ఎం, జిఎన్ఎమ్, ల్యాబ్టెక్నిషియన్ తదితర పోస్టులలో ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. గత కొన్ని ఏండ్లుగా పెండింగ్లో ఉన్న సర్వేలు, పోలియో, ఎన్నికల విధులు, పరీక్ష పనికి సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకోలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, గౌరవ సలహాదారులు శ్యామల అశోక్, జిల్లా నాయకురాలు ఉమాహుస్సేనీ, సోమక్క, జ్యోతి, సుధా, సరస్వతి, అరుణ, సీత, జయమ్మ, సక్కుబాయి, బైనాబాయి పాల్గొన్నారు.

## రూ.107.30కోట్ల అంచనా బడ్జెట్కు ఆమోదం

### అభివృద్ధికి అందరూ సహకరించాలి

### ఆదాయ వనరుల పెంపుతో పట్టణాభివృద్ధి సాధ్యం : మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటి 2026–27 ఆర్థిక సంవత్సరానికి రూ.107.30 కోట్ల అంచనా బడ్జెట్ను రూపొందించి ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది తెలిపారు. నూతన పాలక మండలి ఏర్పడిన తరువాత తొలి సమావేశంగా 2025–26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026–27 ముసాయిదా బడ్జెట్ సమావేశాన్ని సోమవారం పట్టణంలోని రవి మహాల్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన రూ.107.30 కోట్ల అంచనా బడ్జెట్కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా సహకరించాలని కోరారు. మున్సిపాలిటి ఆదాయ వనరులను విస్తరించడం ద్వారానే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మున్సిపాలిటికి వచ్చే ఆదాయం ఎక్కువగా సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు, పరిశుభ్రత, నీటి సరఫరా, పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఖర్చువుతోందన్నారు. ఈ నేపథ్యంలో అదనపు ఆదాయ వనరులను గుర్తించడం అత్యవసరమని సూచించారు. పట్టణాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఇంటి పన్నులు, నీటి బిల్లులు సమయానికి చెల్లించడం ద్వారా మున్సిపాలిటికి సహకరించాలని కోరారు. అక్రమ నిర్మాణాలను నియంత్రించడం, మున్సిపాలిటి ఆస్తులను పరిరక్షించడం ద్వారా కూడా ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు. అనంతరం జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల సమస్యలను చైర్పర్సన్, కమీషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ధాన్యం ఆరబెట్టుకోవడానికి ప్రభుత్వ భూములు కేటాయించాలి

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని చాలా గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయి, కానీ ఇతరుల కబ్జాలో ఉన్నాయి. గ్రామాల్లోని రైతులు తాము పండించిన పంటను కోసి ఆరబెట్టుకోవడానికి స్థలాలు లేక ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,360 ఉన్నప్పటికీ, అకాల వర్షాలకు భయపడి అతి తక్కువ ధరలకు దళారులకు క్వింటాలుకు రూ.1,700, 1,800లకే అమ్ముకోవాల్సిన పరిస్థితి. యాసంగి (రబీ) సీజను వరిచేలు కోతకు సిద్ధం అయ్యాయి. ఇప్పటి పరిస్థితులు చూడలేక వరి పంట కోసి దళారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. పంటలు కోతకు సిద్ధం అయ్యే సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడం శోచనీయం అని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై అప్పటి జిల్లా కలెక్టర్ హనుమంతరావు కూడా సానుకూలంగా స్పందించి,ఈ దిశగా ప్రయత్నం చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రతి ఊర్లో ఉన్న ప్రభుత్వ భూములను రైతులకు వారి ధాన్యం ఆరబెట్టుకోవడానికి ఎప్పటికీ ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని, మండల తహసిల్దార్, ఇతర సంబంధిత అధికారులకు ప్రభుత్వ భూములను వెలికి తీసేలా ఆదేశాలిచ్చి, శ్రద్ధ చూపాలని, ఏదో ఒక శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేయాలని, ఇది రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లోని ప్రజలు ఎక్కడ తమ భూములకు వడ్లు ఆరబెట్టుకోవడానికి రైతులకు ఇస్తే తమ భూములు సాగు చేస్తలేరని ఎక్కడ రైతుబంధు లాంటివి ఇవ్వకపోవడం వల్ల రైతులకు వారి ధాన్యం ఆరబెట్టుకోవడానికి తమ భూములు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. గతంలో ఇలా రైతులకు తమ భూములు ఇచ్చిన వాళ్ళకు రైతుబంధు ఇవ్వకపోవడం వల్ల ప్రజలు ధాన్యం ఆరబెట్టుకోవడానికి రైతులకు తమ భూములు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. ఆ రైతుబంధు పైసలు తాము ఇస్తామని రైతులు అన్నా కూడా గ్రామప్రజలు ఇవ్వడం లేదు. ముందుగా ప్రతీ గ్రామంలో ఎంత ప్రభుత్వ భూములు ఉన్నాయో లెక్క తీసి, వాటిని ధాన్యం ఆరబెట్టుకోవడానికి రైతులకు ఉపయోగపడేలా ఏర్పాట్లు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండలంలోని గ్రామాల ప్రజలు,రైతులు కోరుతున్నారు.

## స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో, కెనరా బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ శిక్షణా సంస్థను సోమవారం భువనగిరి పట్టణంలోని కిసాన్ నగర్లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.



ఆర్ఎస్ఇటిఐ ద్వారా అందిస్తున్న వివిధ నైపుణ్య శిక్షణల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి మాట్లాడుతూ సెల్ఫోన్ సర్వీసింగ్, ఫోటోగ్రఫీ & వీడియోగ్రఫీ, ఎలక్ట్రికల్ హోమ్ వైరింగ్, ప్లంబింగ్, టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్, కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ వంటి వివిధ కోర్సులు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమములో ఆర్ఎస్ఇటిఐ డైరెక్టర్ కిషన్ భుక్య, డివిసనల్ మేనేజర్ పంకజ్, యల్డియం మాటూరి వంశీ, డి.పి.యం శ్రీనివాస్, జే.డి.యం రాజు, బ్యాంకు ప్రతినిధులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

# స్టాలిన్, విజయ్ నామినేషన్



**న్యూఢిల్లీ :** తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్ చెన్నైలోని కొళత్తూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. నామపత్రాలు దాఖలు చేసే సమయంలో ఆయన వెంట పార్టీ కీలక నేతలు ఉన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత స్టాలిన్ రోడ్ షో నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ తనను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా కొళత్తూర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తన సొంత నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు ముఖ్యమంత్రి స్టాలిన్. ఒకవైపు పరిపాలన వ్యవహారాలు చూస్తూనే, మరోవైపు పార్టీని గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్నారు. అయితే, కొళత్తూర్ నుంచి స్టాలిన్ నామినేషన్ వేయడం ఇది నాలుగోసారి. గతంలో మూడు సార్లు ఈ నియోజకవర్గం నుంచి బరిలో దిగి ముఖ్యమంత్రి స్టాలిన్ ఘన విజయం సాధించారు. నామినేషన్ అనంతరం మాట్లాడిన స్టాలిన్, కొళత్తూర్ ప్రజలు తనకు వరుసగా నాలుగోసారి అఖండ విజయాన్ని అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకెకు భారీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇదివరకు జరిగిన ఎన్నికలతో పోలిస్తే తమకు ఈ సారి ప్రజల్లో అపారమైన మద్దతు కనిపిస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు. ఈసారి విజయం చాలా గొప్పగా ఉంటుంది. ఢిల్లీకి తమిళనాడు ఎదురు నిలుస్తుంది అని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

**రెండు స్థానాల్లో పోటీ చేయనున్న టివికె అధినేత విజయ్**

మరోవైపు టివికె అధినేత విజయ్ కూడా పెరంబూర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సారి ఎన్నికల్లో విజయ్ రెండు చోట్ల పోటీ చేస్తున్నారు. మరొకటి తిరుచ్చి ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్నారు. అయితే, నామినేషన్ అనంతరం విజయ్ రోడ్ షో నిర్వహించారు. ఏప్రిల్ 23న జరిగే ఎన్నికల్లో విజిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో డిఎంకె పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డిఎంకె ఓ దుష్టశక్తి అని, వారి పాలనలో మహిళలకు భద్రతే లేదని ఆరోపించారు. డిఎంకె నుంచి తమిళనాడును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. అయితే, తాను ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చాయని విజయ్ చెప్పారు. తనని నమ్ముకున్న ప్రజలను ఎన్నటికీ మోసం చేయనని, అబద్ధం చెప్పనని విజయ్ అన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నడిపే స్టాలిన్ సర్ కావాలా? లేక ప్రజలను ప్రేమించే విజయ్ కావాలా? మీరే తెల్చుకోవాలని విజయ్ పేర్కొన్నారు.



# వ్యక్తిగత సమాచారం గోప్యం

## పథకాల లబ్ధికి ఉపయోగించొద్దు : జనగణన కమిషనర్



**న్యూఢిల్లీ :** వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంటుందని, దానిని సాక్ష్యంగా గానీ లేదా ఏ పథకం కిందనైనా ప్రయోజనం పొందేందుకు గానీ ఉపయోగించరాదని భారత రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ స్పష్టం చేశారు. వివాహం చేసుకోకుండా చాలాకాలంగా కలిసి ఉంటున్న జంటలను ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని నిర్ణయించామన్నారు. సహ జీవన జంటలను పెళ్లయిన దంపతులలాగే పరిగణించాలని భావిస్తున్నామన్నారు. జనాభా లెక్కల అధికారులకు కచ్చితమైన సమాచారాన్ని అందించాలని ప్రజలను కోరారు. ఢిల్లీతో సహా కొన్ని రాష్ట్రాల్లో దేశ 16వ జనాభా లెక్కల మొదటి దశ ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జనాభా లెక్కల చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం వ్యక్తిగత సమాచారం అంతా గోప్యంగా ఉంటుందని తెలిపారు. ఢిల్లీలో జనాభా లెక్కల మొదటి దశ ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు నిర్వహించనున్నారు. 'ఈ ప్రక్రియలో సేకరించిన వ్యక్తిగత సమాచారం అంతా గోప్యంగా ఉంటుంది. సమాచార హక్కు చట్టం కింద దానిని ప్రభుత్వ లేదా ప్రైవేట్ సంస్థలతో పంచుకోలేరు, లేదా కోర్టులో సాక్ష్యంగా ఉపయోగించలేరు' అని నారాయణ్ అన్నారు. పట్టికల తయారీ కోసం కేవలం సమగ్ర గణాంక సమాచారాన్ని మాత్రమే ఉపయోగిస్తామని ఆయన తెలిపారు. జనాభా లెక్కలలో కులాన్ని చేర్చడం గురించి, ప్రజలు సరైన సమాచారం ఇవ్వరేమోనన్న ఆందోళనపై ప్రశ్నించగా, నారాయణ్ మాట్లాడుతూ కులానికి సంబంధించిన సమాచారాన్ని రెండో దశలో సేకరిస్తామని, విస్తృతమైన చర్చల తర్వాత ప్రశ్నలను నిర్ణయిస్తామని అన్నారు. 'కుల సమాచారాన్ని ఎలా సేకరించాలనే దానిపై చాలా సూచనలు వచ్చాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, ప్రశ్నలను ఖరారు చేసే ముందు ఉత్తమమైన వాటిని ముందుకు తీసుకువస్తాము' అని ఆయన అన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఏ ప్రయోజనం కోసం ఉపయోగించలేరని, కేవలం సమగ్ర గణాంక సమాచారాన్ని మాత్రమే బహిరంగపరుస్తారని, ఏ పథకం నుంచైనా ప్రయోజనం పొందడానికి వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించలేరన్నారు. అలాంటి నిబంధన ఏదీ లేదని, అందువల్ల, ఎవరూ ఆందోళన చెందవద్దని, అవకతవకలు జరిగే అవకాశమే లేదని నారాయణ్ అన్నారు. చివరిసారిగా సమగ్ర కుల ఆధారిత గణన 1881, 1931 మధ్య జరిగింది. స్వాతంత్ర్యం తర్వాత నిర్వహించిన అన్ని జనాభా లెక్కల కార్యకలాపాల నుండి కులాన్ని మినహాయించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ, గత ఏడాది ఏప్రిల్ 30న జరగబోయే జనాభా లెక్కలలో కుల గణనను చేర్చాలని నిర్ణయించింది. భారత ఏజెన్సీలు నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా, డిజిటల్ భద్రత కోసం కట్టుదిట్టమైన చర్యలు అమలులో ఉన్నాయని నారాయణ్ తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఎలాంటి పత్రాలను సేకరించబోమని కూడా కమిషనర్ స్పష్టం చేశారు. 'ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదు. ప్రజలకు స్వీయ గణన చేసుకునే అవకాశం ఉంది; స్వీయ గణన పూర్తయిన తర్వాత కూడా, సమాచారాన్ని ధృవీకరించడానికి ఒక గణన అధికారి ఇంటింటికీ వెళ్లి సమాచారాన్ని సేకరిస్తారు. ప్రతి ఆరుగురు గణన అధికారులకు ఒక పర్యవేక్షకుడు కూడా ఉంటారు, దీనివల్ల ఎలాంటి అవకతవకలు జరగకుండా నిరోధించడానికి ఇది రెండు అంచెల ప్రక్రియగా ఉంటుంది' అని ఆయన అన్నారు. ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం నోటిఫై చేసిన విధంగా, జనాభా గణన మొదటి దశ గృహాల జాబితా, గృహ గణనకు ముందు ఉండే 15 రోజుల వ్యవధిలో ప్రజలు డిజిటల్‌గా సమాచారాన్ని సమర్పించడానికి వీలుగా, జనాభా గణన ప్రక్రియలో మొదటిసారిగా స్వీయ గణనను ప్రవేశపెట్టారని నారాయణ్ తెలిపారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుండి సెప్టెంబర్ 30 మధ్య ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం నిర్దేశించిన 30 రోజుల వ్యవధిలో గృహాల జాబితా కార్యకలాపాలు (హెచ్‌ఎల్‌ఓ) జరుగుతాయి. గృహాల జాబితా కార్యకలాపాలు ప్రారంభం కావడానికి సరిగ్గా ముందు 15 రోజుల వ్యవధిలో స్వీయ గణన చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఢిల్లీలో, హెచ్‌ఎల్‌ఓ దశ రెండు 30రోజుల వ్యవధులలో నిర్వహించబడుతుంది. న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్‌డిఎంసి), ఢిల్లీ కంటోన్మెంట్ ప్రాంతాలలో ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు, ఎంసిడి ప్రాంతంలో మే 16 నుండి జూన్ 15 వరకు ఈ ప్రక్రియ జరుగుతుంది. ఎన్‌డిఎంసి, ఢిల్లీ కంటోన్మెంట్ ప్రాంతాలలో స్వీయ గణన ఏప్రిల్ 1న, ఎంసిడిలో మే 1 నుండి మే 15 వరకు ప్రారంభమవుతుంది. పది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఏప్రిల్‌లో ఈ ప్రక్రియ మొదటి దశను ప్రారంభించడానికి నోటిఫికేషన్లు జారీ చేయగా, 15 మేలో, మరో 10 జూన్ లేదా ఆ తర్వాత ప్రారంభిస్తాయి. ఒకసారి డేటా సరిపోల్చి, ప్రామాణీకరించబడిన తర్వాత, ఈ ప్రక్రియ పూర్తయినట్లుగా పరిగణించబడుతుందని కమిషనర్ అన్నారు. స్వీయ గణన చేసే వ్యక్తికి, గణన అధికారి పర్యటన సమయంలో ఏదైనా తప్పు డేటాను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. గణన సిబ్బంది ఫోన్‌లలోని మొబైల్ అప్లికేషన్ ద్వారా డేటాను సేకరిస్తారని; జనగణన, గృహ జాబితాకు సంబంధించిన వివిధ కార్యకలాపాలను ఒక వెబ్ ఆధారిత పోర్టల్ పర్యవేక్షించి, నిర్వహిస్తుందని; వెబ్ మ్యాపింగ్ అప్లికేషన్ ద్వారా బ్లాక్‌ల ఏర్పాటు జరుగుతుందని నారాయణ్ తెలిపారు. జాతీయ జనాభా రిజిస్టర్ నవీకరణకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్)తో దీనికి ఎలాంటి సంబంధం లేదని కూడా ఆయన అన్నారు. మొదటి దశలో, అధికారులు ఇంటి పెద్ద పేరు, లింగం, సర్వే చేస్తున్న ఇంటి యాజమాన్య స్థితి, ఇంటి ఆధీనంలో ప్రత్యేకంగా ఉన్న నివాస గదుల సంఖ్య, ఇంట్లో నివసిస్తున్న వివాహిత జంటల సంఖ్య వంటి ఇతర ప్రశ్నలతో పాటు సమాచారాన్ని కూడా సేకరిస్తారని ఒక గెజిట్ నోటిఫికేషన్ తెలిపింది. లఢాఖ్ కేంద్రపాలిత ప్రాంతం, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మంచుతో కప్పబడిన నాన్‌సింక్రోనస్ ప్రాంతాలు మినహా, ఈ జనాభా గణనకు రిఫరెన్స్ తేదీ 2027 మార్చి 1వ తేదీ 00.00 గంటలుగా ఉంటుందని నారాయణ్ అన్నారు. 'జనాభా గణన దశలో, ప్రతి ఇంటి నుండి వ్యక్తుల వలస, సంతానోత్పత్తి లక్షణాలతో పాటు వివిధ జనాభా, సామాజిక–సాంస్కృతిక, ఆర్థిక పారామితులకు సంబంధించిన డేటాను సేకరిస్తారు, సేకరించబడతాయనిని ఆయన అన్నారు. మొదటి దశకు సంబంధించిన ప్రశ్నలను జనవరి 22న నోటిఫై చేశారని, రెండవ దశకు సంబంధించిన నోటిఫికేషన్‌లు, ప్రశ్నలు తగిన సమయంలో ప్రచురించబడతాయని నారాయణ్ తెలిపారు.

## పుదుచ్చేరిలో బరిలో ఉన్న అభ్యర్థుల్లో

# 23 మందిపై క్రిమినల్ కేసులు

- 41 శాతం మంది కోటీశ్వరులు : ఎడిఆర్

**న్యూఢిల్లీ :** పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులలో సుమారు 23 శాతం మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించగా, 41 శాతం మంది కోటీశ్వరులు అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదిక వెల్లడించింది. ఎన్నికల సంస్కరణల కోసం పనిచేస్తున్న ఈ స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జి ఒ), ఏప్రిల్ 9న జరగనున్న ఎన్నికల్లోని 30 స్థానాలకు పోటీ చేస్తున్న మొత్తం 294 మంది అభ్యర్థులలో 291 మంది సమర్పించిన అఫిడవిట్‌లను విశ్లేషించింది. పోటీ చేస్తున్న మొత్తం 294 మంది అభ్యర్థులలో, 34 మంది జాతీయ పార్టీల నుండి, 63 మంది రాష్ట్ర పార్టీల నుండి, 80 మంది నమోదిత గుర్తింపు లేని పార్టీల నుండి కాగా, 117 మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. 2021లో పోటీ చేసిన 323 మంది అభ్యర్థులలో 54 మంది (17 శాతం) తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించగా, ప్రస్తుత ఎన్నికల్లో 66 మంది అభ్యర్థులు (23 శాతం) తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారని ఆ నివేదిక పేర్కొంది. ఈ 66 మందిలో, 38 మంది (13 శాతం) తీవ్రమైన క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. 2021లో ఇటువంటి కేసులు ఎదుర్కొన్న వారి సంఖ్య 28 (9 శాతం) గా ఉంది. ప్రధాన పార్టీల విషయానికి వస్తే, కాంగ్రెస్ నుండి పోటీ చేసిన 21 మంది అభ్యర్థులలో ముగ్గురు, ఆల్ ఇండియా ఎన్.ఆర్. కాంగ్రెస్ (ఎఐఎన్‌ఆర్) నుండి 16 మందిలో నలుగురు, డిఎంకె నుండి 12 మందిలో ఆరుగురు, బిజెపి నుండి 10 మంది అభ్యర్థులలో ఐదుగురు తమ అఫిడవిట్‌లలో తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. ముగ్గురు అభ్యర్థులు మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులను ఎదుర్కొంటుండగా, ఇద్దరు అభ్యర్థుల పేర్లు ఐపిసి సెక్షన్ 302 కింద నమోదైన హత్య కేసులలో ఉన్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలు, తమపై క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులకు 14 నుండి 50 శాతం వరకు టిక్కెట్లు కేటాయించాయని ఆ నివేదిక పేర్కొంది. అభ్యర్థుల ఆర్థిక స్థితిగతుల విషయానికి వస్తే, 2021లో మొత్తం 323 మంది అభ్యర్థులలో 74 మంది (23 శాతం) కోటీశ్వరులు కాగా, ప్రస్తుత నివేదిక ప్రకారం 119 మంది (41 శాతం) అభ్యర్థులు కోటీశ్వరులేనని నివేదిక తెలిపింది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ సంపన్న అభ్యర్థులకే టికెట్లు కేటాయించడం ద్వారా, ఎన్నికల్లో ధనబలం పోషిస్తున్న పాత్ర స్పష్టమవుతోందని ఎడిఆర్ వ్యాఖ్యానించింది. ప్రధాన పార్టీల విషయానికి వస్తే— కాంగ్రెస్ పార్టీకి చెందిన 21 మంది అభ్యర్థులలో 17 మంది, ఎఐఎన్‌ఆర్ పార్టీకి చెందిన 16 మంది అభ్యర్థులలో 16 మంది, డిఎంకె పార్టీకి చెందిన 12 మంది అభ్యర్థులలో 11 మంది, అలాగే బిజెపికి చెందిన 10 మంది అభ్యర్థులందరూ తమ ఆస్తుల విలువ రూ. 1 కోటి కంటే ఎక్కువేనని ప్రకటించారు. మొత్తం 291 మంది అభ్యర్థుల ఆస్తుల విలువ రూ. 2, 099 కోట్లుగా నమోదైందని, అంటే ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తి విలువ రూ. 7. 21 కోట్లుగా వెల్లడించింది.

# శబరిమల అంశంపై మోదీ మౌనమేల?

## బిజెపి, ఎల్‌డిఎఫ్‌లు కలిసి పనిచేస్తున్నాయనడానికి నిదర్శనం : రాహుల్‌గాంధీ ఆరోపణ



**పతానంతిట్ట :** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు. కేరళ పర్యటనలో ఉన్నప్పుడు నరేంద్ర మోదీ శబరిమల అంశంపై మౌనం వహించారని, ఇది బిజెపి, ఎల్‌డిఎఫ్‌లు కలిసి పని చేస్తున్నాయనడానికి నిదర్శనమని ఆరోపించారు. సోమవారం ఆయన పతానంతిట్ట అదూర్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల సభలో ప్రసంగించారు. ఏప్రిల్ 9న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ సిపిఐ(ఎం), బిజెపి కూటమిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. దేశంలో తమను సవాలు చేయగల ఏకైక శక్తి కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని బిజెపికి తెలుసు కాబట్టి, కేరళలో యుడిఎఫ్ అధికారంలోకి రావడం బిజెపికి ఇష్టం లేదని ఆయన అన్నారు. 'జాతీయ స్థాయిలో వామపక్ష కూటమి అయిన ఎల్‌డిఎఫ్ తమను ఎప్పటికీ సవాలు చేయలేదని బిజెపికి బాగా తెలుసు. అంతేకాకుండా, ఢిల్లీలో తాము అధికారంలో ఉంటే, కేరళలో ఏ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఉన్నా సరే, అది పూర్తిగా తమ నియంత్రణలోనే ఉంటుందని కూడా వారికి తెలుసు' అని ఆయన పేర్కొన్నారు. బిజెపిని ఎవరైతే ఎదుర్కొంటారో, వారిపై ఆ పార్టీ దాడులకు పాల్పడుతుందని, బెదిరింపులకు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నాపైనే దాడులు జరిగాయి, 36 కేసులు నమోదయ్యాయి. నన్ను ఏకధాటిగా 55 గంటల పాటు విచారించారు' ఆయన తెలిపారు. అయితే కేరళ ముఖ్యమంత్రిపై మాత్రం అటువంటి చర్యలేవీ లేవని ఆయన ఆరోపించారు. ప్రధానమంత్రి ఎక్కడికి వెళ్ళినా సరే, అక్కడ కేవలం దేవాలయాలు, మతం గురించే మాట్లాడుతుంటారని ఆయన వ్యాఖ్యానించారు. విచిత్రమేమిటంటే, పాలక్కాడ పర్యటనకు వచ్చినప్పుడు మాత్రం, శబరిమలలో అసలు ఏం జరిగిందో ఆయన పూర్తిగా మర్చిపోయినట్లుగా ప్రవర్తించారన్నారు. ఈ విషయపై బిజెపికి నష్టం వాటిల్లకుండా ఉండేందుకే ప్రధాని మౌనం వహించారని గాంధీ పేర్కొన్నారు. గతంలో యుడిఎఫ్ రబ్బరు రైతులకు అండగా నిలిచిందని, కష్టకాలంలో నష్టపరిహారం అందించడంతో పాటు రబ్బరు రంగాన్ని కాపాడిందని ఆయన అన్నారు. ఎల్‌డిఎఫ్ రబ్బరు కార్మికులకు నష్టపరిహారం ఇవ్వడానికి నిరాకరిస్తోందని, వారిని రక్షించడం గురించి పట్టించుకోకుండా, పెద్ద వ్యాపార సంస్థలతో సంబంధాలు పెట్టుకోవడానికే సంతోషిస్తోందని ఆరోపించారు. ధరల హెచ్చుతగ్గుల నుంచి రబ్బరు రైతులను, కార్మికులను కాపాడటానికి కాంగ్రెస్ చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ఆర్థిక లావాదేవీల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతిలో మోదీ రాజీపడ్డారన్న తన ఆరోపణను రాహుల్ పునరుద్ఘాటించారు. పార్లమెంటులో ఈ విషయం ప్రస్తావించినప్పుడు, ప్రధానమంత్రి స్పందించకుండా తప్పించుకున్నారని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ మోదీని ఎలాగైతే నియంత్రిస్తున్నారో, అలాగే ప్రధానమంత్రి కేరళ ముఖ్యమంత్రిని నియంత్రిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేరళ ప్రజలు పర్యావరణానికి, సహజీవనానికి విలువ ఇస్తారని, విభిన్న వర్గాలు, మతాలు పరస్పర గౌరవంతో కలిసి జీవిస్తాయని రాహుల్ అన్నారు. 'కేరళకు బలమైన చిన్న, మధ్య తరహా వ్యాపారాలు, పటిష్టమైన వ్యవసాయ రంగం, మెరుగైన కనెక్టివిటీ, ఐటి వృద్ధితో పాటు ప్రజలకు రక్షణ కూడా అవసరం' అని ఆయన అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే, కాంగ్రెస్ ప్రకటించిన ఐదు హామీలను అమలు చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

# నితీశ్‌ను, బిహార్ ప్రజలను బిజెపి మోసం చేసింది

## తేజస్వీ యాదవ్

**పాట్నా :** ఎమ్మెల్సీ పదవికి బిహార్ సిఎం నీతీశ్‌కుమార్ రాజీనామా చేయడంపై ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ స్పందించారు. బిజెపి బిహార్ ప్రజలను, నీతీశ్ కుమార్‌ను మోసం చేసిందని ఆరోపించారు. ఈ క్రమంలో నీతీశ్ కుమార్‌ను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో పోల్చారు. ఈ మేరకు తేజస్వీ ఓ వార్తా సంస్థతో వ్యాఖ్యానించారు. 'ఎన్నికల తర్వాత నీతీశ్ కుమార్ బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగరని మేము మొదటి నుంచీ చెబుతూనే ఉన్నాం. మహారాష్ట్రలోలాగే (ఏక్‌నాథ్ షిండే సిఎం పదవీ కాలాన్ని ఉద్దేశించి) కొద్ది కాలం పాటు ముఖ్యమంత్రిగా నీతీశ్‌ను కొనసాగనిచ్చారు. ఇప్పుడు నీతీశ్‌ను సిఎం పదవి నుంచి బిజెపి తొలగిస్తోంది. నీతీశ్ కుమార్‌ను, బిహార్ ప్రజానీకాన్ని బిజెపి మోసం చేసింది. కమలం పార్టీ మాటలకు, చేతలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది' అని తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు.


**बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda**

**అమీర్ పేట్ బ్రాంచ్**
షాప్ నెం. 6 & 7, మెరీడియన్ ప్లాజా, డోర్ నెం.6, 8/859/1, అమీర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ-500016.

**వాహన ఇ-వేలము సంక్షిప్త ప్రకటన**

దిగువ తెలియజేయబడిన రుణగ్రహీతల వైఫల్యము కారణముగా పార్టీలచే అమలు చేయబడిన కుదువ ఒప్పందం క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ, దిగువ తెలియజేసిన కుదువపెట్టబడిన మోటార్ వాహనమును బ్యాంకు వారు తిరిగి పొందడమైనది/జప్తు చేయడమైనది మరియు వాటిని "ఎది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలా మరియు ఎది ఎలా ఉన్నది అది అలా" ప్రాదిపదికన వేలము వేయబడును.

**రుణగ్రహీత/ హామీదారు పేరు & చిరునామా: 1.శ్రీ.బొడ్డు గోపి ,** ఇం.నెం 8-3-226 మరియు 226/1/జి 139, ఫ్లాట్ నం 507, శ్రీ సాయి గార్డెన్, బ్లాక్ 1, మధురా నగర్, యూసుఫ్‌గూడ 500045. **బకాయి మొత్తం : రూ.17,97,999/- (రూపాయల పదిహేడు లక్షలు తొంభై ఏడు వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది మాత్రమే) 30-03-2026** నుండి వడ్డీ మరీయు దానిపై ఏదైన ఇతర ఛార్జీలు.

| వాహనము యొక్క వివరణ | రిజర్వు ధర | బయానా |
|---|---|---|
| Vehicle Type: Motor Car (SEDAN)<br>Vehicle Make & Model: VERNA 1.0 TURBO GDI DCT SX(O) BSVI<br>Fuel: PETROL, Reg. No. TS05FP0002,<br>CH.No:MALC041HVNM354882J<br>E. No. G3LCNM674891, Colour: STARRY NIGHT<br>Model/Date of Registration:09/09/2022<br>MFG Month/Year: 09/2022 | రూ.6,12,000/- | రూ.61,200/- |
| | కనీస బిడ్డు పెంపుదల మొత్తం: రూ. 5,000/- ( రూపాయలు ఐదు వేలు మాత్రమే) | |

బ్యాంక్ ఆస్తి ఐడి : BARBBODDUGOPI

ఖాతా పేరు: SARFAESI AUCTION ACCOUNT: ఖాతా నెం. 83260015181869, IFSC Code: BARB0VJAMEE , (Fifth letter ZERO), బ్యాంక్ & బ్రాంచ్ పేరు: బ్యాంక్ ఆఫ్ బరోడా , అమీర్‌పేట్ బ్రాంచ్ .

ఆన్‌లైన్ విధానం ద్వారా వాహనము వేలము: **https://baanknet.com** ఇ-వేలము తేదీ/రోజు/సమయం: **20-04-2026,** సోమవారం, మ.02.00 గం.ల నుండి సా.05.00 గం.ల వరకు, బిడ్ దాఖలు కొరకు ఆఖరి తేదీ: 20-04-2026, సోమవారం, సా. 5.00 గం.లలోగా, కాగోరు కొనుగోలుదారులు/బిడ్డర్లు వాహనమును తేది: 19-04-2026న అదివారం లేదా ఆలోగా ఉ. 10.00 గం.ల నుండి సా. 05.00 గం.ల వరకు. (బ్రైట్ సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ , ప్లాట్ నం. 480, రోడ్ నెం.5A, గోపాల్ నగర్, కూకట్‌పల్లీ, హైద్రాబాద్ . ఫోన్ నెం. +91 99898 94455 పార్కింగ్ యార్డు వద్ద) తనిఖీ చేసుకొనవచ్చును.

**ఇ-వేలము అమ్మకము యొక్క నియమనిబంధనలు: 1.** ఎటువంటి ముందస్తు కారణము తెలుపకుండా అందిన లేదా కొన్ని ఆఫర్(లు) లేదా బిడ్(లు)లను స్వీకరించవచ్చు లేదా నిరాకరించుటకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి పూర్తి హక్కులు కలవు. 2. ఎటువంటి కారణము తెలుపకుండా ఇ-వేలము స్వీకరించుట/నిరాకరించుట/వాయిదా/రద్దు చేయుటకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి పూర్తి హక్కులు కలవు. 3. అధీకృత అధికారి పరిజ్ఞానం మరియు తెలిసిన సమాచారం మేరకు వాహనముపై ఎటువంటి తాకట్టు రుణ భారములు లేవు. అయినప్పటికీ ఔత్సాహిక బిడ్డర్లు వాహనముపై తాకట్టు రుణ భారములు, టైటిల్‌కు సంబంధంచి వారంతటా వారే క్షుణ్ణంగా విచారించుకొని & తనిఖీ చేసుకొని & తృప్తి చెందవలెను (వివరణాత్మక నియమనిబంధనల కొరకు **https://baanknet.com** కు రిఫర్ చేయవలెను). అమ్మకానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి **https://baanknet.com** వెబ్‌సైట్ లింక్‌ను చూడండి/ సందర్శించండి. ఔత్సాహిక బిడ్డర్లు ఎరువ మమత, భీమ్ రావు డొబ్బాల (బ్రాంచ్ హెడ్), మొబైల్ నెం.+91 8367788231 ను సంప్రదించవచ్చును.

**గమనిక: బిడ్డరు అన్ని ఆర్.టి.ఓ. సంబంధిత ఛార్జీలు మరియు ఖర్చులను భరించాలి.**

తేది: 30.03.2026, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా


# సైనికులకు న్యాయం సులభంగా అందాలి

## వాళ్లు రెండు యుద్ధాలు చేసే పరిస్థితి తీసుకురావద్దు: సిజెఐ



**న్యూఢిల్లీ :** దేశ సైనికుల గురించి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనికులను వారి చట్టపరమైన హక్కుల కోసం సరిహద్దుల్లో ఒకటి, స్వదేశంలో మరొకటి, ఇలా ఒకేసారి రెండు యుద్ధాలు చేసేలా దేశం బలవంతం చేయకూడదని అన్నారు. సైనికులకు మెరుగైన న్యాయ సదుపాయం కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రపాలిత ప్రాంతం లేహ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సిజెఐ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థకు, సాయుధ దళాలకు మధ్య ఉన్న పరస్పర సహకార సంబంధాన్ని సిజెఐ సూర్యకాంత్ ప్రముఖంగా ప్రస్తావించారు. న్యాయస్థానాలు రాజ్యాంగ విలువలను కాపాడుతుండగా, ఆ ఆదర్శాలు నిలబడటానికి అవసరమైన పరిస్థితులను సైనికులే సృష్టిస్తారని పేర్కొన్నారు. అలాగే 1962 నాటి రెజాంగ్ లా యుద్ధాన్ని సైతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రస్తావించారు. మేజర్ శైతాన్ సింగ్ భాటి, 13 కుమావోన్ రెజిమెంట్‌కు చెందిన చార్లీ కంపెనీలోని 114 మంది సైనికుల త్యాగాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. 'రాజ్యాంగం హక్కులు, గౌరవం, సమానత్వం, న్యాయం గురించి మాట్లాడినప్పటికీ, దేశ ప్రజల కోసం ఆ వాగ్దానాలు నిలబడగలిగే పరిస్థితులను కల్పించిన పూర్తి ఘనత సైనికులకే దక్కుతుంది. ఒక దేశం తన సార్వభౌమత్వాన్ని, స్థిరత్వాన్ని, శాంతిని కాపాడుకోలేకపోతే, ఆ దేశం స్వేచ్ఛ, న్యాయం గురించి అర్థవంతంగా మాట్లాడలేదు. సైనికుల భూవివాదాన్ని కూడా ఎదుర్కోవచ్చు. ఒక మాజీ సైనికుడు సర్వీసు లేదా సంక్షేమ హక్కుల కోసం ఇబ్బందులు పడొచ్చు. ఒక కుటుంబం పింఛనుకు సంబంధించిన జాప్యాలు, గృహ సమస్యలు, వైవాహిక కలహాలు సంబంధిత వ్యవహారాల్లో అధికార యంత్రాంగం ఉదాసీనతతో వ్యవహరించొచ్చు. దేశం తన సైనికులను ఒకేసారి రెండు యుద్ధాలు చేసే స్థితిలో ఎన్నడూ ఉంచకూడదు. చట్టం సైనికుడి వద్దకే వెళ్లాలి. ఎందుకంటే సైనికుడు ఎల్లప్పుడూ చట్టం వద్దకు వెళ్లలేడు. సైనికులకు న్యాయం సులభంగా అందాలి' అని సీజెఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

**'దేశాన్ని కాపాడేవారికి న్యాయ సహాయం అందించాలి**

ఇది కేవలం సైనికుల సానుభూతికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, ఒక రాజ్యాంగ విధి అని సిజెఐ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. దేశ సమగ్రతను కాపాడే వారికి ప్రభుత్వ సంస్థలు సకాలంలో న్యాయ సహాయం అందించాలని పేర్కొన్నారు. అలా చేయలేకపోతే ప్రభుత్వ సంస్థలు తమ నైతిక, రాజ్యాంగ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనట్లేనని అభిప్రాయపడ్డారు. తాను నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) కార్యనిర్వాహక అధిపతిగా ఉన్నప్పుడు రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, పారామిలిటరీ దళాలు, సిఏపిఎఫ్ సభ్యులకు ఉచిత న్యాయ సహాయం, తోడ్పాటు, మద్దతు సేవలను అందించడానికి ప్రారంభించిన 'వీర్ పరివార్ సహాయ యోజన'ను ఈ సందర్భంగా సిజెఐ ప్రస్తావించారు. నల్సా కార్యనిర్వాహక చైర్మన్‌గా తాను ఉన్నప్పుడు సాయుధ దళాల కోసం ఈ పథకాన్ని రూపొందించి, అమలు చేయడం తన కెరీర్‌లోని గొప్ప ఘట్టాలలో ఒకటని అన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 14,929 మంది లబ్ధిదారులకు సహాయం అందించామని, 34 రాజ్య సైనిక్ బోర్డులు, 404 జిల్లా సైనిక్ బోర్డులతో సహా 438 న్యాయ సేవల క్లినిక్‌లను కార్యాచరణలోకి తెచ్చామని వెల్లడించారు. 'వీర్ పరివార్ సహాయ యోజన' కింద సేవలందించేందుకు విశ్వాసం, సానుభూతి సంస్కృతిని పెంపొందించేందుకు రక్షణ రంగ నేపథ్యం ఉన్న 378 మందితో సహ మొత్తం 1,123 మంది సిబ్బందిని నియమించినట్లు సిజెఐ సూర్యకాంత్ తెలిపారు. ఈ పథకం కింద ఆస్తి వివాదాలు, పెన్షన్ ఆలస్యం మొదలుకొని వైవాహిక కలహాలు, పాఠశాల ప్రవేశాల వరకు పలు సమస్యలను పరిష్కరించడం జరిగిందని చెప్పారు. సైనికులు సరిహద్దుల్లో ఉండి దేశాన్ని కాపాడుతున్నారని కొనియాడారు. సైనికుల ప్రయోజనాలన్నింటినీ పట్టుదలతో కాపాడటం దేశ సంస్థల కర్తవ్యమని అభిప్రాయపడ్డారు.


**BEFOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR**
**WARANGAL**
**A.R.B. No. 537 OF 2025**

Between:

**M/S. SRI MANIRAM CHIT FUNDS PRIVATE LIMITED, Represented by its Foreman, Hanamkonda-2 Branch.** ......**Disputant**

AND

**Smt. SOMA KARUNA SRI and Others.** ........**Opponents**

To,

**OP.No.1:** Smt Soma Karuna Sri, W/o Uma Mahesh, Age: 50 Years, R/o. H.No. 4-295, Dasariwada, Kothurjenda, Hanamkonda. 506001.

**OP.No.2:** Sri Manganuri Laxman Kumar, S/o Janakudu, Age: 54 Years, Occ: Male Nursing, R/o. H.No. 3-12-17, Sagara Veedhi, Near: Bommala Vepachettu, Kumarpally, Hanamkonda. 506001.

**OP.No.3:** Sri Manganoori Chender, S/o Janakudu, Age: 59 Years, Occ: Principal in Govt. ITI Mancherial, R/o. H.No. 3-12-17, Sagara Veedhi, Near: Bommala Vepachettu, Kumarpally, Hanamkonda. 506001.

**OP.No.4:** Sri Pathakanti Rajendraprasad, S/o Balaraju, Age: 40 Years, Occ: Junior Assistant, R/o. H.No. H.No. 4-2-277, Kothur, Subashnagar, Near: Matha Baar, Kumarpally, Hanamkonda. 506001.

**OP.No.5:** Sri Velde Gyaneshwar, S/o Sarvaiah, Age: 51 Years, Occ: Medical Officer. R/o H.No. 3-9-502, Reddy Colony, Hanamkonda. 506001.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on: **10-04-2026** for your appearance. On that day you have to appear in person at **11:00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR – WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**
**ABR. NO. 536 OF 2025**

Between:-

**M/s. Advaita Chit Funds India Pvt. Ltd., Hanamkonda, Branch, rep. By it's Foreman,** .....**Disputant**

VERSUS

**A.NAGARAJU & OTHERS** ......**Opponents**

1. Sri. Allam Nagarju, S/o, Eshwaraiah, Age: 50 Yrs, Occu: Business, R/o: H.No:11-23-2368/1, Desaipet Road, Navayuga Colony, Warangal.
2. Sri. Keetha Krishna Sagar, S/o, K.Chandraiah, Age: 48 Yrs, Occu: Railway Employe, R/o: H.No: 3-2-138, Raipura Hanamkonda.
4. Sri. Pittala Kiran, S/o, Suraiah, Age: 40 Yrs, Occu: Business, R/o:H.No:20-16-72,East Fort Warangal,Warangal.
5. Sri. Allam Lavanya, W/o, Nagarju, Age: 47 Yrs, Occu: Business, R/o: H.No: 11-23-2368/1, Desaipet Road, Navayuga Colony,Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **10.04.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR**
**WARANGAL**
**ARB.NO. 477 of 2025**

Between:

**M/s. Manideepa Chit Funds Private Limited., Warangal Branch** ..... **Disputant**

And

**Sri. Chippa Vamshi Kumar & Others** ..... **Opponents**

To,

**OPPONENT NO. 2.** Sri. Chippa Harish, S/o. Rajaih, Age: 31 Years, Occ: M.T.S, O/o: Archeological Survey of India, MTS, Hyderabad. R/o. H.No. 1-31/1, Venkateshwer Pally, Parkal, Hanamkonda. 506391.
**OPPONENT NO. 3.** Sri. MD. Mahaboob Basha, S/o, MD. Mahamood, Age: 31 Yrs, Occu: M.T.S. O/o: Archeological Survey of India, MTS, Hyderabad. R/o: H.No: 26-65, Old Bus Stand, Alampur, Mahabubnagar, 509152
**OPPONENT NO. 4.** Sri. Bejadi Praveen Kumar, S/o, Bal Reddy, Age: 40 Years, Occ: Business, R/o: H.No: 6-39/1, Narsaipally, Maddur, Cherial, Jangaon, 506223.
**OPPONENT NO. 5.** Sri. Anagandla Laxpathi, S/o, Yadagiri, Age: 46 Years, Occu: Business, R/o: H.No: 2-4-898, Gokul Nagar, Near old Bus Depot, Hanamkonda.
**OPPONENT NO. 6.** Sri Oentala Rajender, S/o. Lingaiah, Age: 48 Years, Occ: Business, R/o. H.No. 1-212, Ankushapur, Tekumtla, Chityala, Jayashankar Bhupalpally, 506356.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, but you have failed to receive the same. The above dispute is posted on.**10-04-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL**

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
మంగళవారం
31-03-2026
www.prajapaksham.in



# యుద్ధం ఆగాలి...

అమెరికా, ఇజ్రాయెల్ ఏకపక్ష నిర్ణయాలు, చర్యలతో ప్రపంచ దేశాలు అల్లాడుతున్నాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధాన్ని ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. చివరికి అమెరికాలో, ఇజ్రాయెల్ దేశాల్లోనూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ యుద్ధం భారీ ప్రాణనష్టానికి, ప్రాంతీయ అస్థిరతకు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన అంతరాయాలకు దారితీసింది. యుద్ధ వ్యతిరేక ఉద్యమాలకు ఆజ్యం పోస్తున్నది. శాంతి చర్యల ఆవశ్యకతను తెరపైకి తెచ్చింది. అణు చర్చలు విఫలమై, ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఇరాన్ నాయకత్వం, అణు సౌకర్యాలు, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నట్టు అమెరికా ప్రకటించినా, పరోక్షంగా తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికే యుద్ధానికి దిగిందని స్పష్టమవుతున్నది. ఆరంభ దాడులలోనే ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించడం, ప్రతిస్పందనగా ఖతార్, జోర్డాన్, బహ్రెయిన్, సౌదీ అరేబియా, కువైట్, యుఎఇలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులు చేయడం సమస్యను తీవ్రతరం చేసింది. గల్ఫ్ ప్రాంతంలో విమాన మార్గాలు మూతపడ్డాయి. ప్రధాన వాణిజ్య కేంద్రాలు దెబ్బతిన్నాయి. మరోవైపు యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికాలో వాషింగ్టన్ డిసి, న్యూయార్క్, లాస్ ఏంజెలెస్ వంటి నగరాల్లో నిరసన జ్వాలలు ఎగసిపడుతున్నాయి. 'హ్యాండ్స్ ఆఫ్ ఇరాన్' వంటి నినాదాలు మారుమోగుతున్నాయి. కోడ్‌పింక్, ఆన్సర్ కోలిషన్ వంటి సంస్థలు ఈ ఉద్యమాల్లో పాల్గొన్నాయి. లండన్‌లో 50 వేల మందికి పైగా పాల్గొన్న భారీ నిరసనలు జరిగాయి. పాకిస్తాన్, జపాన్, టర్కీ, నైజీరియా వంటి దేశాల్లో కూడా ఈ జోక్యాన్ని ఖండిస్తూ ప్రజలు రోడ్లపైకి వచ్చారు. 2025 జూన్‌లో జరిగిన 12 రోజుల దాడులు... తిరిగి తాజాగా యుద్ధంతో వేలాది మంది మరణించారు, వీరిలో పౌరులే అధికం. ఒక వైమానిక దాడిలో ఒక ప్రాథమిక పాఠశాలలో 160 మంది పిల్లలు మృతి చెందడం యుద్ధం అమెరికా నైతికతను ప్రశ్నిస్తున్నది. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 120 డాలర్లను దాటింది. హిజ్బుల్లా వంటి శక్తులు యుద్ధంలో చేరడంతో, భూతల యుద్ధం విస్తరించే ప్రమాదం పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా నౌకాశ్రయాలు, విమాన మార్గాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న విదేశీయులను తరలించే చర్యలు వేగంగా చేపట్టాల్సి వచ్చింది. ఈ యుద్ధం గల్ఫ్ సహకార మండలి దేశాల ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నది. ఆహార దిగుమతుల్లో 70 శాతం అంతరాయం కలగడంతో ఆహార కొరత ప్రమాదం పెరిగింది. ఇరాన్ మౌలిక సదుపాయాల ధ్వంసంతో, పాలన మార్పును తీసుకురావడం ద్వారా ఇరాన్‌ను చెప్పుచేతల్లో పెట్టుకోవాలన్నది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంతర్యంగా కనిపిస్తున్నది. అక్కడి ముడి చమురు, అపారమైన ఖనిజ సంపదపైనా కూడా అమెరికా కన్నేసింది. సాధ్యమైనంత ఎక్కువ అలజడి సృష్టించి, దీర్ఘకాలిక అస్థిరతకు కుట్రలు పన్నుతున్నది. ఈ చర్యలు ఇరాన్ ఎదురుదాడికి కారణమవుతున్నాయి. హోర్ముజ్ జలసంధి మూసివేతతో ఉద్భవించిన ఇంధన సంక్షోభం యూరప్‌లో మాంద్యానికి దారితీయవచ్చు. ఆసియా దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. అందుకే, ఈ యుద్ధాన్ని కేవలం ఒక దేశం మీద మరొక దేశం దాడి చేసిన సంఘటనగా చూడటం సరికాదు. ఇది శక్తి సమీకరణాలు, వ్యూహాత్మక అహంకారం, భౌగోళిక రాజకీయ ప్రయోజనాలు, ప్రజల మనోభావాల మధ్య జరుగుతున్న ఒక సంక్లిష్ట ఘర్షణగా ఆవిష్కృతమవుతున్నది. సైనిక శక్తి అధికంగా ఉన్న దేశం ఎప్పుడూ యుద్ధాన్ని తనకు అనుకూలంగా మలచగలదనే అభిప్రాయం తప్పని ఇరాన్ ప్రతిఘటన రుజువు చేస్తున్నది. గతంలో అఫ్ఘనిస్థాన్, ఇరాక్‌లలో సాధించిన పైచేయి ఇరాన్ విషయంలో పునరావృతమవుతుందనే అమెరికా భ్రమలు తొలగిపోతున్నాయి. సుదీర్ఘ యుద్ధాలు చేసిన చరిత్ర, అనుభవం ఇరాన్ సొంతం. అందుకే, దశాబ్దాలుగా ఈ తరహా దాడులకు సిద్ధమవుతూ వచ్చింది. నాయకత్వాన్ని ఒకే స్థాయిలో కేంద్రీకరించకుండా, పలు స్థాయిల్లో ప్రత్యామ్నాయ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. సైనికంగా కూడా సాధారణ క్షిపణుల నుండి అధునాతన హైపర్సోనిక్ వ్యవస్థల వరకు విస్తృత శ్రేణిని అభివృద్ధి చేసింది. ఇరాన్ ప్రత్యక్షంగా యుద్ధాన్ని ప్రారంభించకపోయినా, దాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని వ్యవస్థీకృతంగా పెంచుకుంది. ఈ వాస్తవాన్ని నిర్లక్ష్యం చేసిన అమెరికా, ఇజ్రాయెల్ భారీ మూల్యాన్నే చెల్లించుకుంటున్నాయి. ఈ రెండు దేశాల దుర్మార్గపు నిర్ణయం ఇప్పుడు యావత్ ప్రపంచాన్ని బహుముఖంగా అస్థిరపరుస్తున్నది. ఇరాన్‌లో ఉన్న ఆర్థిక సమస్యలు, ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ పడిపోవడం వంటి అంశాలు ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. ఈ అసంతృప్తి ఒక ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మారి, దేశవ్యాప్తంగా ఒక తిరుగుబాటును ప్రేరేపిస్తుందని అమెరికా అంచనా వేసింది. కానీ ఇరానియన్లు విదేశీ దాడిని వ్యతిరేకిస్తున్నారు. పాఠశాల పిల్లల మరణం, దేశ నాయకత్వంపై దాడులు ప్రజల్లో దేశభక్తిని మరింత పెంచాయి. ఈ భావోద్వేగాన్ని అంచనా వేయడంలో అమెరికా, ఇజ్రాయెల్ ఘోరంగా విఫలమయ్యాయి. ఎలాంటి కారణాలు.. అంచనాలు లేకుండా యుద్ధం మొదలుపెట్టిన ఈ రెండు దేశాలూ ఇకనైనా తప్పు సరిదిద్దుకోవాలి. తక్షణం కాల్పుల విరమణ అత్యవసరంగా అవసరమని అంతర్జాతీయ సంస్థలు ఇస్తున్న పిలుపుపై సానుకూలంగా స్పందించాలి. ఇప్పటికే పాకిస్తాన్, సౌదీ అరేబియా, తుర్కియా వంటి ప్రాంతీయ శక్తులు హోర్ముజ్ జలసంధిని తిరిగి ప్రారంభించేందుకు చర్చలు జరుపుతున్నాయి. తద్వారా ప్రపంచ ఆహార, ఇంధన సంక్షోభాన్ని నివారించేందుకు కృషి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ రాజీకి రావాలి. ఒక స్థిరమైన ఒప్పందానికి అంగీకరించాలి. భేషజాలను పక్కకుపెట్టి, స్వదేశంలో జరుగుతున్న ఆందోళనలను గమనించాలి. ప్రపంచ దేశాల ఆలోచనలను గుర్తించాలి. అవి తమ నిర్ణయాలను పునఃపరిశీలించకపోతే, ఈ ఘర్షణ మరింత విస్తరించే ప్రమాదం ఉంది. మరో ప్రపంచ యుద్ధానికి బీజం పడినా ఆశ్చర్యం లేదు. ●



## ఘర్షణలు రెచ్చగొడుతూ దేశాన్ని దోచుకుంటోంది

**సమాజంలోని అన్ని వర్గాల మధ్య బిజెపి ఘర్షణలను రెచ్చగొడుతోంది. ఇటువంటి పరిస్థితులను ఆసరాగా చేసుకుని దేశాన్ని దోచుకోవాలని కాషాయ పార్టీ చూస్తోంది. టిఎంసి ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా విడుదల చేసిన రాజకీయ 'చార్జిషీటు' తీవ్ర అభ్యంతరకరమైనది. అల్లర్లను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షాలపైనే మొదట చార్జిషీటు దాఖలు చేయాలి. హిందువులు, ముస్లింల నుండి మొదలుకొని పరిపాలన, పోలీసు శాఖల వరకు అందరినీ విభజించడానికి బిజెపి ప్రయత్నిస్తోంది.బిజెపి ఒత్తిడి మేరకు ఎన్నికల సంఘం, ఎన్నికలు జరగనున్న ఇతర రాష్ట్రాలకు పలువురు సీనియర్ అధికారులను ఏకపక్షంగా బదిలీ చేసింది.**

– తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ



## ఆధునిక యంత్రాల ధాటికి ఆరిపోతున్న విశ్వకర్మల కొలిమి

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఒకప్పుడు పట్టుకొమ్మలుగా నిలిచిన విశ్వబ్రాహ్మణుల పంచ వృత్తులు నేడు మనుగడ కోసం పోరాడుతున్నాయి. నాగరికతకు పునాదులు వేసిన కమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, కాంస్య, శిల్ప కళలు కాలక్రమేణా ప్రభావాన్ని కోల్పోతున్నాయి. మానవ మేధస్సుకు, చేతి నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిన ఈ వృత్తులు ప్రస్తుతం యంత్రాల ధాటికి, కార్పొరేట్ శక్తుల పోటీకి తలవంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు గ్రామాల్లో ప్రతి శుభకార్యంలోనూ కీలకపాత్ర పోషించిన ఈ వృత్తిదారులు నేడు తమ ఉనికిని కాపాడుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు.

**ఆధునికత కోరల్లో ఆత్మీయ వృత్తులు**

మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్లోకి వచ్చిన రెడీమేడ్ వస్తువులు, పారిశ్రామిక ఉత్పత్తులు సంప్రదాయ చేతివృత్తులపై గొడ్డలి పెట్టుగా మారాయి. చేతితో అద్భుతమైన శిల్పాలను, నాణ్యమైన కలప సామాగ్రిని, వ్యవసాయ పనిముట్లను తయారు చేసే విశ్వబ్రాహ్మణులకు ప్రస్తుతం పని కరువైంది. ట్రాక్టర్లు, ఆధునిక యంత్రాల వినియోగం పెరగడంతో కమ్మరి కొలిమిలు ఆరిపోతున్నాయి. ప్లాస్టిక్, స్టీల్ వస్తువుల వాడకం పెరగడం వల్ల కాంస్య పాత్రల తయారీ మరుగున పడిపోతోంది. నాణ్యత కంటే తక్కువ ధరకు లభించే యంత్ర నిర్మిత వస్తువుల వైపు వినియోగదారులు మొగ్గు చూపడం వృత్తిదారుల పాలిట శాపంగా మారింది.

**ఆదాయం కరువు.. అప్పుల ఊబిలో కుటుంబాలు**

ముడిసరకుల ధరలు విపరీతంగా పెరగడం, చేసిన పనికి తగిన కూలి లభించకపోవడంతో విశ్వబ్రాహ్మణ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. రోజంతా కష్టపడి పనిచేసినా కనీసం పూట గడవని పరిస్థితి నెలకొంది. పెట్టుబడికోసం తెచ్చిన అప్పులు తీరక, కుటుంబ పోషణ భారమై చాలామంది వృత్తిదారులు మానసిక వేదనకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే తమ వారసత్వ వృత్తులను వదిలి ఉపాధికోసం వలసలు వెళ్లి దినసరి కూలీలుగా మారుతున్నారు.

**బడా షోరూమ్‌ల ధాటికి కుదేలు**

ముఖ్యంగా స్వర్ణకార వృత్తిపై కార్పొరేట్ నీడలు పరుచుకున్నాయి. బడా కార్పొరేట్ జ్యువెలరీ షోరూమ్‌ల రాకతో సాధారణ స్వర్ణకారులు వీధిన పడే పరిస్థితి వచ్చింది. మెషిన్ కటింగ్ నగలు, ఆకర్షణీయమైన ప్రకటనలతో బడా సంస్థలు సామాన్య వృత్తిదారుల ఉపాధిని దెబ్బతీస్తున్నాయి. దీనికి తోడు అటవీ నిబంధనల కఠినత వల్ల వడ్రంగులకు ముడిసరకు అయిన కలప దొరకడం గగనమైంది. ఒకప్పుడు గౌరవప్రదమైన జీవనం సాగించిన వడ్రంగి వృత్తిదారులు నేడు కుటుంబ పోషణకోసం ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు.

**ప్రభుత్వ జోక్యం తక్షణ అవసరం**

ఈ సంప్రదాయ కళలు అంతరించిపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వృత్తి పనిముట్లపై సబ్సిడీలు అందించడం, ముడిసరకు సేకరించడంలో ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించడం, వృత్తిపై ఆధారపడిన వారికి పెన్షన్లు ఇచ్చి భరోసా కల్పించడం వంటి చర్యలు చేపట్టాలి. విశ్వబ్రాహ్మణుల వృత్తులు మన సంస్కృతికి, వారసత్వానికి సజీవ సాక్ష్యాలు. వీటిని కాపాడుకోవడం ద్వారానే వేలాది కుటుంబాల జీవనోపాధిని రక్షించవచ్చు.

ప్రజాపక్షం విలేకరి, జన్నారం

# పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ తగ్గింపు మాయాజాలం



ఎం. కోటేశ్వరరావు

కుక్క పిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా కాదేదీ కవితకనర్హం అన్నాడు మహాకవి శ్రీశ్రీ. భారత చక్రవర్తి నరేంద్రమోదీకి భజన చేసేందుకు ఏ అవకాశాన్నీ వదలం అంటున్నారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నేతలు. పెట్రోలు, డీజిలు మీద కేంద్రప్రభుత్వం లీటరుకు పది రూపాయల చొప్పున ఎక్సయిజ్ డ్యూటీ తగ్గించిందన్న వార్త రాగానే ముగ్గురూ మోదీని అభినందించారు. ఎందుకటా ! వినియోగదారులకు ధర పెంచనందుకు అన్నది వారి స్పందనల సారం. పూర్వం రాజులకాలంలో రాజుగారు ఏది చేసినా గొప్పదే అని పొగిడే భట్రాజుల (కులం గురించి కాదు)ను వారు గుర్తుకు తెచ్చారంటే అతిశయోక్తి కాదు. భట్రాజులకు రాజులు, రంగప్పలు నజరానా ఇచ్చేవారు, కేంద్రం ఇస్తున్నది వడ్డీలకే చాలటం లేదని చంద్రబాబు నాయుడు మంత్రులతో అన్నట్లు లీకు వార్తలు. ఈ పూర్వరంగంలో మోదీని పొగిడినందుకు ఆంధ్రప్రదేశ్‌కు ఏమైనా ఒరగబెడతారా? వ్రతం చెడ్డా ఫలం దక్కదా! చూద్దాం. కొసమెరుపు ఏమంటే నరేంద్రమోదీని పొగడటంలో పోటీపడే వైసిపి నేత జగన్ మోహనరెడ్డి ఈ విషయంలో వెనుకబడినట్లు కనిపిస్తున్నది, స్పందన కనిపించలేదు, వినిపించలేదు. ఇక్కడ ఒక్క సందేహం. చంద్రబాబు సిఎం, పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రి, మరి మోదీని పొగడటంలో మంత్రి లోకేష్ పాత్ర ఏమిటి? పలుకుబడి, ప్రతిష్ట పెంచే కసరత్తులో భాగమా? మిగిలిన మంత్రులు ఎందుకు స్పందించలేదు. ఎవరికి తోచింది వారు అనుకొనే స్వేచ్ఛ ఉంది గనుక వదిలేద్దాం! చిత్రం ఏమిటంటే వినియోగదారుల మీద విపరీత భారం మోపినపుడు చంద్రబాబు అండ్ కో మౌనంగా ఉండి ఇప్పుడు ఏదో ఒరగబెట్టినట్లు భజన చేశారు? ఏమి రాజకీయం రా నాయనా! అసలు నరేంద్రమోదీ ఎందుకీ నిర్ణయం తీసుకున్నారు?

శుక్రవారం నాడు ఎక్సయిజ్ పన్ను తగ్గింపు వార్త వినగానే శ్రీరామ నవమి వేడుకల్లో ఉన్న జనం ఒక్కసారి ఆశ్చర్యపోయారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే చమురు ధరలు పెరుగుతాయని మానసికంగా సిద్ధం అయిపోయిన వారు నిజమేనా మోదీ సర్కార్ ఇంత మేలు చేసిందా అని కాళ్లు చేతులు గిల్లుకున్నారు, తలలు కొట్టుకున్నారు. చర్మాలు స్పందించటంతో రామా ఇలా కరుణించావా అని సంబరపడ్డారు. అయితే బంకుల వద్దకు వెళ్లగానే ఆ "తగ్గింపు" అంబానీ, నయారా వంటి ప్రైవేటు కంపెనీలతో బాటు కేంద్ర ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలకు లబ్ది చేకూర్చేందుకు తప్ప వినియోగదారులకు కాదని తెలియగానే చల్లబడిపోయారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దుర్మార్గదాడుల కారణంగా తలెత్తిన సంక్షోభంతో ప్రపంచ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగాయి. ఆ పేరుతో నయారా అనే ప్రైవేటు కంపెనీ పెట్రోలు మీద లీటరుకు ఐదు, డీజిలు మీద మూడు రూపాయల చొప్పున ధర పెంచింది. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వం పవర్ పెట్రోలు ధర లీటరుకు రు.2.36వరకు, పరిశ్రమల్లో ఉపయోగించే డీజిల్ ధరను 22 రూపాయలు పెంచింది. దిగుమతి ఖర్చు పెరిగినందున మన దేశంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలకు లీటరు పెట్రోలు మీద రు.1820. డీజిలు మీద రు.3035 నష్టం వస్తున్నదని చెబుతున్నారు. (అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పతనమైనపుడు వాటికి ఎంత లాభం వచ్చిందో చెప్పరు) అందువలన వాటికి ఉపశమనం కలిగించేందుకు మోదీ పూనుకున్నారు. ప్రత్యేక ఎక్సయిజ్ డ్యూటీని పెట్రోలు మీద రు.13ను మూడుకు తగ్గించగా, డీజిల్ మీద పది రూపాయలను పూర్తిగా ఎత్తివేశారు. ఈ శ్రద్ధ కోట్లాది మంది వినియోగదారుల మీద లేదు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభం కాగానే వంటగ్యాస్ మీద గృహ వినియోగదారులకు అరవై రూపాయలు పెంచారు, ముష్టిగా విదుల్చుతున్న 40రూపాయల సబ్సిడీని గుట్టుచప్పుడు కాకుండా ఎత్తివేశారు, అంటే వంద రూపాయల మేరకు వడ్డించారు.

అచ్చేదిన్ పేరుతో 2014లో అధికారానికి వచ్చిన మోదీ జనాలకు ఏదో ఒరగబెడతారని అందరూ ఆశించారు. అదనంగా అన్నవస్త్రాలు ఇస్తారనుకొంటే ఉన్న వస్త్రాలను లాగేసుకున్నట్లు కొత్తగా మేలు చేస్తారనుకుంటే డీజిలు, పెట్రోలు మీద సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేశారు, గ్యాస్ మీద ముష్టి మాదిరి విదిల్చారు. ఇప్పుడు దాన్ని కూడా రద్దు చేశారు. మేలు సంగతి తరువాత, భారం ఎలా మోపారో చూద్దాం. మోదీ అధికారానికి వచ్చిన 2014–15 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం ప్లానింగ్ ఎనాలసిస్ సెల్ సమాచారం ప్రకారం చమురురంగం నుంచి ఎక్సైజ్ డ్యూటీ రాబడి రు.99,068 కోట్లు, దాన్ని 2020–21 నాటికి రు.3,72,930 కోట్లకు పెంచారు. తరువాత ఎన్నికలు, తదితర కారణాలతో 2023–24 నాటికి రు.2,73,684 కోట్లకు తగ్గించారు. 2025–26 తొలి ఆరునెలల్లో రు.1.30వేల కోట్ల మేర రాబడి వచ్చింది.పెట్రోలు మీద కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న అసలు సిసలు ఎక్సయిజ్ పన్ను లీటరుకు రు.1.40,(దీన్లో మాత్రమే రాష్ట్రాలకు వాటా ఉంది) ఇదిగాక ప్రత్యేక అదనపు ఎక్సయిజ్ డ్యూటీ రు.13, వ్యవసాయ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పేరుతో రు.2.50, రోడ్ల పేరుతో రు.5 వంతున మొత్తం రు.20.50 వసూలు చేస్తున్నారు. (అంతకు ముందు రు.30కి పెంచి తరువాత తగ్గించారు). ఇప్పుడు రు.13లో పది రూపాయలు తగ్గించినప్పటికీ అది వినియోగదారులకు చేరటం లేదు. సాధారణ డీజిల్‌పై పదహారు రూపాయల బాదుడులో పది రూపాయలు రద్దు చేశారు. అయినా వినియోగదారులకు ఒక్క పైసా కూడా తగ్గలేదు.

తాజా నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వం తగ్గిన ఆదాయలోటును ఎలా సర్దుబాటు చేయనుంది? బడ్జెట్‌లో సంక్షేమ పథకాల కేటాయింపులకు కోత పెట్టటం లేదా ఏదో ఒకసాకుతో జిఎస్‌టి, సెస్‌ల పెంపుదలకు పూనుకోవాల్సి ఉంటుంది. పశ్చిమాసియా సంక్షోభం ముగిసిన తరువాత తిరిగి అదనపు ఎక్సయిజ్ పన్నుబాదుడు ద్వారా పూడ్చుకోవచ్చు.చావు కబురు చల్లగా చెప్పినట్లు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి సమీక్షించి ధరల నిర్ణయం చేస్తామని శుక్రవారం నాడు కేంద్ర ప్రభుత్వం చెప్పింది. పరోక్ష పన్నులు మరియు కస్టమ్స్ కేంద్ర బోర్డు అధ్యక్షుడు వివేక్ చతుర్వేది విలేకర్లతో మాట్లాడుతూ "మీరు ఊహించుకొనే విధంగా పరిస్థితి లేదని, మనం కష్టకాలంలో ఉన్నామని" చెప్పారు. నరేంద్రమోదీ గారేమో అంతా సజావుగా ఉందని చాలా రోజుల పాటు చెప్పించి, కరోనా మాదిరి పరిస్థితిని ఎదుర్కొంటున్నాం అని పార్లమెంటులో మాట్లాడి జనాన్ని భయపెట్టిన సంగతి తెలిసిందే.అధికారులెందుకు ఈ విధంగా మాట్లాడుతున్నట్లు? ప్రత్యేక అదనపు ఎక్సయిజ్ డ్యూటీ పది రూపాయలు తగ్గించిన కారణంగా ప్రతి పదిహేను రోజులకు ఏడువేల కోట్ల రూపాయల మేర కేంద్ర ప్రభుత్వం రాబడిని కోల్పుతున్నదని వివేక్ చెప్పారు, అంటే ఏడాదికి రు.1.68లక్షల కోట్లు. మోదీ సర్కార్ వంచన గురించి చెప్పుకోకపోతే జనాలకు అన్యాయం చేసినవాళ్లం అవుతాము.

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ధరలు తగ్గితే వినియోగదారులకు తగ్గిస్తాం, పెరిగితే పెంచుతాం అని చెప్పిన వారు 2022 ఏప్రిల్ మొదటి వారం నుంచి ధరలను సవరించటం నిలిపివేశారు. ఆ ఏడాది ఏప్రిల్, మే, జూన్, జూలై నాలుగు నెలల్లో మనం దిగుమతి చేసుకున్న ముడి చమురు ధర సగటున 108.5 డాలర్లు. ఆ తరువాత క్రమంగా తగ్గుతూ వచ్చింది. 2022–23 ఏడాది సగటు ధర 93 డాలర్లు. ఇక 2025 ఏప్రిల్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు పదకొండు నెలల సగటు ధర 66.53 డాలర్లు, అంటే నాలుగేండ్లలో ఇంతగా తగ్గినప్పటికీ వినియోగదారులకు పైసా తగ్గించలేదు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తరువాత మార్చినెల 25వ తేదీ వరకు ఉన్న కొనుగోలు సగటు ధర 123 డాలర్లకు చేరింది. ఈ వివరాలు ఏ కమ్యూనిస్టులో, కాంగ్రెస్ వారో చెప్పినవి కాదు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పెట్రోలియం ప్లానింగ్ మరియు అనాలిసిస్(పిపిఏసి) వెబ్‌సైట్ వెల్లడించిన సమాచారం. ఆయిల్ ప్రైస్ డాట్‌కామ్ సమాచారం ప్రకారం ఫిబ్రవరి 25న మనదేశం కొనుగోలు చేసిన ముడి చమురు ధర 70.25 డాలర్లు ఉంటే మార్చినెల 23న 127డాలర్లకు చేరింది. ఈ కారణంగానే ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ధరలను సమీక్షిస్తామని కేంద్రం చెప్పింది. నాలుగేండ్ల పాటు జనాల నుంచి లక్షల కోట్లు అదనంగా వసూలు చేసి ఖజానా నింపుకొని అదానీ, అంబానీ వంటి వారికి సబ్సిడీలు రూపంలో కట్టబెట్టారు, పారుబాకీల పేరుతో లక్షల కోట్ల బ్యాంకు రుణాలను రద్దు చేశారు. ఇప్పుడు ధరలు పెరిగి ఒక నెల రోజులు కూడా గడవక ముందే చమురు కంపెనీల కోసం నడుంకట్టారు.

దిగుమతి చేసుకున్న చమురు భారంగా మారుతున్నదంటూ గుండెలు బాదుకుంటారు. దీనికి రూపాయి విలువపతనాన్ని అరికట్టటంలో వైఫల్యం లేదా? మోదీ అధికారానికి వచ్చినపుడు, ఇప్పుడు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు పీపా ధర ఒక డాలర్‌గానే ఉంది అనుకుందాం. నాడు డాలరుకు అరవై రూపాయలు చెల్లిస్తే సరిపోయేది, ఇప్పుడు అదే డాలరుకు 94చెల్లించాల్సి వస్తోంది. ఈ నిర్వాకానికి బాధ్యత ఎవరిది? యుపిఎ పాలనలో రూపాయి పతనం చెందినపుడు అసమర్ధ మన్మోహన్ సింగ్ కారణం అన్నారు కదా! ఇప్పుడు "సమర్థ" నరేంద్ర మోదీ అని చెప్పక తప్పదు. దేశంలో ముడిచమురు ఉత్పత్తి పెంచలేదని గతంలో తీవ్రవిమర్శలు చేశారు. పన్నెండేళ్ల నరేంద్రమోదీ ఏలుబడి ఎలా ఉందో తెలుసా ? 2014–15లో ప్రభుత్వ,ప్రైవేటు ఉత్పత్తి 35.9 మిలియన్ టన్నులుంటే 2023–24నాటికి 27.2మి.టన్నులకు పడిపోయింది. ఇప్పుడు ఇంకా దిగజారింది. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలన్నీ కలిసి 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి చేసిన మొత్తం 25.6మిలియన్ టన్నులే. ఇలాంటివారు ఆత్మనిర్భరత, వికసిత్ భారత్ పేరుతో 2047 నాటికి దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతామని కబుర్లు చెబుతుంటే జనం చెవుల్లో పూలు పెట్టుకొని తలలు ఊపాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గితే తగ్గిస్తాం, పెరిగితే పెంచుతాం అంటూ అంతకు ముందు ప్రతి రోజూ సవరించిన ధరల విధానాన్ని నాలుగేండ్లు ఎందుకు పక్కన పెట్టారో ఇప్పుడు తిరిగి దాని గురించి ఎందుకు మాట్లాడుతున్నారో జవాబుదారీ తనం గురించి తమ భుజాలను తామే చరచుకొనే పెద్దలు ఎవరైనా చెబుతారా?


రాజకీయనేతలను కాసేపు పక్కన పెడదాం. వారు చెప్పేది ఒకటి చేసేది మరొకటి అని తెలిసిన జనంలో అసలు ప్రశ్నించే గుణం ఎందుకు అంతరించినట్లు? నిజంగానే ఈ ధోరణి గురించి పరిశోధనలు జరపాల్సిన అవసరం ఉంది. ఆక్రమిత కాశ్మీరులో పాక్ ప్రభుత్వం భారాలు పెంచితే వాటిని భరించలేక అక్కడి జనం మనదేశంలో విలీనం కావాలని కోరుకుంటున్నట్లు వీడియోను చూపి కొందరు వీరంగం వేస్తుంటారు. ఇక్కడి జనం మీద మోదీ మోపుతున్న భారాలు వారికి పట్టవు. పాకిస్తాన్ సుత్తి ఇనుపదైనా భారత్‌ది బంగారుపుదైనా తల పగులుతుంది. మంచి రోజులను(అచ్చేదిన్) తెస్తామంటే జనం నమ్మారు. ప్రజలకు అన్యాయం జరిగితే నిలదీస్తాం, తాట వలుస్తాం అందుకే పార్టీని పెట్టాం అని జనసేన నేత పవన్ కల్యాణ్ గతంలో ప్రకటించినపుడు జనం నిజమే కదా అనుకున్నారు. 2019కి ముందు నరేంద్రమోదీని, చంద్రబాబు నాయుడిని అదే మాదిరి నిలదీసినమాట నిజం. తరువాత చంద్రబాబును వదలి వేశారు. నరేంద్ర మోదీతో చేతులు కలిపారు.

వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మాత్రమే 2024 ఎన్నికల వరకు అది జనం సమస్యలైనా, జగన్ వ్యవహారశైలినైనా నిలదీశారు, తాటవలిచారు. ఇప్పుడు తత్వం తలకెక్కింది గనుక మౌన దీక్ష పట్టారు. అక్రమం జరుగుతుంటే మౌనంగా ఉండమని సనాతనం కూడా ఎక్కడా చెప్పలేదు. ఎదుటి వారి జేబులో పర్సు కొట్టేసినట్లు తెలియగానే ఎవరైనా వెంటనే దాన్లో ఎంత డబ్బు ఉంది అని అడుగుతాం, తక్కువ మొత్తమే అని తెలిస్తే పోనీలే అని ఊపిరి పీల్చుకుంటాం. అదే కేంద్ర ప్రభుత్వమైనా మరొకరైనా చమురు పన్ను పేరుతో మన పర్సు కొట్టేస్తున్నపుడు ఎంత పోగొట్టుకున్నాం అని ఆలోచించాలా వద్దా? అఫ్ కోర్స్ అది కష్టపడిన సొమ్ము కాకపోతే వదిలేద్దాం !

# నైపుణ్యంలేని చదువులు.. అవసరాలు తీర్చని డిగ్రీలు...

మన సమాజంలో చదువు అనేది ఒకప్పుడు విముక్తి సాధనం. చీకటి నుండి వెలుగులోకి తీసుకెళ్లే దీపం. పేదరికం నుండి బయటపడే మార్గం, ఒక కుటుంబంలో ఒకరు చదివితే ఆ కుటుంబం మొత్తం భవిష్యత్తు మారిపోతుందని నమ్మేవారు పెద్దలు. కానీ కాలం మారింది. విద్య విస్తరించింది. కాలేజీలు పెరిగాయి. డిగ్రీలు పెరిగాయి. కానీ జీవితాలు మాత్రం ఇంకా రోజురోజుకి అంధకారంలోకి వెళ్తున్నాయి లాంటి అసహజమైన ప్రశ్న ఇప్పుడు మన ముందు నిలుస్తోంది. చదువు పెరిగింది, కానీ జీవితాలు ఎందుకు స్థిరపడడం లేదు? డిగ్రీలు పెరిగాయి, కానీ నిరుద్యోగం ఎందుకు తగ్గడం లేదు? విద్యార్థులు సంవత్సరాల తరబడి చదివిన తర్వాత కూడా ఎందుకు జీవితంపై అయోమయంలో నిలబడిపోతున్నారు?ఈ ప్రశ్నకు సమాధానం వెతికితే మన విద్యా వ్యవస్థలో ఉన్న ఒక చేదు నిజం బయటపడుతుంది. నేడు మనం చదువును జ్ఞానంగా కాదు, ఒక గుర్తింపుగా చూస్తున్నాం. ఒక విద్యార్థి చదువుతున్నప్పుడు అతను ఏం నేర్చుకుంటున్నాడన్నది ముఖ్యం కాదు. చివరికి అతని చేతిలో ఏ డిగ్రీ సర్టిఫికెట్ ఉంది అన్నదే ముఖ్యమైపోయింది. ఈ దృక్పథం వల్ల చదువు ఒక సాధనంగా కాకుండా ఒక సామాజిక అలంకారంగా మారిపోయింది. మా కొడుకు డిగ్రీ చేశాడు, మా అమ్మాయి ఇంజినీరింగ్ చదివింది అని చెప్పుకోవడం కోసం చదివే పరిస్థితి చాలా చోట్ల కనిపిస్తోంది. ఈ పరిస్థితి ఒక్కసారిగా రాలేదు. దీని వెనుక సామాజిక, ఆర్థిక, మరియు విద్యా నిర్మాణాలలో ఏర్పడిన అనేక లోపాలు ఉన్నాయి. మొదటగా మన సమాజం విజయం అనే పదాన్ని చాలా సంకుచితంగా నిర్వచించింది. మంచి మార్కులు, ఒక డిగ్రీ, ఒక ఉద్యోగం. ఇవే విజయానికి ప్రమాణాలు అయ్యాయి. ఒక విద్యార్థి తనకు నిజంగా ఏం చేయాలని ఉంది అనే ప్రశ్న అడిగే అవకాశమే లేకుండా పోయింది. చిన్నప్పటి నుంచే అతని జీవితానికి ఒక సిద్ధమైన మార్గాన్ని నిర్ణయించి, అదే మార్గంలో నడవమని ఒత్తిడి పెడుతున్నారు. ఈ ఒత్తిడిలో అతని సహజ ప్రతిభలు, ఆసక్తులు, ఆలోచనలు మెల్లగా నశించిపోతాయి.

ఇంకా ఒక పెద్ద సమస్య విద్యా వ్యవస్థలోని నిర్మాణాత్మక లోపాలు. చాలా కాలేజీలలో ఇప్పటికీ పాఠ్య ప్రణాళికలు కాలానికి అనుగుణంగా మారడం లేదు. ప్రపంచం వేగంగా మారుతోంది. టెక్నాలజీ కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ఉద్యోగాల స్వభావం మారుతోంది. కానీ విద్యార్థులు చదివే విషయాలు చాలాసార్లు గత దశాబ్దాల ఆలోచనలను ప్రతిబింబిస్తాయి. ఫలితంగా విద్యార్థులు చదువుతున్న ప్రపంచానికి వారు ప్రవేశించబోయే వాస్తవ ప్రపంచనికి పొంతనే ఉండడం లేదు. అంతగా విద్యార్థులు అయోమయంలో పడతారు. అయితే సమస్య కేవలం పాఠ్య ప్రణాళికలోనే లేదు. మన విద్యా వ్యవస్థలో ప్రశ్నించే సంస్కృతి దాదాపు కనిపించదు. ఒక విద్యార్థి ఎందుకు చదువుతున్నాడు? చదివిన జ్ఞానం ఎక్కడ ఉపయోగపడుతుంది? ఈ ప్రశ్నలు అడగడాని కి అవకాశమే ఉండదు. చాలా చోట్ల ఉపాధ్యాయుడు చెప్పిందే జ్ఞానం, పుస్తకంలో ఉన్నదే నిజం, పరీక్షలో రాయాల్సింది అదే. ఈ విధానం విద్యార్థులను ఆలోచించే వ్యక్తులుగా కాకుండా కేవలం సమాచారాన్ని మోసుకెళ్లే యంత్రాలుగా తయారు చేస్తుంది. ఇంకా పచ్చిగా చెప్పాలంటే చదువు చెప్పే మాస్టర్లకే సరిగ్గా చదవడం రాని పరిస్థితి. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని మనం గమనించాలి. విద్యార్థులు విఫలమవుతున్నారా? లేక విద్యా వ్యవస్థ వారిని విఫలమయ్యే పరిస్థితిలోకి నెట్టుతున్నదా? చాలా సందర్భాల్లో రెండవదే



నిజం. ఒక విద్యార్థి పదిహేను సంవత్సరాలు చదివి కూడా తనకు ఉన్న సామర్థ్యాలను గుర్తించలేకపోతే, అది అతని వైఫల్యం కాదు. అది వ్యవస్థ వైఫల్యం. ఒక యువకుడు డిగ్రీ పూర్తి చేసి కూడా తనకు ఏ పని చేయగలనో తెలియక అయోమయంలో ఉంటే, అది అతని బలహీనత కాదు. అది విద్యా విధానం లోపం. ఈ పరిస్థితి యువతలో మానసికంగా తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. ఒకప్పుడు చదువు ఆశను ఇచ్చేది. కానీ ఇప్పుడు చాలాసార్లు చదువు భయాన్ని కలిగిస్తోంది. పరీక్షల భయం, ఫలితాల భయం, ఉద్యోగాల భయం. ఇవన్నీ కలిసి యువతలో ఒక అశాంతిని సృష్టిస్తున్నాయి. చాలా మంది విద్యార్థులు చదువు పూర్తయ్యాక జీవితంపై నమ్మకం కోల్పోతున్నారు. నేను నిజంగా ఏం చేయగలను? అనే ప్రశ్నకు సమాధానం దొరకకపోతే, ఆ ప్రశ్న మెల్ల గా ఆత్మవిశ్వాసాన్ని కుదించే శక్తిగా మారుతుంది. ఈ పరిస్థితిని మార్చడం అసాధ్యం కాదు. కానీ దానికి ధైర్యమైన ఆలోచన అవసరం. మొదటగా మనం చదువు చెప్పే విధానాన్ని మార్చాలి. చదువు అంటే కేవలం సమాచారం సేకరణ కాదు. అది ఆలోచింపజేస్తూ నేర్చుకునే ప్రక్రియ. ఒక సమస్యను చూసి దానికి కొత్త పరిష్కారం వెతకగలిగే సామర్థ్యం చదువు ఇవ్వాలి. ఒక విద్యార్థి తన జీవితానికి అర్థం వెతుక్కోగలిగే దిశను చూపాలి.

రెండవది, నైపుణ్యాల ఆధారిత విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. పుస్తకాలలో ఉన్న సిద్ధాంతం మాత్రమే. సిద్ధాంతానికి ప్రాక్టికల్ గా ప్రక్రియతో నేర్చుకునే అవకాశాలు విద్యార్థులకు కల్పించాలి. ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమలతో అనుసంధానం, ప్రాజెక్టులు ఇవన్నీ విద్యలో భాగం కావాలి. ఒక విద్యార్థి చదువుతున్నప్పుడు వాస్తవ ప్రపంచంతో సంబంధం ఏర్పడితే, అతనిలోని సామర్థ్యం బయటపడుతుంది. మూడవది, సమాజం కూడా తన దృక్పథాన్ని మార్చుకోవాలి. ప్రతి విజయాన్ని డిగ్రీలతో కొలవడం మానుకోవాలి. ఒక మంచి రైతు, ఒక నైపుణ్యమైన కార్మికుడు, ఒక సృజనాత్మక కళాకారుడు వీరందరూ సమాజానికి సమానంగా విలువైనవారు. వృత్తిపరమైన విద్యను గౌరవించే సంస్కృతి ఏర్పడితేనే యువత తమ ప్రతిభకు తగిన మార్గాలను ఎంచుకోగలుగుతుంది. అంతకంటే ముఖ్యమైన మార్పు ఒకటి ఉంది అది మన ఆలోచనలో మార్పు. చదువు అనేది ఒక ముగింపు కాదు. అది ఒక ఆరంభం. ఒక డిగ్రీ మన జీవితానికి తుది గమ్యం కాదు. అది ప్రయాణానికి ఒక దశ మాత్రమే. ఈ నిజాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం మొత్తం అర్థం చేసుకోవాలి.నైపుణ్యం లేని చదువులు కేవలం చెప్పుకోవడానికే డిగ్రీలు అనే వాక్యం ఒక విమర్శ మాత్రమే కాదు. అది ఒక హెచ్చరిక. మనం ఇప్పటికైనా ఆగి ఆలోచించకపోతే, డిగ్రీలు పెరుగుతాయి కానీ మార్గాలు తగ్గిపోతాయి. విద్య విస్తరిస్తుం ది కానీ జ్ఞానం క్షీణిస్తుంది. యువత సంఖ్య పెరుగుతుంది కానీ అవకాశాలు తగ్గిపోతాయి. కాబట్టి మార్పు ఎక్కడో ప్రారంభం కావాలి. అది విధానాలలో ప్రారంభమవచ్చు, విద్యాసంస్థలలో ప్రారంభమవచ్చు, లేదా మన ఆలోచనలో ప్రారంభమవచ్చు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. విద్య ను మళ్లీ అర్థవంతంగా మార్చాల్సిన సమయం వచ్చేసింది. చదువు మళ్లీ ఒక కాగితం ముక్కగా కాకుండా, ఒక మనిషి జీవితాన్ని నిర్మించే శక్తిగా మారినప్పుడే మన సమాజం నిజమైన ప్రగతిని చూసే అవకాశం ఉంటుంది.

అమ్జాద్ మియా, 9000517186

## ప్లాస్టిక్ సంచుల వినియోగం తగ్గించండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ నెమరుగొమ్ముల రవి కోరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జులైవాడలో సోమవారం పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా నిర్వహించిన బట్ట సంచుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు భూమి, నీరు, జీవవైవిధ్యంపై తీవ్రమైన దుష్ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బట్ట సంచులతో పాటు స్కూల్ బ్యాగులను, పి.ఇ.టి డ్రెస్సులను ఆయన ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ మండల విద్యాశాఖ అధికారి జి.నెహ్రూ నాయక్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. భాస్కర్ రెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెగ్యులర్‌గా పన్నులు చెల్లించి బల్దియాకు సహకరించాలి:మేయర్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**రెగ్యులర్‌గా పన్నులు చెల్లించి బల్దియాకు సహకరించాలని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. ఖాజీపేట సర్కిల్ కార్యాలయంలో సోమవారం మేయర్ ఆకస్మికంగా సందర్శించి కొనసాగుతున్న పన్నుల వసూళ్ల తీరును పరిశీలిఅంచి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర వాసులు ఎప్పటికప్పుడు పన్నుల చెల్లింపులో జాప్యం లేకుండా ప్రతి ఏటా రెగ్యులర్‌గా పన్నులు చెల్లిస్తూ కార్పొరేషన్‌కు సహకరించాలని క్రమం తప్పకుండా పన్నుల చెల్లింపు వలన బల్దియాకు ఆర్థిక పరిపుష్టి చేకూరుతుందని పేర్కొన్న మేయర్ సేకరిస్తున్న పన్నుల విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకొని నమోదు తీరును పరిశీలించారు. అనంతరం పన్నుల చెల్లించిన పలువురు చెల్లింపుదారులకు మేయర్ సంబంధిత రసీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజారపు భాస్కర్, ఉపేంద్ర నరహరి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అదనపు కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/మరిపెడ:**మహబుబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటి కేంద్రంలోని సీతారాంపురం1 అంగన్వాడి కేంద్రన్ని మహబుబాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో సోమవారం ఆకస్మికంగా తసిఖి చేశారు.అంగన్వాడి కేంద్రంలోని పరిసరాలు,రికార్డులు పరిశించారు.పిల్లలతో ప్రార్థన చేయించి వారిని అభినందించారు.సిబ్బంది పని తీరు పట్ల సంతృప్తి వెలిబుచ్చారు.ఈ సందర్భంగా ఆయన వెంట మున్సిపాలిటి కమీషనర్ విజయనంద్,ఎంపిడిఒ వేణుగోపాల్ రెడ్డి,సిడిపిఒ ఎల్లమ్మ,సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి,అంగన్వాడి టీచర్ కోంపెల్లి రేణు క,ఆయా లింగమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి



**ప్రజాపక్షం/ములుగు:**99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డు, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే సభకు అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఇరిగేషన్, విద్యుత్‌శాఖ అధికారులు, తహసీల్దారు, ఎంపిడిఒలు తప్పనిసరిగా గ్రామసభలకు హాజరు కావాలని స్పష్టం చేశారు. గ్రామసభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కల్గకుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఇతర మౌళిక వసతులను ఏర్పా టు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వా రి కోసం గ్రామసభలో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారి నుండి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ వెంకటేష్, జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, ఎంపిఒలు, తదితరులు పాల్గొన్నారు.

## 7.45 కోట్లతో మరిపెడ మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్

**ప్రజాపక్షం/మరిపెడ:**మహబుబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటి 20262027వార్షిక బడ్జెట్ ను సోమవారం మరిపెడ ఎస్సి కమ్యునిటి హాలులో మున్సిపాలిటి చైర్ పర్సన్ విసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అధ్యాక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమవేశంలో,అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో సమక్షంలో మరిపెడ మున్సిపాలిటి కమీషనర్ విజయనంద్ 7.45 కోట్లతో ప్రవేశపెట్టగా సభ్యులు అందరు ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాలం సునిత రవిందర్ రెడ్డి,కౌన్సిలర్లు తిరుపతి,రమేష్, కాంతమ్మ, సురేష్,రాము ,నీలా,రాములు,భేబిశ్రీ,భద్రమ్మ,భాస్కర్,సత్యవతి,గౌతమ్ రెడ్డి,సుజాత,మున్సిపాలిటి అధికారులు,సిబ్బాంది,తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా వచ్చాక మేలు కంటే కీడే ఎక్కువ

### గద్దర్ వేషధారణపై సోషల్ మీడియాలో ట్రోలింగ్

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** సోషల్ మీడియా వచ్చాక మేలు కంటే కీడు ఎక్కువగా జరుగుతోందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు అన్నారు. అసెంబ్లీలో సోమవారం మాట్లాడుతూ, ఇటీవల తాను రవీంద్రభారతిలో గద్దర్ వేషధారణలో పాల్గొంటే దానిపైనా సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరుగుతోందని పేర్కొన్నారు. మహిళల పట్ల కూడా కొందరు విచక్షణ కోల్పోయి అసభ్యకర పోస్టులు పెడుతున్నారని, ఇటువంటి చర్యలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు.గతంలో తాను అసెంబ్లీ ఎదుట బందోబస్తు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించడంతో తాను ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టానన్నారు. ప్రజా ప్రతినిధిగా ఎప్పటికప్పుడు క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు మేలు జరిగే కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు.గతంలో డిసిపిగా, సిపిగా పనిచేసిన అనుభవంతో చట్టం ప్రకారం ముందుకు వెళ్లాలని పోలీసు అధికారులకు సూచిస్తున్నామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోకి వెళ్లినప్పుడు సోషల్ మీడియా ట్రోలింగ్స్‌పై స్థానిక ప్రజలు కూడా ప్రశ్నిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం తాను ఎమ్మెల్యేగా మరింత క్రమశిక్షణతో పనిచేస్తూ వర్ధన్నపేట సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

## ఏప్రిల్ 1నుంచి ఇంటింటా సిపిఐ కార్యక్రమం

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోటభిక్షపతి




**ప్రజాపక్షం/హనుమకొండ :** ఏప్రిల్ ఒకటి నుంచి నిర్వహించే ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి పిలుపునిచ్చారు. సోమవారం గుం డ్లసింగారం గ్రామంలోని సురవరం సుధాకర్ రెడ్డి కాలనీలో ఆ కాలనీ ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరుగగా ము ఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని ఏప్రిల్ ఒకటి నుంచి నిర్వహించడం జరుగుతుందని, దీని ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారమే ధ్యేయంగా పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ క్రమంలో ఏప్రిల్ 1వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా జరిగే ఇంటింటికీ సిపిఐ కార్యక్రమానికి సిపిఐ సానుభూతి పరులు, ప్రజలు మద్దతు ఇచ్చి పార్టీ శ్రేణులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పానుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, కోడెపాక బాబు, మామునూరి దామోదర్, మాలోత్ మంగ, నలువాల సంధ్య, తాటికంటి మమత, కొల్గూరి రాధికపాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ అంతరాయాల నివారణ

### ఎన్‌పిడిసియల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ :** సాంకేతిక పరిజ్ఞానం తో విద్యుత్ అంతరాయాలు తగ్గించడానికి అవుటేజి మేనేజ్మెంట్ సిస్టం ఎంతగానో దోహపడుతుందని ఎన్‌పిడిసియల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. స్కాడా కంట్రోల్ రూమ్ నుంచి అవుటేజి మేనేజ్మెంట్ సిస్టం ద్వారా సబ్ స్టేషన్లు , లైన్లు , ట్రాన్స్ఫార్మర్ల అంతరాయాల లోకేషన్ తెలుసుకోవచ్చని తద్వారా వేగవంతగా పునరుద్ధరణ చర్యలు చేపట్టి వినియోగదారులకు అంతరాయాల సమయాన్ని తగ్గించవచ్చనిసిఎండి అన్నారు. సోమవారం హన్మకొండ , నక్కలగుట్ట విద్యుత్ భవన్‌లో సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి 17 సర్కిళ్ల ఎస్ఇ , డిఇ లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలోసిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ .. ముందుగా సంస్థ ప్రతినిధులు అవుటేజి మేనేజ్మెంట్ సిస్టంపై దృశ్య మాధ్యమం ద్వారా ప్రెజెంటేషన్ ఇచ్చారని చెప్పారు . పొడవాటి లైన్లలో , అడవులలో కవర్డ్ కండక్టర్ వలన చెట్లు కొమ్మలు విరిగిన ఎటువంటి అంతరాయాలు ఉండవని స్పష్టం చేశారు. జిఐఎస్ మ్యాపింగ్ ద్వారా ఫీడర్ల డిజిటలైజేషన్ జరిగి విద్యుత్ సమస్యలను సులువుగా గుర్తించి వెంటనే పరిష్కరించవచ్చన్నారు. రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ ప్రక్రియలో భాగంగా సబ్ స్టేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు . ఫాల్ట్ ప్యాసేజీ ఇండికేటర్లు ఇప్పటివరకు క్షేత్ర స్థాయిలో 2800 పెట్టడం జరిగిందని, పెండింగ్ లో ఉన్నవాటిని పూర్తి చేయాలనీ కోరారు. హెచ్ టి మీటర్లకు ఆటో మేటిక్ మీటర్ రీడింగ్ ప్రక్రియ ద్వారా ఆన్ లైన్ ద్వారా మీటర్ రీడింగ్ తీయడం జరుగుతుందని అన్నారు. ఫీల్డ్ కు వెళ్లి తీయాల్సిన అవసరం ఉండదని చెప్పారు. క్లౌడ్ ఏఐ ద్వారా డేటాను విశ్లేషించుకుని పనిని సులువుగా సులభంగా నెరవేర్చుకోవచ్చని, ఎస్ఈ , డిఈ లకు క్లౌడ్ ఏఐ గురించి దృశ్య మాధ్యమం ద్వారా జి.యం ఐటి ప్రెజెంటేషన్ ఇచ్చారని చెప్పారు. హెచ్ ఆర్డీ మాడ్యూల్ లను సి.జియం హెచ్ ఆర్డీ ఉపయోగాలను ఎస్.ఈ, డిఈ లకు వివరించారని, ప్రతి ఉద్యోగి కి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇందులో పొందుపరచబడి ఉంటుందని , సెలవు దరఖాస్తు మొదలుకొని ప్రతి సమాచారాన్ని ఇందులో నివేదించుకోవచ్చని పని సులభతరంగా ఉంటుందని చెప్పారు. ప్రతి సర్కిల్‌కు డిపార్ట్‌మెంట్ షెడ్‌లు ఏర్పాటు చేస్తున్నామని , డిపార్ట్‌మెంట్ షెడ్‌లలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు పెరగాలని సిఎండి కోరారు. ట్రాన్స్ ఫార్మర్లఫెయిల్ కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటి నుండి నుండి ప్రీ మాన్సూన్ పనులు చేపట్టాలని అన్నారు . విద్యుత్ ప్రమాదల నివారణకు పెద్దపీట వేస్తున్నామని, సంస్థ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎల్సీ యాప్ , పని ప్రదేశాలలో భద్రత పరికరాలు వాడేటట్లు ప్రతి రోజు పెప్ టాక్ నిర్వహిస్తున్నామని , తద్వారా విద్యుత్ ప్రమాదాలు తగ్గినాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి. మోహన్ రావు, టి.మధుసూదన్, సి.ఈ లు టి . తిరుమల్ రావు టి.సదర్ లాల్,రాజు చౌహాన్, అశోక్, సురేందర్, జయవంత్ రావు చౌహాన్, అన్నపూర్ణ , వెంకట రమణ, 17 సర్కిళ్ల ఎస్ ఈలు , జిఎంలు సామ్య నాయక్ , శ్రీనివాస్ , వేణు మాధవ్ , వేణుమాధవ్, వాసుదేవ్, ప్రభావతి, డి .ఈ లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## హోటళ్లపై దాడులు.. ఆరుగురిపై కేసు



**ప్రజాపక్షం/జనగామ :**జనగామ పట్టణంలోని హోటళ్లపై సోమవారం సివిల్ సప్లయ్ అధికారులు దాడులు చేశారు. డిటిసి యస్ శ్రీనివాస్, లచ్చునాయక్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. హోటళ్లలో వాడుతున్న గృహోపకర సిలిండర్లను సీజ్ చేసి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యాపార ప్రదేశాల్లో ఎవరు గృహోపకర సిలెండర్లు వాడొద్దని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. హోటళ్లలో అక్రమంగా వినియోగిస్తున్న సిలెండర్లను భారత్ గ్యాస్ కార్యాలయంలో కార్యాలయ నిర్వాహకులు ఖాశీకి అందజేశారు.

## క్లాస్‌రూమ్‌లో గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



**ప్రజాపక్షం/సంగెం :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం టూక్యా నగర్ (తండా) ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పోశాల చంద్రశేఖర్ (46) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విధుల్లో ఉండగా తరగతి గదిలోనేఆయన కుప్పకూలిపోవడం అందరినీ తీవ్రంగా కలచివేసింది. ఆయన స్వస్థలం సంగెం మండలంలోని కాట్రపల్లి గ్రామం.వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం చంద్రశేఖర్ ఎప్పటిలాగే విధులకు హాజరయ్యారు. పాఠశాలలో తరగతి గదిలో ఉన్న క్రమం లో ఆయనకు అకస్మాత్తుగా గుండె పోటు రావడం తో అక్కడికక్కడే కుప్పకూలారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు, సిబ్బంది వెంటనే ఆయనను నెక్కొండలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అ ప్పటికే ఆయన మృతి చెందినట్లు పరీక్షించిన వై ద్యు లు ధృవీకరించారు.విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ పవిత్రమైన తరగతి గదిలోనే ఉపాధ్యాయు డు ప్రాణాలు విడవడంతో పాఠశాలలో ,స్థానిక ంగా తీవ్ర విషాదం అలుముకుంది. ఈ ఊహించని పరిణామంతో ఆయన స్వగ్రామమైన కాట్రపల్లిలో కు టుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. విధి నిర్వహణలో నిబద్ధతగా ఉండే చ ంద్రశేఖర్ మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాల నా యకులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## తెలంగాణకు కేంద్ర ఉన్నత విద్యాసంస్థల్లో అన్యాయం

### లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపి కావ్య

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఉన్నత విద్యాసంస్థలు పరిమితంగా ఉండటంపై లోక్‌సభలో ఆందోళన వ్యక్తం చేశారు.సోమవారం పార్లమెంట్ లో ప్రశ్నోత్తర సమయంలో వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య రాష్ట్రంలో ఉన్న కేంద్ర ఉన్నత విద్యాసంస్థల సంఖ్య, వరంగల్‌లో వాటి స్థితి, 202325 కాలానికి మౌలిక వసతులు, పరిశోధన గ్రాంట్లు, డిజిటల్ లెర్నింగ్‌కు కేటాయించిన నిధుల వివరాలు కోరారు. అలాగే ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్), నియోజకవర్గ స్థాయిలో విద్యార్థుల నమోదు గణాంకాలు, కేంద్ర పథకాల కింద స్కాలర్‌షిప్ లబ్ధిదారుల వివరాలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపుకు కేంద్ర ప్రభుత్వ తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమాధానంలో తెలంగాణలో కేవలం 9 కేంద్ర ఉన్నత విద్యాసంస్థలు మాత్రమే ఉన్నాయని, వరంగల్ నియోజకవర్గంలో ఒక్క ఎన్ఐటీ మాత్రమే ఉందని వెల్లడించారు. అయితే రాష్ట్రంలో 35 కేంద్ర విద్యాలయాల్లో వరంగల్‌కు ఒకటే కేటాయించడం కూడా కేంద్ర వైఖరిని స్పష్టంగా చూపుతోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. తెలంగాణలో ఉన్నత విద్యలో నమోదు నిష్పత్తి (జీఈఆర్) దేశ సగటు కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, కేంద్రం నుంచి తగిన మౌలిక వసతులు, సంస్థలు అందకపోవడం రాష్ట్ర యువతకు నష్టం కలిగిస్తోందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్‌లో 1.65 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నప్పటికీ, కేంద్ర స్థాయి విద్యాసంస్థల విస్తరణ జరగకపోవడం దురదృష్టకరమని అన్నారు.ఎన్ఐటీ వరంగల్‌కు కేటాయించిన రూ.64.38 కోట్ల నిధులు సరిపోవని, కొత్త కేంద్ర విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డిమాండ్ చేశారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/జనగామ:**ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ మేయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి నిర్వయించగా పెద్ద సంఖ్యలో ఫిర్యాదురాలు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో కలిసి స్వయంగా ధరఖాస్తులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి మార్గాలను అధికారులను ఆదేశించారు. 232 మంది వివిధ సమస్యలపై ధరఖాస్తులు ధరఖాస్తు చేసుకోవగా వాటిని ఆయా శాఖల అధికారులను అందజేశారు. స్టేషన్‌ఘనపూర్ మండలం కేంద్రంలోని నివాసం ఉంటున్న దీనమ్మ తన తండ్రి పసుపు కుంకుమకింద ఇచ్చిన ఎకరం 36 గుంటల భూమి మ్యూటేషన్ చేసి పట్టాదార్ పాస్‌బుక్ ఇవ్వాలని కోరారు. జనగామ పట్టణంలోని సంజయ్ నగర్‌కు చెందన ఆర్ సరిత గత పదేళ్లుగా కిరాయి ఇంట్లో ఉంటున్నానని తనకు ఎటువంటి ఇల్లు లేదు, ఖాలీ స్థలం ఉన్నందున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. స్టేషన్‌ఘనపూర్ మండల కేంద్రానికి చెందిన గీతారాథోడ్ 2019లెఓ 623.25 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేయగా కుటుంబ అవసరాల కోసం అమ్మకానికి పెట్టగా హౌస్‌సైడ్స్ అని చూపిస్తుందని, రిజిస్టేషన్ కావడం లేదని తగు చర్యలు తీసుకొని రిజస్టేషన్ అయ్యే విధంగా చూడాలని కోరారు. పై సమస్యలతో పాటు అనేక అంశాలపై పలువరు ధరఖాస్తు చేసుకున్నారు. వీటిని ఆయా శాఖల అధికారులకు రెఫర్ చేస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఆర్‌డిఓ గోపిరాం, వెంకన్నతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆశల అక్రమ అరెస్టుకు నిరసనగా ధర్నా

**ప్రజాపక్షం/మరిపెడ:**కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్బంగా హామీ ఇచ్చిన విధంగా ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 18000 ఇవ్వలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేసి,రాష్ట్ర నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని,ప్రభుత్వ దృశ్చర్యను ఖండిస్తూ సోమవారం మహబుబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలుపుతూ ఖమ్మం వరంగల్ హైవే దిగ్బాందించి రాస్తారోకో నిర్వహించి,ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదాలు చేశారు.ఎర్రని ఎండలో గంటపాటు రోడ్డుపై బైటాయించడంలో రహదారి స్థంభించి భారిగా వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.ఈ సందర్బంగా ఆశాల నిరసనకు మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మద్దతు తెలుపుతూ నిరసనలో పాల్గొన్నరు.గత ఎన్నికల సందర్బంగా మాయ మాటలు చెప్పి ఆశాల ఓట్లు వేయించుకోని,వారి హాక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని,కనీస వేతనం 18000 ఇచ్చి వారిని ఆదుకోవాలనీ ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశ కార్యకర్తల యునియన్ సిఐటియు జిల్లా అధ్యక్షురాలు వంగురి ఉపేంద్ర,మండల ఆధ్యాక్షురాలు ఆసియా,ఆశవర్కర్ యునియన్ నాయకురాలు సుల్తాన్,ధనమ్మ,లలిత,పార్వతమ్మ, సునిత, శైలజ, కైక, పద్మ,వరలక్ష్మి,బుజ్జి,జమున,విజయలక్ష్మి, రమ , శ్రీలత,ఇంద్ర, రాహేల,గ ణిత,జ్యోతి ,శోభ, వెం కట రమణ,రమాదేవి,అనూధ,పద్మ,స్వరూప,నాగమణి, అరుణ ,అనిత,మాధవి,తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తుకు బానిస కావొద్దు : కలెక్టర్

**ప్రజాపక్షం /జనగామ :**యువత మత్తుకు బానిక కావొద్దని జనగామ జల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సోమవారం జనగామ కలెక్టరేట్‌లో డిసిపి రాజమహే ంద్రనాయక్, అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో కలిసి మత్తు పదార్థాల నియంత్రణపై విద్యా, వ్యవసాయ, ఎక్సైజ్, పోలీస్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో మత్తు ప దార్థాల నియంత్రణపై పేయింటింగ్, వ్యాస రచన పోటీలు నిర్వయించి విద్యార్థులకు అవగామన కల్పంచాలన్నారు. రైల్వే స్టేషన్, ఆర్‌టిసి బస్టాండ్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అవగాహన కార్యక్రమాలతో సమాజంలో మార్పు తీసుకురావచ్చునన్నారు. మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన, ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వయించాలన్నారు. యువత బత్తుకు బానిస కావొద్దని, ఉజ్జవల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అన్నారు. యువతకు అవగాహన కల్పంచడం ద్వారానే మత్తు రహిత సమాజాన్ని ఏర్పాటు చేయగలమన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికార అంబికాసోని, ఎక్సైజ్ ఎస్పీ అనిత, ఆర్‌టిఓ శ్రీనివాస్‌గౌడ్, డిఎంహెచ్‌ఒమల్లిఖార్జున్‌రావుతో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

**రోడ్డు భద్రత మార్గదర్శకాలు తప్పనిసరి**

రోడ్డు భద్రత మార్గదర్శకాలు తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో డిసిపి రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి రహదారుల భద్రతపై సంబందిత అధికారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హైవే ఐఆర్‌సి నియమ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. అలాగే హైవేలపై అనుమతి లేని హోర్డింగ్‌లు ఉండకూడదని, జనగామ పట్టణంలోని రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి అమ్మకాలు జరగకూడదని ట్రాఫిక్ ఇ బ్బందులు తలెత్తకుండా సమీకృత వెజ్, నాన్‌బెజ్ మార్కెట్ పనులు త్వరగా పూర్తి చేసి అందులోనే అమ్మకాలు జరిగే విధంగా చూడాలన్నారు. స్టేషన్‌ఘనపూర్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని, జల్లాలోని అన్ని పాఠశాలల వద్ద వేగ నియంత్రికలన తనిఖీ చేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల చే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను ఇరువైపులా తొలగించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డిఓ గోపిరాం, వెంకన్న, ఆర్‌అండ్‌బి ఇఇస్వరూప, ఆర్‌టిఒ శ్రీనివాస్‌గౌడ్, ఎక్సైజ్ అధికారి అనిత, పంచాయతీ రాజ్‌ఇఇ శ్రీనివాస రావు, డిఎంహెచ్‌ఒ మల్లికార్జున్‌రావు, అర్‌టిఏ మెంబర్ అభిగౌడ్, మున్సిపల్ కమీషనర్ పాల్గొన్నా రు.

**జనగణన సమర్ధవంతంగా నిర్వయించాలి**

జనగణన సమర్ధవంతంగా నిర్వయించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. జనగణన 2027పై డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోళీకేరి హైదరాబాద్ నుండి జనగణనపై సమీక్షంచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2027 మొదటి విడత జనగనణ సమర్ధవంతంగా నిర్వయించాలన్నారు. ఇళ్ల గణన ప్రక్రియలు, మ్యాప్ తయారీ, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించి సజావుగా పనిచేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగొద్దని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జనగణన జరగాలన్నారు.

# రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

లేబర్ కోడ్‌ల రద్దుకై ఏప్రిల్ ఒకటిన బ్లాక్ డే

అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటిన దేశవ్యాప్త బ్లాక్‌డే నిర్వహించనున్నట్లు సంఘాల నాయకులు తెలిపారు. ఖమ్మం గిరి ప్రసాద్ భవన్‌లోని ఏఐటియుసి కార్యాలయంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ అధ్యక్షతన అఖిలపక్ష కార్మిక సంఘల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ గత 100 ఏళ్లుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానంలో కార్మికులకు వ్యతిరేకంగా యాజమాన్యాలకు అనుకూలంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు. కార్మిక చట్టాలలో అతి ముఖ్యమైన పారిశ్రామిక వివాదాల చట్టం, ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 1926, పారిశ్రామిక ఉపాధి (స్టాండ్ ఆర్డర్స్) చట్టం, 1946 పారిశ్రామిక వివాదాల చట్టం 1947 తదితర చట్టాలను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానంలో తీసుకు వచ్చిన పారిశ్రామిక సంబంధాల కోడ్ 2022లో అన్ని అంశాలు ఉన్నట్లుగానే కనిపిస్తాయని కానీ అవి ఆచరణకు సాధ్యం కావని వారు తెలిపారు. మోడీ ప్రభుత్వం భవిష్యత్తులో పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా కాలపరిమితితో కూడిన ఉద్యోగాలను సృష్టిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నివీర్, అగ్నిపథ్ లాంటి పథకాలతో ఈ విధానాలకు శ్రీకారం చుట్టిందన్నారు. పారిశ్రామికవేత్తల ఆదేశాల మేరకు 12 గంటల పనివిధానాన్ని ప్రవేశపెట్టి బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటకలో ఆమోదింపజేశారని వారు విమర్శించారు. దీని ఫలితంగానే కర్నాటక ప్రజలు ఆగ్రహానికి గురై అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. మోడీ కార్మిక వ్యతిరేక నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు భారతదేశ వ్యాప్తంగా ఏప్రిల్ ఒకటిన బ్లాక్‌డేను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో నిరసన బ్లాక్‌డేను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. విష్ణువర్ధన్, ఐఎన్‌టియుసి టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుక్కల రామకృష్ణ, ఉపాధ్యక్షులు సిద్దెల నగేష్, టియుసిఐ రాష్ట్ర నాయకులు సివై పుల్లయ్య, కె.శ్రీనివాస్, ఐఎఫ్‌టియు జిల్లాఅధ్యక్షులు సుబాని, జిల్లానాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ

ప్రజాపక్షం/మధిర : ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లునందిని విక్రమార్క ఆధ్వర్యంలో మధిరలోని భట్టి క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. తనకుమారిడి వివాహ శుభ సందర్భంగా మధిర పట్టణ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి నూతన వస్త్రాలను బహుకరించారు. పట్టణ పరిశుభ్రత, అభివృద్ధిలో మున్సిపల్ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, వారు ఆహర్నిశలు శ్రమించి ప్రజలకు సేవ చేస్తున్నారని ఈ సందర్భంగా నందిని కొనియాడారు. నూతన వస్త్రాలను అందుకున్న కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. తమను గుర్తించి గౌరవించినందుకు మల్లు మల్లు నందినికి, భట్టివిక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోన ధనికుమార్, కమీషనర్ సంపత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి రామారావు, పులిబండ్ల చిట్టిబాబు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు వెంకటరమణగుప్తా, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, అద్దంకి రవికుమార్, దుంపా వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



ప్రజాపక్షం/వైరా: వైరాలో వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో రబీ సీజన్‌లో పండిన మొక్కజొన్నలు కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ కేంద్రాలు ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సిపిఎం డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో లక్ష ఎకరాల్లో పైగా రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుఓగలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు మొక్కజొన్నలు క్వింటాకు రూ.1600, రూ.1700లకు కొనుగోలు చేస్తున్నారని, దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలకు రూ.2400లు ఉందని, మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించి మద్దతు ధర అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## గంజి నారాయణకు టిడిపి నివాళి




ప్రజాపక్షం/మధిర: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి తుది వరకు పార్టీలో కొనసాగిన సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గంజి నారాయణ ఇటీవల మృతి చెందిన సంగతి విధితమే. సోమవారం దెందుకూరు శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో ఆయన సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంటరీ టిడిపి కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన అకాల మృతి టిడిపికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు చేకూరి శేఖర్‌బాబు, ఐటిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి వేమూరి సునీల్, మధిర రూరల్ మండల అధ్యక్షులు మార్నిడి పుల్లారావు, నాయకులు చెరుకూరి కృష్ణారావు, వట్టికొండ రామమ్మోహన్‌రావు, వాసిరెడ్డి ఉపేంద్ర, వాసిరెడ్డి కృష్ణ, ఈశ్వర్, మాదల నర్సింహారావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు

రూ.60 లక్షలతో మూడు అధునాతన స్వీపింగ్ యంత్రాల కొనుగోలు : మేయర్ నీరజ



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. రూ.60 లక్షలతో కొనుగోలు చేసిన మూడు అధునాతన స్వీపింగ్ యంత్రాలను మేయర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో పరిశుశ్రభతను మెరుగుపర్చడంతో పాటు పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆధునీక స్వీపింగ్ యంత్రాలను కొ నుగోలు చేసి మూడు ప్రాంతాలకు కేటాయించినట్లు తెలిపారు. నగర ప్రజలకు పచ్చదనం, పరిశుభ్రత కల్పించడమే పాలక వర్గ లక్ష్యమన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణలాల్, డిఈ రంజిత్ కుమార్, ఏఈలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సింథటిక్ ట్రాక్ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలి : కమిషనర్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సింథటిక్ ట్రాక్ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. సోమవారం సర్దార్ పటేల్ మైదానంలో నిర్మాణంలో ఉన్న సింథటిక్ ట్రాక్ పనులను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రాక్ నిర్మాణంలో మిగిలిన పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.

# ఉన్నత పదవులు కమ్యూనిస్టు పార్టీలోనే

సామాన్యులకూ గౌరవం : బాగం

కమ్యూనిస్టు పార్టీ ఆదరణ మరువలేనిది : మేయర్ గణేష్

కొత్తగూడెం మేయర్‌కు ఘన సన్మానం



ప్రజాపక్షం/ఖమ్మం : కమ్యూనిస్టు పార్టీలోనే సామాన్యులకు గౌరవం ఉంటుందని మారిన రాజకీయ సామాజిక పరిస్థితుల్లో సామాన్యులకు సైతం ఉన్నత పదవులు కమ్యూనిస్టు పార్టీలోనే లభిస్తాయని హేమంతరావు తెలిపారు. ఎన్నికలు అంటేనే డబ్బు ఖర్చు చేయడం సామదాన దండోపాయాలకు వేదికగా మారిన ఈ రోజుల్లో సామాన్యమైన వ్యక్తిని మేయర్‌ను చేసి కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షమేనని రుజువు చేసిందన్నారు. ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ పక్షాన మేయర్‌గా ఎన్నికైన మూడ్ గణేష్‌ను సిపిఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ.. అంకితభావంతో పనిచేస్తూ కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు, బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టు పార్టీ ఎజెండా అని అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రణాళికాబద్ధ కార్యాచరణ, అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలన్నారు. సన్మాన గ్రహీత మూడ్ గణేష్ మాట్లాడుతూ.. సామాన్యమైన కార్యకర్తగా ఉన్న తనకు కమ్యూనిస్టు పార్టీ ఒక అద్భుత అవకాశాన్ని కల్పించిందని నాలాంటి సామాన్యులకు అవకాశాలు ఇచ్చి ఉన్నత స్థానాలకు చేర్చడం కమ్యూనిస్టు పార్టీలోనే సాధ్యమన్నారు. తనకు వచ్చిన ఈ అవకాశంతో పేదల అభ్యున్నతికి ముఖ్యంగా కొత్తగూడెం కార్పొరేషన్ అభివృద్ధికి శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషాతో కలిసి కృషి చేస్తానన్నారు. సిపిఐ జిల్లా సమితితో పాటు వివిధ మండల సమితులు, ప్రజా సంఘాలు మేయర్ గణేష్‌తో పాటు విజయంలో కీలక భూమిక పోషించిన ఎస్‌కె సాబీర్‌పాషాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ జాతీయ క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు కె.నారాయణ, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఇంటింటికీ సిపిఐ

10 రోజుల పాటు సిపిఐ కార్యాచరణ

ఖమ్మంలో బాగం, మధిరలో దండి, పాలేరులో మౌలానా ప్రారంభం



ప్రజాపక్షం/ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా సమితి ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి పది రోజుల పాటు ప్రతి గ్రామం, వార్డు, డివిజన్లలో సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడం దానితో పాటే పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీశ్రేణులు మొత్తం ఈ కార్యాచరణలో పాల్గొంటాయని పది రోజుల సమస్యల గుర్తింపు, అధ్యయనం తర్వాత పరిష్కారానికి పోరాట కార్యాచరణను రూపొందిస్తామని సురేష్ తెలిపారు. పాలక వర్గాలు కొన్ని సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తున్నాయని ఆయన తెలిపారు. యుద్ధం సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం చూపెడుతుందని క్రమేపి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయన్నారు. యువత ఉపాధి లేక ఇబ్బందులు పడుతుందని దీనికి తోడు జాతీయ ఉపాధి హామీ పథకం చట్ట సవరణ ద్వారా వచ్చిన విబి జీ రాం జీ పథకం అమలులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా ఏప్రిల్ ఒకటి నుంచి 10 వరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఖమ్మంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు బుధవారం లాంఛనంగా ప్రారంభిస్తారని సురేష్ తెలిపారు. మధిరలో దండి సురేష్, పాలేరులో మహ్మద్ మౌలానా, చింతకానిలో జమ్ముల జితేందర్‌రెడ్డి మిగిలిన చోట్ల రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభిస్తారని సురేష్ తెలిపారు.

# పండుగ వాతావరణంలో గ్రామసభ

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వివరించాలి

గ్రామసభ నిర్వహణపై కలెక్టర్ సమీక్ష



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పండుగ వాతావరణంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామసభ నిర్వహణపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ రెండున ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించాలన్నారు. గ్రామసభల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు. మండల స్థాయి అధికారులను వివిధ గ్రామ పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభల్లో పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు కూడా గ్రామసభ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు. ప్రజాప్రతినిధులందరూ గ్రామసభల్లో పాల్గొనేవిధంగా ఆహ్వాన పత్రికలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గ్రామ పంచాయతీకి గత రెండున్నర ఏళ్ల కాలంలో అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన ప్రింటెడ్ మెటీరియల్ అందించాలని తెలిపారు. అభయ హస్తం, గ్యారెంటీ పథకాలు, సన్న బియ్యం సరఫరా వంటి అనేక పథకాలకు సంబంధించి వివరాలు గ్రామసభలో ప్రజల ముందు వినిపించాలన్నారు. పండుగ వాతావరణంలో గ్రామసభలో జరగాలని దానికి అనుగుణంగా ఎల్ఈడి స్క్రీన్లు, సౌండ్ సిస్టం, స్టేజీ డెకరేషన్ ఉండాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర గీతంతో గ్రామసభ ప్రారంభమవుతుందని అనంతరం సిఎం సందేశం, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలను తెలియజేయడం లబ్దిదారుల వివరాలు వారి అభిప్రాయాలు తీసుకోవడం, ప్రజాప్రతినిధుల సందేశంతో కార్యక్రమం ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ సభ నిర్వహణకు ప్రతి గ్రామానికి బడ్జెట్ వచ్చిందని ఆ నిధులను వినియోగిస్తూ గ్రామసభ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పంచాయతీ అధికారులు గ్రామసభ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

**వడదెబ్బ భారీనపడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**

జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు వడదెబ్బ భారీనపడకుండా అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు ముందస్తు జాగ్రత్త చర్యలు సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వడగాల్పుల సందర్భంగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, వివిధ శాఖల బాధ్యతలపై కలెక్టర్, అదనపు కలెక్టర్లలతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే ప్రథమ కర్తవ్యమని, వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఆసుపత్రులలో వడదెబ్బ చికిత్స ప్రోటోకాల్స్ పాటించాలన్నారు. ఓఆర్ఎస్, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. మున్సిపల్, గ్రామీణాభివృద్ధి శాఖలు జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పనుల సమయాన్ని సవరించాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పుడు పాఠశాలల సమయంలో మార్పులు చేసేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్మిక శాఖ భవన నిర్మాణ కార్మికులకు మధ్యాహ్న సమయంలో విరామం, నీడ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, బయట పనిచేసేవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌లో 6,572 కేసులు పరిష్కారం

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 6572 కేసులు పరిష్కారం అయ్యాయని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగిన జాతీయలోక్ అదాలత్‌కు విశేషస్పందన వచ్చిందని వీటిలో 77 సైబర్‌క్రైమ్ కేసుల్లో 36 లక్షల రూపాయలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేసినట్లు సిపి పేర్కొన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో రాజీకి అవకాశం ఉండి పరిష్కారించిన 6,572 కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 764, ఈ పెట్టి కేసులు 1,837, డ్రంకెన్‌డ్రైవ్ కేసులు 3,971, సైబర్ కేసులు 77 పరిష్కరించడం ద్వారా రూ. 36.47,338 బాధితులకు అందజేయటం జరిగిందన్నారు. రాజీమార్గం రాజమర్గామని, లోక్ అదాలత్‌లో ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. బాధితులకు అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీసు కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్‌కు సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు ఆయన ఈసందర్భంగా కృతజ్ఞాతలు తెలిపారు.



## యాదవ సర్పంచ్‌లు, కౌన్సిలర్లకు సన్మానం

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : యాదవ మహసభ ఆధ్వర్యంలో జిల్లాలోని యాదవ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. సోమవారం ఖమ్మం మధురానగర్ కాలనీలో గల శ్రీ గోకులకృష్ణ సేవా సమితి ట్రస్ట్ భవన్‌లో తెలంగాణ యాదవ మహసభ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కౌన్సిలర్లకు అభినందన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ యాదవ మహసభ వ్యవస్థాపక అధ్యక్షులు, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూణం యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన వారు కృషి చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకోవాలన్నారు. రాజకీయంగా మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. సభాధ్యక్షులుగా వైరా మాజీ మార్కెట్ చైర్మన్ తుమ్మా రోశయ్య వ్యవహరించారు. బిసి సంఘం నేతలు, ఆర్‌జెసి కృష్ణ, గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరగాని వెంకన్న గౌడ్, ఆర్కా హాస్పటల్ ప్రముఖ వైద్యులు బీశం వెంకటేశం యాదవ్, యాదవ మహసభ రాష్ట్ర కార్యదర్శి మేకల సుగుణారావు, జిల్లా అధ్యక్షులు కోడి లింగయ్య, బిఆర్‌ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్సూర్, మహిళా అధ్యక్షురాలు చిత్తారు ఇందుమతి, మహిళా కార్యదర్శి కమల, యూత్ అధ్యక్షులు మల్లేష్, రాష్ట్ర నాయకులు గంగరాజు, మాజీ జెడ్పిటిసి హైమావతి, ఎంపిపి సత్యం, పలువురు యాదవ ప్రముఖులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మనమందరం చిత్తశుద్ధితో పనిచేద్దాం

ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు

ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి

వాహనాలకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి

ఏసిపి సారంగపాణి



ప్రజాపక్షం/వైరా: వైరా పోలీస్‌స్టేషన్‌లో ప్రజాప్రతినిధులు, రాజకీయప అర్టీల నాయకులకు, డ్రైవర్లకు, డ్వాక్రా మహిళలకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైరా ఏసిపి ఎస్.సారంగపాని మాట్లాడుతూ మీ ప్రాంతాల్లో ఎలాంటి పనులు చేపట్టాలి శాంతియుత ప్రశాంత పద్ధతుల పరిరక్షణలో పలు సూచనలు, సరపచ్‌లు, కౌన్సిలర్‌లు చేయాలన్నారు. చిత్తశుద్ధితో అందరం కలిసి మంచి కార్యక్రమం చేద్దాం అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రజలను ఎక్కించుకోవద్దు, వాహనాలకు లౌడ్ స్పీకర్లు ఉపయోగించవద్దు, మహిళల పట్ల చాలా జాగ్రత్తలు పాటించాలి వారిని గౌరవించాలి, అతివేగంగా వాహనాలు నడిపేటప్పుడు ఎదుటి వాహనాన్ని ఓవర్టేక్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా వాహనాన్ని నడపాలి, ఎదురు ఎలాంటి వాహనాలు లేనప్పుడే ఓవర్ చేయాలని సూచించారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని సూచించారు. ప్రతి వాహనదారుడు కారు లారీ ఆటోలు ట్రాక్టర్స్ ద్విచక్ర వాహనాలకు ముందు వెనుక రేడియం స్టిక్కర్లు వేసుకోవడం వలన ఎదురుగా ఉండే వాహనాలు మనకు కనిపిస్తాయి. ప్రమాదాలను కూడా నివారించవచ్చు అని తెలిపారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దు, వారికి వాహనాలు ఇచ్చినప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఆ బాధ్యత తల్లి దండ్రులదే, వారిపై కూడా కేసులు నమోదు చేస్తాం మత్తు అంటే గంజాయి కొకైన్ లాంటి వాటికి బానిస అయ్యి భవిష్యత్తును పాడు చేసుకోవడంతో పాటు మత్తులో వారు ఏం చేసేది కూడా అర్థం కాని పరిస్థి ఉంది. అలాంటి మత్తును పారద్రోలేందుకు ప్రతిఒక్కరూ మత్తు నిర్మూలన ధ్యేయంగా పనిచేయాలి, దానికి ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు దాతలు ముందుకు వచ్చి సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఎంతో మంచిది అన్నారు. ఒక్క సిసి కెమెరా 100 మందితో సమానం. ఎలాంటి దొంగతనాలు గొడవలు జరిగిన కూడా వెంటనే కనిపెట్టవచ్చని ఏసిపి సారంగపాణి సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటప్రసాద్, ఎస్సై పుప్పాల రామారావు, అదనపు ఎస్సై పవన్, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, డ్రైవర్లు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## నగరంలో జోరుగా 'అరైవ్-అలైవ్'

డ్రైవర్లకు సిఐలు అవగాహన



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారించేందుకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రజలు, వాహనదారుల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా 'అరైవ్అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను తెలియజేస్తున్నారు. సోమవారం ఖమ్మం టౌన్ ఏసిపి ఎస్‌వి రమణ మూర్తి పర్యవేక్షణలో ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆయా స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో రైల్వే స్టేషన్ వద్ద సిఐ కరుణాకర్ సిబ్బందితో కలిసి డ్రైవర్లు, వాహనచోదకులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో బైపాస్ రోడ్డు ఎన్టీర్ సర్కిల్ సమీపంలో టూటౌన్ సిఐ బాలకృష్ణ స్థానిక ట్రాలీ, ఆటో, వ్యాన్ డ్రైవర్లు, వాహనచోదకులకు అవగాహన సదస్సు నిర్వించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారు డ్రైవర్లు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అందరిబాధ్యత అన్నారు. అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నిడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. ఫలితంగా వారి ప్రాణాలతో పాటు ఎదుటి వారి ప్రాణాలకు నష్టం కలిగిస్తున్నారన్నారు. నష్టం జరిగితే కుటుంబాలకు తీరని విషదం మిగులుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో వాహనచోదకులు, డ్రైవర్లు, స్థానికులు పాల్గొన్నారు.

# మురిసిన ముంబై!

## రోహిత్, రికెల్టన్ అర్ధశతకాల హోరు..

ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్‌ను ముంబై ఇండియన్స్ విజయంతో ఆరంభించింది. ఆరంభ మ్యాచ్ ఫోబియాను అధిగమిస్తూ రికార్డు విజయంతో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ముంబై చెక్ పెట్టింది. 221 పరుగుల భారీ ఛేదనలో ఓపెనర్లు రోహిత్ శర్మ(78), రియాన్ రికెల్టన్(81) అటాకింగ్ గేమ్‌తో విరుచుకుపడ్డారు. పవర్ ప్లేలో 80 పరుగులతో గట్టి పునాది వేసిన ఈ ద్వయం మ్యాచ్‌ను ముంబైవైపు తిప్పింది. వీరిద్దరు ఔటైనా కెప్టెన్ హార్దిక్ పాండ్యా (18 నాటౌట్), తిలక్ వర్మ(20)లు ఆడుతూపాడుతూ లాంఛనం పూర్తి చేశారు. పంతొమ్మిదో సీజన్ రెండో మ్యాచ్‌లోనూ రెండొందల లక్ష్యం సరిపోలేదు. వాంఖడేలోనూ బ్యాటర్ల విధ్వంసానికి బౌలర్లు తేలిపోగా ముంబై ఇండియన్స్ బోణీ కొట్టింది. కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్దేశించిన 221 పరుగుల భారీ ఛేదనలో ముంబై ఓపెనర్లు రోహిత్ శర్మ(78), రియాన్ రికెల్టన్(81) బౌండరీలతో రెచ్చిపోయారు. ఫుల్ షాట్లతో హిట్‌మ్యాన్, స్టన్నింగ్ షాట్లతో రికెల్టన్ అలరించగా పవర్ ప్లేలోనే 80 పరుగులు దాటిన ముంబై స్కోర్ బోర్డు ఆ తర్వాతా పరుగులు పెట్టింది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఓవర్లో దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి పంపిన రోహిత్ బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. కాసేపటికే 24 బంతుల్లో రికెల్టన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా కొండంత లక్ష్యం కాస్త మంచు ముక్కలా కరిగిపోయింది. అనుకుల్ రాయ్ డైవింగ్ క్యాచ్‌తో రోహిత్ ఔటైనా ఇంప్యాక్ట్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్(16) ఉన్నంతసేపు ధనాధన్ ఆడాడు. ఫిఫ్టీతో చెలరేగిన రికెల్టన్ మెరుపు త్రోకు రనటవ్వగా.. అప్పటికే ముంబై గెలుపువాకిట నిలిచింది. 37 పరుగులు అవసరమైన వేళ తిలక్ వర్మ(20)తో కలిసి కెప్టెన్ హార్దిక్ పాండ్యా() లాంఛనం పూర్తి చేశారు. వికెట్ల తేడాతో గెలుపొందిన ముంబై రెండు పాయింట్లు దక్కించుకుంది.



### రహానే, రఘువంశీ దూకుడు

మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ భారీ స్కోర్‌తో ముంబై ఇండియన్స్‌కు సవాల్ విసిరింది. ముంబై కంచుకోట వాంఖడేలో ఓపెనర్లు అజింక్యా రహానే(67), ఫిన్ అలెన్(37)లు శుభారంభంతో కోల్‌కతా ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చారు. డేంజరస్ ఓపెనర్ అలెన్ ఔటైనా.. అర్ధ శతకంతో రెచ్చిపోయిన రహానేకు అంగ్‌క్రిష్ రఘువంశీ(51) మెరుపులు తోడవ్వగా ముంబై బౌలర్లు డీలా పడ్డారు. డెత్ ఓవర్లలో వైస్ కెప్టెన్ రింకూ సింగ్(33 నాటౌట్) తన స్టయిల్ విధ్వంసంతో కోల్‌కతా నాలుగు వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది.

# రాష్ట్రస్థాయి ఇంటర్ స్కూల్స్ ఛాంపియన్‌షిప్
## పవర్ హౌస్ తైక్వాండో అకాడమీకి పతకాలు




తెలంగాణ ఓపెన్ రాష్ట్రస్థాయి 14వ ఇంటర్‌స్కూల్స్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2026లో పవర్ హౌస్ తైక్వాండో అకాడమీ లిటిల్ ఛాంప్స్ అద్భుత ప్రతిభ కనబరిచారు. క్రమశిక్షణ, పట్టుదలకు తోడు నైపుణ్యాన్ని ప్రదర్శించిన యువ క్రీడాకారులు 9 బంగారు పతకాలు, 1 వెండి పతకం, 6 కాంస్య పతకాలు గెలుపొంచారు. ఒక టోర్నమెంట్లో ఇన్నేసి పతకాలు సాధించడం పవర్ హౌస్ అకాడమీ చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన అని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 19 మంది పాల్గొనగా వీరిలో 16 మంది పోడియం మీద సగర్వంగా పతకాలు అందుకోవడం సంతోషకరమైన విషయమని వారు వెల్లడించారు. తెలంగాణ ఓపెన్ స్టేట్ లెవల్ ఇంటర్‌స్కూల్స్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2026లో రాష్ట్రం నలుమూలల నుంచి కఠిన పోటీ ఎదురైనప్పటికీ, పవర్ హౌస్ జట్టు క్యోరుగు, పూమ్సే విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ గర్వకారణమైన సందర్భంలో వరల్ తైక్వాండో గ్లోబల్ సభ్యులు, నేషనల్ పూమ్సే, క్యోరుగు రిఫరీలు అరవింద్ నంద్యాల సురేష్ బోయా విజేతలను అభినందించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని వారు ప్రశంసించారు. ప్రతి విద్యార్థి పడిన కష్టం ఈ చారిత్రాత్మక విజయానికి కారణమని వారు తెలిపారు. జాతీయ స్థాయి ఛాంపియన్లను తయారు చేయడమే లక్ష్యంగా పవర్ హౌస్ తైక్వాండో అకాడమీ క్రమశిక్షణ అందిస్తోందని, నిరంతర సాధన.. ప్రతిభాభివృద్ధిపై దృష్టి సారిస్తూ ముందుకు సాగుతోందని వారు పేర్కొన్నారు. యువతరంలోని ప్రతిభను ప్రోత్సహిస్తూ మరిన్ని గొప్ప విజయాలను సాధించేందుకు అకాడమీ కట్టుబడి ఉందని తెలిపారు. ఇటీవలి ఈ విజయాన్ని పురస్కరించుకుని త్వరలోనే ఒక చిన్న విజయోత్సవ సమావేశం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

# ప్రజ్ఞానంద బోణీ..
## అనీశ్ గిరిపై విజయం


సైప్రస్ : ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద అదిరిపోయే బోణీ కొట్టాడు. ఆదివారం జరిగిన ఓపెన్ కేటగిరీ తొలి పోరులో ప్రజ్ఞానంద 10 తేడాతో నెదర్లాండ్స్ జిఎం అనీశ్ గిరిపై అద్భుత విజయం సాధించాడు. తన కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న గిరిపై ప్రజ్ఞానంద తనదైన ఆధిపత్యం ప్రదర్శించాడు. గేమ్‌లో ఒక దశలో గిరి ఆధిక్యం కనబరిచినా అతను చేసిన తప్పిదాన్ని అనుకూలంగా మలుచుకున్న ప్రజ్ఞానంద విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు మహిళల కేటగిరీలో దివ్యాదేశ్‌ముఖ్..అన్నా ముజుచిక్‌తో గేమ్ డ్రా చేసుకోగా, వైశాలి రాంబాబు, బిబిసారా అసబుయేయా మధ్య గేమ్ డ్రాగా ముగిసింది.



# యువతరంగం

## జాబ్ మార్కెట్‌పై ఎఐ ప్రభావం

కృత్రిమ మేధస్సు (ఎఐ) నిరంతరం విస్తరిస్తున్న సమయంలో, మిగతా అన్ని రంగాల కంటే ఎక్కువగా జాబ్ మార్కెట్ తీవ్ర ప్రభావానికి లోనవుతున్నది. 'యాంథ్రోపిక్' సంస్థ నిర్వహించిన సర్వే ఫలితాలను అనుసరించి, విస్తారమైన భాషా నమూనాలు (లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ లేదా ఎల్ఎల్ఎం) వాస్తవ ఉద్యోగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒక పని చేయగల సాంకేతిక సామర్థ్యం ఉన్నట్లయితే అది ఇప్పటికే ఉద్యోగాలను పూర్తిగా భర్తీ చేస్తుందని ఎఐ గురించి అపోహ చాలా మందిలో ఉంది. కానీ ఈ అధ్యయనాన్ని అనుసరించి, సిద్ధాంతంగా ఎఐ అనేక పనులను చేయగలిగినా, ప్రస్తుత కార్యాలయాల్లో దాని వాస్తవ వినియోగం ఇంకా పరిమితంగానే ఉంది. కాగా, ఈ పరిశోధనలో 'అబ్జర్వ్‌డ్ ఎక్స్‌పోజర్' అనే కొత్త ప్రమాణాన్ని ప్రవేశపెట్టారు. ఇది ఎఐ చేయగల సామర్థ్యాన్ని కాకుండా, ప్రస్తుతం నిజంగా కార్యాలయాల్లో ఎఐ ఏమి చేస్తున్నదో అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది. ఈ విధానం ద్వారా ఎఐ ప్రభావాన్ని మరింత వాస్తవికంగా అర్థం చేసుకోవచ్చు. అయితే, ఇక్కడ సిద్ధాంత సామర్థ్యం, వాస్తవ వినియోగం మధ్య వ్యత్యాసాన్ని గమనించాల్సి ఉంటుంది. అందుకే, ఈ అధ్యయనంలో ముఖ్యంగా 'క్లౌడ్' ఎఐ వంటి పెద్ద భాషా నమూనాలను పరిశీలించారు. సిద్ధాంతపరంగా చూస్తే కంప్యూటర్ సైన్స్, గణితశాస్త్రానికి సంబంధించిన ఉద్యోగాల్లో జరిగే పనుల్లో సుమారు 94 శాతం వరకు ఎఐ చేయగల సామర్థ్యం ఉందని తేలింది. కానీ, వాస్తవ కార్యాలయాల్లో ఈ ఎఐ వ్యవస్థలను ప్రస్తుతం కేవలం 33 శాతం పనులకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. టెక్నాలజీ ఉన్నప్పటికీ సంస్థలు వెంటనే పూర్తి స్థాయి ఆటోమేషన్ వైపు వెళ్లడం లేదు. కారణాలు అనేకం ఉన్నాయి. వాటిలో నమ్మకం సమస్యలు, డేటా భద్రత, చట్టపరమైన నియంత్రణలు, మానవ పర్యవేక్షణ అవసరం ముఖ్యమైనవి. అందువల్ల ఎఐ ఉద్యోగాలను వెంటనే పూర్తిగా భర్తీ చేస్తుందని చెప్పడం సరైన అంచనా కాదు. కాగా, ఈ పరిశోధన ప్రకారం కొన్ని రంగాలు ఎఐ ప్రభావానికి అత్యంత ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా కంప్యూటర్ ప్రోగ్రామర్లు, కస్టమర్ సర్వీస్ ప్రతినిధులు, ఆర్థిక విశ్లేషకులు వంటి ఉన్నత స్థాయి కేటగిరీలోకి వస్తాయి. వ్యాపారం, ఆర్థిక రంగం, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్, న్యాయశాఖ, కార్యాలయ నిర్వహణ వంటి రంగాల్లోని అనేక పనులను ఎఐ సిద్ధాంతపరంగా నిర్వహించగలదు. దీనికి విరుద్ధంగా కొన్ని రంగాలు ప్రస్తుతం ఎఐ ప్రభావం నుండి ఎక్కువగా రక్షితంగా ఉన్నాయి. నిర్మాణ రంగం, వ్యవసాయం, భద్రతా సేవలు, వ్యక్తిగత సంరక్షణ వంటి రంగాల్లో మానవ శారీరక శ్రమ, ప్రత్యక్ష పరస్పర చర్యలు, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యమైనవి. అందువల్ల ఈ రంగాల్లో ఎఐ ద్వారా తక్షణ ఆటోమేషన్ సాధ్యపడటం కష్టం. 2022 చివరలో, చాట్‌జిపిటి ప్రారంభమైన తర్వాత ఒక ముఖ్యమైన ధోరణి కనిపించింది. ముఖ్యంగా 22 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువ ఉద్యోగార్థులలో ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో ప్రవేశం సుమారు 14 శాతం తగ్గింది. అనేక కంపెనీలు తమ గ్రాడ్యుయేట్ ట్రైనింగ్ ప్రోగ్రాములు, జూనియర్ అనలిస్టు పోస్టులు, జూనియర్ డెవలపర్ నియామకాలను తగ్గిస్తున్నాయి. ఇది ఉద్యోగాల భారీ తొలగింపుల రూపంలో కాకుండా ముందు తలుపు మూసివేయడం అనే విధంగా జరుగుతోంది. అంటే కొత్త ఉద్యోగులను తీసుకునే అవకాశాలను తగ్గించడం ద్వారా సంస్థలు ఖర్చులను నియంత్రిస్తున్నాయి. తాజా పరిశోధనలో ఎఐ ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ఉద్యోగస్థుల గురించి కొన్ని ఆసక్తికరమైన గణాంకాలు బయటపడ్డాయి. ఈ ఉద్యోగాల్లో పనిచేసే వారిలో సుమారు 54.4 శాతం మహిళలు ఉన్నారు. ఇది ఎఐ ప్రభావం లింగ సమానత్వంపై కూడా ప్రభావం చూపే అవకాశాన్ని సూచిస్తుంది. విద్యా స్థాయిని పరిశీలించినప్పుడు గ్రాడ్యుయేట్ లేదా ఉన్నత విద్య కలిగిన వ్యక్తులు ఎఐ ప్రభావానికి నాలుగు రెట్లు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్నట్లు తేలింది. ఇది ఒక విరుద్ధ పరిస్థితిని చూపిస్తుంది. సాధారణంగా ఉన్నత విద్య ఉద్యోగ భద్రతను పెంచుతుందని భావిస్తారు. కానీ జ్ఞాన ఆధారిత ఉద్యోగాల్లో ఎఐ ప్రవేశం పెరుగుతున్నందున ఈ భావన కొంత మారుతోంది. జాతి, వయస్సు ఆధారంగా కూడా కొన్ని తేడాలు కనిపించాయి. ఎఐ ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ఉద్యోగాల్లో సగటు వయస్సు సుమారు 42.9 సంవత్సరాలు ఉంది. అంటే మధ్య వయస్సు ఉద్యోగులు కూడా ఈ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ మార్పులు భారతదేశంపైన కూడా గణనీయమైన ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా భారత ఐటి సేవల రంగం ఈ పరిణామాల వల్ల ఒత్తిడిని ఎదుర్కొంటోంది.



ఎఐ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం కూడా కొన్ని కార్యక్రమాలను ప్రారంభించింది. 'ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్' కార్యక్రమం ద్వారా డిజిటల్, ఎఐ నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి శిక్షణ అందిస్తున్నారు. అలాగే 'ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన' (పిఎంకెవివై) ద్వారా యువతకు ఆధునిక నైపుణ్యాలను నేర్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నీతి ఆయోగ్ రూపొందించిన ఎఐ వ్యూహం ద్వారా ఉద్యోగాల సృష్టి , సాంకేతిక అభివృద్ధి మధ్య సమతుల్యతను సాధించడానికి మార్గదర్శకాలు రూపొందాయి. నేషనల్ స్ట్రాటజీ ఫర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కూడా ఈ దిశగా పనిచేస్తోంది. ఇలావుంటే, ఎఐ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి విద్యా వ్యవస్థలో మార్పులు అవసరం. పాఠశాల స్థాయి నుంచే డేటా, అల్గోరిథమ్‌లు. ఎఐ నైతికత వంటి అంశాలను బోధించడం అవసరం. ఇది భవిష్యత్ తరాలకు ఎఐతో కలిసి పనిచేయగల సామర్థ్యాన్ని పెంచుతుంది. అదే సమయంలో ఉద్యోగుల్లో పునఃశిక్షణ కార్యక్రమాలు కూడా కీలకం. కంపెనీలు తమ ఉద్యోగులకు ఎఐ సంబంధిత నైపుణ్యాలను నేర్పించే విధంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. ఎఐ, మానవులు కలిసి పనిచేసే కోబోటిక్స్ విధానం కూడా ప్రోత్సహించాలి. ఏదిఏమైనా, ఉద్యోగాలను ఎఐ వెనువెంటనే పూర్తిగా భర్తీ చేయడం లేదుగానీ, ఉద్యోగాల స్వభావాన్ని వేగంగా మారుస్తుందనే విషయం 'ఆంథ్రోపిక్' సంస్థ నిర్వహించిన ఈ అధ్యయనం స్పష్టం చేస్తున్నది. ముఖ్యంగా జ్ఞాన ఆధారిత ఉద్యోగాలు, ప్రారంభ స్థాయి ఉద్యోగాలు ఈ మార్పుల ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నాయి. అందువల్ల విద్యా సంస్కరణలు, నైపుణ్య అభివృద్ధి మరియు ఎఐమానవ సహకార మోడళ్లను అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే భవిష్యత్ ఉద్యోగాలను స్థిరంగా ఉంచడం సాధ్యం.



# ఎస్ఎల్‌బిసితోనే 'మునుగోడు'కు పరిష్కారం

ఎస్ఎల్‌బిసి పూర్తి చేసి చర్లగూడెం ద్వారా లిఫ్ట్ ఏర్పాటు చేసి నారాయణపురం మండలానికి సాగునీరు అందించాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మునుగోడు నియోజకవర్గానికి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే ఎస్ఎల్‌బిసి లెఫ్ట్ బ్యాంక్ టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సిందేనని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో రాచకొండ రిజర్వాయర్ ఏర్పాటు చేసి మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలని జరిగిన మహాధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లికంటి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో మునుగోడు ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలపై ఆధారపడి పరిస్థితి నెలకొనడంతో పంటలు వరుసగా నష్టపోతున్నాయని, బోర్లు ఎండిపోవడంతో భూగర్భ జలాలు కూడా క్షీణిస్తున్నాయని తెలిపారు. డిండి, ఎత్తిపోతల, చర్లగూడెం పూర్తిచేసి నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీరు అందించి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బంగారు భూములు ఉన్నా, రాజధానికి అతి సమీపంలో ఉన్న కానీ నీరు లేక ఎడారిగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో వచ్చేందుకు ప్రగల్బాల పలికే నాయకులు ప్రాజెక్టుల విషయంలో వివక్షత చూపుతున్నారన్నారు. రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి సాధించేవరకు వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ధర్నాలో సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే ప్రాజెక్టులు సాధ్యమన్నారు. సేద్యం చేసుకుంటున్న భూములకు రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ సాధనకు ఉద్యమాలే శరణ్యమని అన్నారు. 2004 సురవరం సుధాకర్ రెడ్డి, పల్లా వెంకటరెడ్డి నాయకత్వన నల్లగొండ నుండి పెద్ద ఎత్తున పాదయాత్ర చేపట్టి సాగు జలాలపై ఉమ్మడి జిల్లాగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపటామని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న శాసనసభ్యులు, మంత్రులు ప్రాజెక్టుల విషయంలో వివక్షత వివక్ష చూపడం తగదన్నారు. మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న సాగునీటి విషయంలో ఎంత సమయం పట్టేది కాదని విమర్శించారు. ప్రాజెక్టుల సాధనకు కలిసి వచ్చే పార్టీలతో మరో పోరాటానికి సిద్ధమవుతామన్నారు. రిటైర్డ్ ఇంజనీర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మన ప్రాంతానికి సాగునీరు తీసుకువచ్చేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని కోరారు. గ్రౌండ్ వాటర్ కొరకు చిన్న మూసీ ద్వారా రూ.50 కోట్లతో చిన్న ప్రాజెక్టును తయారుచేసి ఇచ్చామని గుర్తుచేశారు. ముఖ్యంగా శివన్నగూడెం నుండి 100 మీటర్ల లిఫ్ట్ పెడితే వాల పెల్లి దగ్గర 460 టిఎంసి నీళ్లు వస్తాయని, ఆ తర్వాత ఆరుట్లకు కూడా వస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు డిపిఆర్ కింది నుంచి వస్తే పదివేల ఎకరాలకు మిగిలిపోతుందని, రాచకొండ ద్వారానే మూడు లిఫ్టులు అవసరం ఉంటుందని, కాకపోతే గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కురుమిద్దె శ్రీనివాస్, పల్లె శేఖర్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, సిపిఐ పట్టణ కార్యదర్శి ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డితో పాటు సిపిఐ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు పేదలకు పంచుతాం



సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి

ప్రజాపక్షం/జఫర్‌గడ్ : జిల్లాలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను వెలికితీసి అర్హులైన పేదలకు పంచుతామని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అలియాబాద్ రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలో ఉంటున్న పేదలతో పార్టీ మండల కార్యవర్గ సభ్యులు వడ్లకొండ సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాజారెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల అండదండలతో ఆక్రమించిన భూములను చేసుకొని అర్హులయిన పేదలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇల్లులేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇచ్చే వరకు సిపిఐ పక్షాన పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అలియాబాద్ రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలో ఉన్న పేదల పక్షాన సిపిఐ పోరాడుతుందన్నారు. వారికి ఇండ్ల పట్టాలు, ఇండ్లు నిర్మించి ఇచ్చే వారికి అండగా ఉంటామన్నారు. అర్హులయిన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని పోరాడుతున్న పార్టీ సిపిఐ అన్నారు. ఏప్రిల్ నెల 1 నుంచి జరుగు ఇంటింటికీ సిపిఐ ప్రచార కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో శ్రేయోభిలాషులు, వ్యాపారస్తులు, కార్మికులు, ఉద్యోగస్తులు, రైతులు అన్నివర్గాల ప్రజలు తమ మద్దతు ప్రకటించాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి ఆది సాయన్న, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శి జువారి రమేష్, నాయకులు ఎండి యాకూబ్ పాష, బికెఎంయూ నాయకులు మండల గట్టుమల్లు, మహిళా సమాఖ్య నాయకురాలు ఎండి.నూర్నిశ, వేల్పుల పెద్ద రాములు, రాడపాక సత్తయ్య, ఎండి.జాఫర్, మంద బుచ్చయ్య, వెంకన్న, కుక్కల శోభ, ఎండీ అలీఫా, కలకోట కనకయ్య, మందపురి రజిత, యాదగిరి, నిర్మల, సుధాకర్, ఐలయ్య పాల్గొన్నారు.

# ఆర్‌టిసిని కనుమరుగు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

కరీంనగర్ టూ డిపో ఎదుట అర్ధ నగ్నంగా కార్మికుల ధర్నా, నిరసన



ప్రజాపక్షం/కరీంనగర్ : తెలంగాణ ఆర్‌టిసి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం కనుమరుగు చేస్తుందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. తెలంగాణలో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక రవాణా సాధనం ఆర్‌టిసి సంస్థను సేవా రంగంగా చూడకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార సంస్థగా చూస్తూ ప్రైవేటు పెట్టుబడి వర్గాలకు కట్టబెట్టి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తుందని వారు ఆరోపించారు. ఎనిమిది దశాబ్దాలుగా అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని ఆర్‌టిసి అందిస్తుందని ఆర్‌టిసి జెఎసి నాయకులు అన్నారు. ఆర్‌టిసి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, అన్ని వర్గాల ప్రజలు ఆర్‌టిసి ప్రైవేటీకరణ అడ్డుకొని కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరుతూ సోమవారం కరీంనగర్ టూ డిపో ఎదుట రాష్ట్ర జెఎసి పిలుపులో భాగంగా ఆర్‌టిసి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు థామస్‌రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ ఆర్‌టిసిలో పనిచేస్తున్న సుమారు 39,000 మంది కార్మికులు మధ్యతరగతి మరియు బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారేనన్నారు. ఆర్‌టిసి సంస్థను ప్రయివేట్ పరం చేస్తే నిరుపేద మధ్యతరగతి ప్రజలతో పాటు విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, పత్రికా విలేకరులు ప్రజా రవాణాకు దూరం అవుతారన్నారు. ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో వీలినం చేయాలని, ట్రేడ్ యూనియన్‌లపై ఆంక్షలు ఎత్తివేయాలని రెండు సంవత్సరాల నుండి పోరాటం చేస్తుంటే కాంగ్రెస్ పాలనలో ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలు ఎక్కడ వేసిన గొంగళి చందంగా ఉన్నది తప్పా ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయలేదన్నారు. కార్మిక సంఘాలతో ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం పడనప్పటికీ, ఆర్‌టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. ఆర్‌టిసిలో యూనియన్లకు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన ఎన్నికలు నిర్వహించకపోవడం కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ వెల్ఫర్ కమిటీలను ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఆర్‌టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులతో ఆర్‌టిసి కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలైన జెబిఎం, ఒలెక్ట్రా యజమాన్యాలకు సంస్థను ధారాధత్తం చేయడానికి, ముక్కుమ్మడిగా ఎలక్ట్రిక్ బస్సులను వేలాదిగా ప్రవేశ పెడుతూ ఆర్‌టిసిని ప్రైవేటు చేయడానికి ప్రయత్నం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు బెజ్జంకి కాళిదాస్, కొమురయ్య యాదవ్, ఎంపిరెడ్డి, ఎవిరెడ్డి, శంకర్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు

ఏప్రిల్ 1 న బ్లాక్‌డే విజయవంతం చేయాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపు



ప్రజాపక్షం/నిజామాబాద్ : వ్యవసాయ కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపునిచ్చారు. కార్మికుల వ్యతిరేక నాలుగు కోడ్లను కేంద్ర ప్రభుత్వం బరి తెగించి అమలు చేయటానికి పూనుకుందని, కార్మికుల హక్కులను కాలరాసే కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 1న దేశవ్యాప్తంగా బ్లాక్‌డే నిర్వహిస్తున్నట్టు, కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక, కర్షక నేతలను కోరారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం వై.రాజిరెడ్డి అధ్యక్షతన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై పశ్య పద్మ మాట్లాడుతూ దేశంలో కార్మికుల, రైతులు, వ్యవసాయ కార్మికులు, కష్టజీవులకు వ్యతిరేకంగా విధానాలను అమలు చేస్తూ, కార్పోరేట్ అనుకూల, అమెరికా ఇజ్రాయెల్ సామ్రాజ్యవాద కాంక్షలకు గులాంగిరి చేస్తూ పాలన కొనసాగిస్తున్న ప్రధాని మోడీకి వ్యతిరేకంగా ప్రజలు సమీకృతులై పోరాడాలన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆపాలని ఆదేశాలు పంపుతూ మరోవైపు మహాత్మా గాంధీ పేరు తీసివేసి విబిజీ రాంజీ పథకాన్ని తీసుకవచ్చి రాష్ట్రాలను ఒప్పించలేక అమలు చేయలేక పూర్తిగా వ్యవసాయ కార్మికులకు పని కల్పించకుండా వారి జీవితాలను మరింతగా దుర్భరం చేస్తున్నారన్నారు. వేలాది మంది వ్యవసాయ కార్మికులు రోడ్లపై కొచ్చి గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు. భారత అమెరికా వాణిజ్య ఒప్పందంతో అమెరికా నుంచి దిగుమతి అయ్యే మొక్కజొన్న సోయా పంటలకు జీరో పన్ను ఉంటుందని తెలిసి ప్రైవేట్ వ్యాపారస్తులు ఎవరు మొక్కజొన్నను కొనుగోలు చేయడానికి ముందుకు రావటం లేదని, క్వింటాలుకు రూ.24 వేల మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయటానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు కె.భూమయ్య, వై.ఓమయ్య, కె.రాజన్న, ఎ.విఠల్‌గౌడ్, ఎం.స్వరూపరాణి, బి.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# లంచాలు తీసుకొని విఎల్‌టిలు సృష్టిస్తారా!

**ఇచ్చిన విఎల్‌టి పర్మిషన్లు వెంటనే రద్దు చేయాలి: సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం**

**ప్రజాపక్షం/కోరుట్ల:** శతబ్దాల చరిత్రను, చారిత్రాత్మక కట్టడాలను కలిగిన కోరుట్ల గడి బురుజులు వాటి పరిసర స్థలాలను అమ్ముకోవాలని చూస్తున్న రియాల్టర్లు వారికి సహకరిస్తున్న రాజకీయ పార్టీలలోని కొందరు బడా నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయని కోరుట్ల అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. సోమవారం కోరుట్ల ముదిరాజ్ సంఘ భవనంలో జరిగిన అఖిలపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక సమావేశానికి ముందుగా గడి బురుజుల కాలం నుండి అక్కడే పూజలు అందుకుంటున్న మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన నాయకులు అనంతరం సమావేశం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు నాయకులు పట్టణ ప్రముఖులు మాట్లాడుతూ చాళక్యుల కాలం నాటి సంపదనే ఈ గడి బురుజులు అని, కోనేరు బురుజులు శిథిలావస్థకు చేరిన వాటిని మరియు స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కోరుట్ల ప్రజలపై వుందని ఆనాటి కాలంలో పర్యవేక్షకులుగా వున్న భూస్వాములు నేడు బురుజులకు సంబంధించిన గ్రామ కంఠ, ఆబాది స్థలాలకు పట్టాదారులమని అమ్మకాలు చేస్తున్న వారి మా టలు ప్రజలు, పాలకులు నమ్మవద్దని అన్నారు. ఇంత కాలంగా గడి బురుజుల స్థలాలపై పర్మిషన్లు లేకుం డా నిషేధం విధించిన పురావస్తు శాఖ,కోరుట్ల మున్సిపాలిటీ ఇప్పుడు కొందరు బడా నాయకుల అండతో రియాల్టర్లు ఈ తతంగం చేస్తున్నారని ఆరోపించారు. దసరా ఉత్సవాలకు కోరుట్ల ప్రజలు ఎంతో పవిత్రంగా గడి స్థలాలలో జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా ప్రత్యేకంగా మహీశసూర వధ, మొహర్రం పీరీల పండుగ ఇవే స్థలాలో జరుగుతాయని ఇకనైనా సంబంధిత అధికారులు, నాయకులు కండ్లు తెరవాలని ఈస్థలాలలో కూరగాయల మార్కెట్, ఆహ్లాదకరమైన పార్క్ ను ఏర్పాటు చేయాలని, ఈ స్థలాలలో




ఇచ్చిన విఎల్టీలను రద్దు చేయాలని సమావేశం తీర్మానించింది. అనంతరం కోరుట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద నాయకులు ధర్నాకు దిగారు. అధికారులు లంచాలు తీసుకొని కబ్జా దారులకు సహాయ పడడం ఎంత వరకు సమంజసమని అన్నారు.ప్రభుత్వ అధికారులు లక్షలాది రూపాయల లంచాలతో గడి స్థలాలలో విఎల్టీ వేసిన అధికారులను సస్పెండ్ చేయాలని, ఇచ్చిన విఎల్టీలను వేంటనే రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు చెన్న విశ్వనాథం,డా. పేట భాస్కర్, ఎం డి ముజాహిద్, తుమ్మలపల్లి శ్రీనివాస్, చింత భూమేశ్వర్ ప్రముఖ న్యాయవాది బోయిని సత్యం, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర శేఖర్, బిజేపి పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ కస్తూరి లక్ష్మీ నారాయణ, సిపిఐ నేత సుతారి రాములు, సిపిఎం పట్టణ అధ్యక్షుడు కుంచెం శంకర్, బిఆర్ఎస్ నాయకులు భూపేల్లి నాగేశ్వరరావు, కృష్ణంరాజు, ఎన్విచ్ఎఫ్ అధ్యక్షుడు షాహేద్ మహ్మద్ షేక్, టిడిపి నాయకులు పోతని సత్యం వివిధ సంఘాల నాయకులు ముజబీర్ రెహమాన్, ఉప్పుగండ్ల అశోక్, పిట్టల రాజం, బెక్కెం అశోక్, రాజు, మ్యాకల గణేష్,తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సాగు, సరఫరా, విక్రయానికి పాల్పడ్డ ఐదుగురి ఏడేళ్ల జైలు శిక్ష

**ఒక్కొక్కరికి రూ. 10 వేల జరిమానా**

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** గంజాయి సాగు, సరఫరా, విక్రయానికి పాల్పడిన ఐదుగురు వ్యక్తులకు ఏడు సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఒకటవ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి నారాయణ సోమవారం కీలక తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఆదిలాబాద్ జిల్లా ఊట్నూర్ మండలం షాయిపూర్ గ్రామానికి చెందిన సోయం రాజు అధిక డబ్బు సంపాధించాలనే అశతో గంజాయి సాగు చేసి విక్రయించడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన పాల రాజ్ కుమార్, బాల నరేష్, కొలుగూరి సాయి సృజన్, జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన బొమ్మిడి సాయి చంద్ అనే నలుగురు వ్యక్తులు చెడు వ్యసనాలకు భానిపై గంజాయి వినియోగానికి పాల్పడడం అలవాటుగా మార్చుకున్నారు. సోయం రాజు అనే వ్యక్తి తన పత్తి చేనులో గంజాయి మొక్కలు సాగు చేస్తూ అవసరమున్న వారికి ఫోన్ ద్వారా సంప్రదించి సరఫరా చేయడంతో జగిత్యాల, ధరూర్‌కు చెందిన రాజ్ కుమార్, నరేష్, సాయి సృజన్, సాయి చంద్ అనే ఐదుగురు స్నేహితులుగా మారారు. ఈ క్రమంలో నలుగురు యువకులు తరచుగా రాజు వద్ద గంజాయిని కొనుగోలు చేస్తూ చెడు అలవాట్లకు బానిసయ్యారు. ఇదే క్రమంలో 2012 సంవత్సరంలో జగిత్యాల పట్టణ సమీపంలోని నూకపెల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం సమీపంలో రాజు తన నలుగురు స్నేహితులకు గంజాయి విక్రయించే సమయంలో మల్యాల పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు పట్టుకున్న ఐదుగురు వ్యక్తులపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి 1.25 కిలోల గంజాయిని సీజ్ చేశారు. అప్పటి మల్యాల ఎస్సై చిరంజీవి, ప్రస్తుత సిఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటి అధికారులు హరీష్,. రాజు నాయక్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను సోమవారం కోర్టులో ప్రవేశ పెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సయ్య కేదు వాధించారు. నేరం రుజువు కావడంతో ఐదుగురు ముద్దాయిలకు న్యాయమూర్తి కఠిన కారాగారా జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించి మాట్లాడారు. గంజాయి పెంపకం, సరఫరా, అమ్మకానికి ఎవరూ పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు.

## అధిక సాంద్రాత పత్తి సాగుపై అవగాహన



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** అధిక సాంద్రత పత్తి సాగుపై మండల పరిధిలోని ఇటిక్యాల రైతువేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వసంతరావు అధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అధిక సాధ్రత పత్తి సాగుపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కీటక శాస్త్ర నిపుణులు డా. రవి అధిక సాంద్రత పద్దతీలో చీడపీడల యాజమాన్యంపై చేపట్టవలసిన చర్యలపై రైతులకు వివరించారు. సేంద్రీయ వ్యవసాయం, వ్యవసాయ రంగంలో ఫశువుల ప్రాముఖ్యతపై డా.దత్తాత్రేయ నల్కార్ అవగాహన కల్పించారు. అలాగే పంట మార్పిడిపై వచ్చే పంట దిగుబడులపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులతో పాటు ప్రయివేటు విత్తన సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## హెడ్ ఆఫీస్ ముట్టడిలో ఎఐటియుసి నాయకులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సేవ్ సింగరేణి పోరు జాత కార్యక్రమం లో భాగంగా సోమవారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు ముట్టడి లో గోదావరిఖని ఆర్జీవన్, ఆర్జి 2, ఆర్జి త్రీ లకు చెందిన ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి లో కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆద్వర్యంలో మార్చి 18 నుంచి 30 వరకు గోలేటి నుండి కొత్తగూడెం వరకు సేవ్ సింగరేణి పోరు జాత జరిగిందని, ముట్టడి కార్యక్రమం లో సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో ఉన్న కార్మికులు, ఉద్యోగులు, ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా సింగరేణి కి రావాల్సిన 50 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, కొత్త గనులు



ప్రారంభించాలని, మెడికల్ బోర్డు ను వెంటనే నిర్వహించాలని, మారుపేర్లు విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటు లకు ఉద్యోగాలు ఇవ్వాలని తదితర డిమాండ్ లను పరిష్కరించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్ లను పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపు నిస్తామని వారు హెచ్చరించారు. ఈ ముట్టడి కార్యక్రమం లో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, నాయకులు మిర్యాల రంగయ్య, కే.సారయ్య, మడ్డి ఎల్లాగౌడ్, వై.వి.రావు, వీరభద్రం, ముస్కె సమ్మయ్య, వంగ వెంకట్, బ్రాంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులపై కామాటి చీపురుతో దాడి

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం**

**సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు**



**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలో అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని ఎస్టి గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌లో కామాటిగా శ్రీనివాస్ అనే ఉద్యోగి పనిచేస్తున్నాడు. ఈ నెల 16న నిద్రపోతున్న విద్యార్థులను చీపురుతో చితక బాదాడు. గత నెల రోజులుగా శ్రీనివాస్ నిత్యం మధ్యం సేవిస్తూ రాత్రి వేళల్లో విధులకు హాజరవుతూ విద్యార్థులను వేదిస్తున్నట్లు వార్తలు బయటకు వచ్చాయి. ఈ క్రమంలోనే ఈ అమానుష ఘటనకు సంబంధించిన విడియోలు సోమవారం సోషల్ మిడియాలో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తీవ్రంగా పరిగణించి విషయం తెలుసుకున్న ఉన్నాతాధికారులు ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులను చీపురుతో దాడి చేసిన విషయంపై జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రాజ్ కుమార్ విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌కు అందజేశారు. తక్షణమే కలెక్టర్ కామాటి శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## రోగులకు సత్వరమే చికిత్స అందించేలా చర్యలు

**కలెక్టర్ శ్రీ కోయ హర్ష**



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రోగులకు ఆసుపత్రిలో సత్వర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్ష అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వైద్యశాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు ఓ.పి. రిజిస్ట్రేషన్ చేయడం వల్ల ఎక్కువ మంది రోగులకు సేవలు అందించ లేకపోతున్నామని, ప్రతి విభాగంలో రోజుకు నిర్దిష్ట సంఖ్యలో టోకెన్ లు జారీ చేసి ఓపి సేవలు నిర్వహించాలని,అనంతరం వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో ఆర్థో , డెంటల్, జనరల్ మెడిసిన్, గైనిక్, చిన్నపిల్లల స్పెషలిస్ట్, కంటి చికిత్స మొదలగు వివిధ విభాగాలలో ఎన్ని ఓపి టోకెన్లు ఉన్నాయో తెలియజేస్తూ డిస్ ప్లే బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.ల్యాబ్ టెస్ట్ పరీక్షల ఫలితాలు రోగులకు త్వరగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో ప్రతిరోజు ఎన్ని ఎక్స్ రే, స్కానిం గ్ పరీక్షలు, రక్త పరీక్షలు జరుగుతున్నాయో నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్స్ రే యంత్రం, అవసరమైన స్టాఫ్ నియామకం కోరుకో ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, డిసిహెచ్ఓ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతాం

**ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బీర్ల పద్మ, కొట్టె అంజలి ఎన్నిక**





**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన భారత జాతీయ మహిళా సమాఖ్య జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎన్.ఎఫ్.ఐ. డబ్ల్యూ సీనియర్ నాయకురాలు గూడెం లక్ష్మీ తెలిపారు. జిల్లా అధ్యక్షురాలుగా బీర్ల పద్మ, జిల్లా ఉపాధ్యక్షరాలుగా రాగుల రేణుక, కాట్నపెల్లి అఖిల, వాణి, ప్రధాన కార్యదర్శిగా కొట్టె అంజలి, జిల్లా సహాయ కార్యదర్శులుగా కందుకూరి సావిత్రి, కేతవ్వ, భారతి, కోశాధికారిగా ర్యాకం మల్లికలతో పాటు మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు గూడెం లక్ష్మీ తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలు బీర్ల పద్మ, ప్రధాన కార్యదర్శి కొట్టె అంజలి మాట్లాడుతూ.. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతామని, సంఘటిత, అసంఘటిత రంగాల్లో చాలీ, చాలని వేతనాలతో, అసమానలతో, వివక్షతతో పనిచేస్తున్న మహిళలకు అండగా ఉంటామని, మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని పాలక వర్గాలపై పోరాడుతామని, అత్యాచారాలకు, హత్యలకు, వరకట్న వేధింపులకు గురవుతున్న మహిళలకు అండగా ఉంటామని, భారత జాతీయ మహిళా సమాఖ్యను జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తామని పద్మ, అంజలి తెలిపారు.

## ఆల్ఫోర్స్ మహిళ డిగ్రీ కళాశాలలో అట్టహాసంగా ఫేర్వెల్ పార్టీ




**ప్రజాపక్షం/కరీంనగర్:** అల్ఫోర్స్ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 2023–26 బ్యాచ్ విద్యార్థినుల కోసం నిర్వహించిన ఫేర్వెల్ కార్యక్రమం యుగాంత ని స్థానిక రాజశ్రీ కన్వెన్షన్ లో చాలా అట్టహాసం గా నిర్వహించారు.ఈ వీడ్కోలు సంబరాలకు కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, యూనివర్సిటీ పీజీ కళాశాల,గోదావరిఖని ప్రిన్సిపాల్ డా.ఈ.మనోహర్ ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కెరీర్, నైపుణ్యాభివృద్ధి మరియు జీవిత లక్ష్యాలపై ప్రేరణాత్మక సందేశాన్నీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు ట్రైనింగ్ మరియు ప్లేస్‌మెంట్స్ ఎంతో ముఖ్యమని తెలిపారు. గ్రామీణ యువత కూడా సరైన మార్గదర్శకత్వం, కృషితో ఉన్నత స్థానాలను సాధించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్ రెడ్డి, ముఖ్య అతిథి డా॥ ఈ. మనోహర్ తో పాటు, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్స్, అధ్యాపక బృందం తో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

## ధాన్యం ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండ స్వీకరించాలి

**421 కేంద్రాలతో 5.50లక్షల మెట్రిక్ ధాన్యం కొనుగోలు చేయాలనే లక్ష్యం**

**ఏప్రిల్ 2న జరిగే గ్రామసభలకు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలి**

**కలెక్టర్ హైమావతి**

**ప్రజాపక్షం/ సిద్దిపేట:** 2025–26 రబీ కాలానికి సంబంధించిన వరిధాన్యాన్ని ఏలాంటి ఇబ్బందులు పెట్టకుండ స్వీకరించాలని జిల్లా కలెక్టర్ హైమావతి రైస్‌మిల్లర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రైస్‌మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లా 2025–26 రబీ కాలానికి సంబంధించిన జిల్లా వ్యాప్తంగా 421 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సుమారు 5లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వరిధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ఏ రోజుకారోజు వరిధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు రవాణా చేయటం జరుగుతుందన్నారు. 48 బాయిల్డ్ రైస్ మిల్లులు. 64 ఇతర రైస్‌మిల్లులు జిల్లా గలవి ఏలాంటి ఇబ్బందులకు గురిచేయకుండ ప్రతి రోజు మిల్లులకు వచ్చే వరిధాన్యాన్ని రైస్ మిల్లర్లు దించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ. రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.




**ఏప్రిల్ 2న జరిగే గ్రామసభలకు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలి- కలెక్టర్**

ప్రజాపాలన ప్రగతి పాలన 99 రోజుల కార్యచరణ ప్రణాళిక భాగంగా ఏప్రిల్ 2న జరిగే జిల్లా వ్యాప్తంగా గ్రామసభల నిర్వహణకు పూర్తి స్థాయి సమాచారంతో సిద్దంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమానికి ముందు జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న తేదిన గ్రామ సభ కార్యక్రమం నిర్వహించి అన్ని శాఖలకు సంబంధించిన పథకాల అమలు పూర్తి వివరాలను గ్రామ సభలో ప్రజలతో పంచుకోవటం జరుగతుతుందన్నారు. కాబట్టి అన్ని శాఖల పూర్తి వివరాలను గ్రామాల వారిగా సిద్ధం చేసి అయామండలాల ఎంపిడిఓలకు పంపించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగ రాజమ్మ. తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల మార్కెట్ కమీటీ వైస్ చైర్మన్ కుటుంబంలో విషాదం



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** ఉమ్మడి మద్దూరు మండలం సాలక్‌పూర్ గ్రామానికి చెందిన చేర్యాల్ మార్కెట్ కమీటీ వైస్ చెర్మన్ కామిడి జీవన్‌రెడ్డి జీవిత భాగస్వామి సతీమణి అరుణమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో మరణించారు. విషయం తెలుసుకున్న మద్దూరు, ధూల్మిట్ట, చేర్యాల, కొమురవెల్లి, జనగామ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులతో పాటుగా నియోజకవర్గం సీనియర్ మరియు రాష్ట్ర స్థాయి యువ నాయకులు నాగపురి కిరణ్ గౌడ్ ఆసుపత్రికి వెళ్లి అరుణమ్మ పార్థివ దేహానికి పూలమాలతో నివాళులు అరించి, జీవన్‌రెడ్డిని ఓదార్చి తన ప్రాగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన దంపతులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** పెద్దపల్లి జిల్లాకు చెందిన శ్రీమతి వరహగిరి శైలజ, భర్త వెంకటరావు దంపతులు సోమవారం కలెక్టరేట్ లో ప్రభుత్వంచే మంజూరైన డబుల్ బెడ్ రూమ్ గృహాన్ని స్వచ్ఛందంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కు తిరిగి అప్పగించారు. తమ పిల్లలు సాఫ్ట్వేర్ ఉద్యోగం లో స్థిర పడిన నేపథ్యంలో తమకు ఈ గృహం అవసరం లేదని భావించి, వేరే నిరుపేద కుటుంబానికి కేటాయించాలని సోమవారం రోజున పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గృహాన్ని తిరిగి అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అవసరం లేకపోయినా ప్రభుత్వ ఆస్తిని తిరిగి ఇచ్చిన శ్రీమతి శైలజ దంపతులు నిజాయితీకి నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తి సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని ఆయన అభినందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజంగా అవసరమైన వారికి అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## పైసలుంటేనే కార్యదర్శి(ర్శి)నం..ఫైలు కదలాలంటే పైకం ఇవ్వాలి!



**రాజాపూర్ కార్యదర్శి లీలలు**

**ఎసిఒకు మొరపెట్టుకున్న గ్రామ ప్రజలు**

**ప్రజాపక్షం/శంకరపట్నం:** గ్రామ పకనజలకు ఏవైన ఇబ్బందులు తలెత్తితే వాటిని పరిష్కరించేందుకు కార్యదర్శిని ప్రభుత్వం నియమిస్తుంది. అలాంటి విదులు నిర్వహిస్తున్న ఒక కార్యదర్శి దర్శనం కలగాలంటే పైసలు ఉండాల్సిందే ఏపని కావాలన్నా ముందుగా అతనికి పైసలతో దర్శనం ఇవ్వాల్సిందే. నిర్మొహమాటంగా డబ్బులు ఉంటేనే పని చేస్తానంటూ లేకపోతే పని జరగదు అంటూ హుకుం జారీ చేస్తాడు. ఇతని ప్రవర్తనకు విసిగిపోయిన గ్రామస్తులు సోమవారం గ్రామపంచాయతీలో ఎంపివో ప్రభకర్ ముందు తమ ఆవేదనను వెలగక్కారు. వివరాలలోకి వెళ్తే శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామ కార్యదర్శి మహిబూబ్ పాష తను ఏదైనా పని మొదలు పెట్టాలంటే నిర్మొహమాటంగా పైసలు ఇవ్వమని డిమాండ్ చేస్తుంటాడు. ఇంటి మార్పిడి,భూమి మార్పిడి, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్లు ఒకటేమిటి తన దగ్గరికి ఏపని కావాలని వెళ్ళిన ముందుగాపైసలు చెల్లించాల్సిందే.ఒక్కో పనికి ఒక్కో రెటుగా డిసైడ్ చేస్తాడు.ఇలా 5000 నుంచి మొదలుకొని 50వేల వరకు చ్చిన బాధితులు కూడా ఉన్నారు. అదేకాక గ్రామ పంచాతీలో పనిచేసే సిబ్బంది వాళ్ల కూతురుకు అల్లునికి కరీంనగర్ మున్సిపాలిటిలో ఉద్యోగం పెట్టిస్తానని 3000 కూడా దండుకున్నట్లు తెలుస్తుంది. ఇతని వ్యవహారం ఆనోట ఈ నోట మాట్లాడుకొని బయటకి పొక్కింది. ఎంపిఓ గ్రామ కార్యదర్శిపై వచ్చిన ఫిర్యాదుకు ఎంక్వయిరికీ వచ్చారు. అయితే ఎంక్వయిరిలో అతను చేసిన లీలలు ఒక్కొక్కటి గ్రామ ప్రజలు బయట పెట్టారు. దీంతో ఎంక్వయిరీకి వచ్చిన ఎంపీవో కూడా ఆశ్చర్యానికి గురాయ్యాడు.గ్రామ ప్రజల నుంచి సేకరించిన వివరాలన్నిటిని పై అధికారులకు సిఫార్సు చేస్తానంటూ ప్రజలకు హామి ఇచ్చారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి కార్యదర్శిని వెంటనే విధుల నుంచి తొలగించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## యువతకు చెల్లింపు ఇంటర్న్‌షిప్ అవకాశాలు సద్వినియోగించుకోవాలి

**జిల్లా పరిశ్రమల అధికారి ఎ. కీర్తి కాంత్**

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లా పరిశ్రమల కేంద్రం, పెద్దపల్లి పరిధిలోని అర్హత కలిగిన యువతకు ప్రైమ్ మినిస్టర్ ఇంటర్న్‌షిప్ స్కీమ్ (రౌండ్ 3) కింద దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయని జిల్లా పరిశ్రమల అధికారి ఎ.కీర్తి కాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకం మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆధ్వర్యంలో అమలు చేయబడుతూ, దేశంలోని ప్రముఖ కంపెనీలలో చెల్లింపుతో కూడిన ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించబడుతున్నాయని,దీని ద్వారా యువతకు పరిశ్రమల అనుభవం మరియు నైపుణ్యాభివృద్ధి పొందే అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ పథకం కింద ఎంపికైన అభ్యర్థులకు చేరిక సమయంలో ఒక మారు 6,000 గ్రాంట్, ప్రతి నెల 9,000 ఆర్థిక సహాయం అందించబడుతుందని తెలిపారు. ఇంటర్న్‌షిప్ కాలం 6 లేదా 9 నెలలు ఉండి, ప్రముఖ సంస్థల్లో ప్రత్యక్ష అనుభవం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.అభ్యర్థుల వయస్సు 18 నుండి 25 సంవత్సరాల మధ్య ఉండాలని, పూర్తికాల ఉద్యోగంలో ఉండకూడదని సూచించారు.202627 సంవత్సరానికి దరఖాస్తులు ప్రారంభమైనందున అర్హత కలిగిన యువత https://pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.మరింత సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్1800 116 090 ద్వారా సంప్రదించవచ్చని, జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పరచుకోవాలని జిల్లా పరిశ్రమల అధికారి ఎ. కీర్తి కాంత్ ఆ ప్రకటనలో కోరారు.

## ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యం: బండారి అనూష



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ అర్బన్ :** ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష తెలిపారు. ప్రజాపాలన 99 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా సోమవారం శాంతినగర్ పుత్లీబౌలి అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన స్పెషలిస్ట్ హెల్త్ క్యాంపును ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని, నిపుణులైన వైద్యులతో శిబిరాలు నిర్వహించి సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. పుత్లీబౌలి కేంద్రంలో పరిశుభ్రత, వైద్యుల పనితీరు బాగున్నాయని కొనియాడారు. ప్రజలు ప్రభుత్వ వైద్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ సాధన, కౌన్సిలర్ నజీర్, శ్రీకాంత్, వైద్యులు సందీప్ కుమార్, దీపక్, నర్సింగ్ ఆఫీసర్ చంద్రకళ, బండారి సతీష్, మనోజ్, తౌఫిక్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు.ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి,తక్షణమే స్పదించాలని అధికారులకు సూచించారు.మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా,ప్రజలు విద్య, వైద్యం,ఇందిరమ్మ ఇండ్లు,పించన్లు,భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్లకు సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకల్యాణి,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

## నేరం చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** నేరం చేసిన ఎంతటి వారైనా చట్టం నుండి తప్పించుకోలేరని, వారు జైలు శిక్ష అనుభవించవలసిందేనని కామారెడ్డి ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పునిచ్చింది. పోక్సో కేసు నిందితునికి 20 ఏండ్ల కఠిన శిక్షతో పాటు రూ. 15000 జరిమానా విధించారు. 2025 కేసులో సంవత్సరం లోపే నిందితునికి శిక్ష పడడం న్యాయ నిబద్ధతకు నిదర్శనం అన్నారు. నేరం చేసిన వారు శిక్షల నుండి తప్పించుకోలేరని, నిందితుడిని పట్టుకునేందుకు కృషిచేసిన ఎల్లారెడ్డి పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.


## ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లోఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాదుర పాండు, సబ్ కలెక్టర్ ఉమా హరితతో కలిసి కలెక్టర్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఆర్థిక ప్రాధాన్యత నిచ్చి సంబందిత శాఖల అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సింగూర్ నుంచి నీరు విడుదల చేయాలి

### మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/పాపన్నపేట :** సింగూర్ ప్రాజెక్ట్ నుండి ఘనపూర్ ఆయకట్టకు 0.3 టీఎంసీల నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఎం.పద్మా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పాపన్నపేట మండలం చిత్రియాల గ్రామ శివారులో పంటపొలాలను పార్టీ మండల నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతి సంవత్సరం రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేసి రెండు పంటలు పండించే అవకాశం కల్పించారని తెలిపారు. ఘనపూర్ ఆయకట్ట పరిధిలో ఎఫ్ఎం, ఎఫ్ఎన్ కాలువల ద్వారా మూడు మండలాలకు సాగునీరు అందుతూ రైతులు పుష్కలంగా పంటలు పండించుకునేవారని చెప్పారు. పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నదని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నీటి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు.పంటలు పొట్టదశలో ఉన్నందున వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. వీరి వెంట మండల పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ బాల గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు జగన్, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, మల్లేశం శ్రీనాథ్ రావు, నాయకులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# గ్రామ, వార్డు సభలకు పకడ్బందీ ఏర్పాట్లు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామపంచాయతీలో నిర్వహించనున్న గ్రామసభలు, మున్సిపాలిటీలలో నిర్వహించనున్న వార్డు సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి అనంతరం అధికారులకు పలు అంశాలపై కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ముందస్తుగానే గ్రామ,వార్డు సభల వేదికలను సందర్శించి క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని, పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లకు సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. గ్రామసభలు నిర్వహించే ప్రదేశాలలో తగిన నీడ, తాగు నీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 7.30 నుండి 10.30 గంటలలోపు సభలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సభలలో అవగాహన కల్పించటంతో పాటు ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారులతో వారి అనుభవాలను తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా గ్రామ,వార్డు సభల విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఇదిలా ఉండగా పదవ తరగతి పరీక్షా కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సబ్‌కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లకు కలెక్టర్ సూచించారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సాఫీగా జరిగేలా చొరవ చూపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, దిలీప్‌కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్‌మాల్వియ, డీఆర్‌డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జనగణన పకడ్బందీగా జరగాలి

### కలెక్టర్ రాజర్షి షా

**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ అర్బన్ :** దేశ భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు జనగణన అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జనగణన నుండి జన కల్యాణం అనే నినాదంతో ఈ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక టీటీడీసీలో శనివారం ప్రారంభమై సోమవారంతో ముగిసిన సెన్సస్ 2027 ఫీల్డ్ ట్రైనర్ల మూడు రోజుల శిక్షణ ముగింపు సమావేశంలో కలెక్టర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ గణనలో ప్రతి వ్యక్తి వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇళ్ల జాబితా తయారీ, గృహ గణన సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో గణన నిర్వహించే సిబ్బందికి ఫీల్డ్ ట్రైనర్లు సమగ్ర అవగాహన కల్పించాలని కోరారు. డిజిటల్ విధానంలో నిర్వహించనున్న ఈ ప్రక్రియలో సాంకేతిక అంశాలపై పూర్తి పట్టు సాధించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ట్రైనింగ్ కలెక్టర్ సలోని చాబ్రా, పర్యవేక్షకులు నలంద ప్రియ, మాస్టర్ ట్రైనర్లు కే శ్రీహరి బాబు, యువరాజ్, అధికరులు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించకుంటే ఏప్రిల్ 1 నుంచి సమ్మె

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్




**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 4 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కలెక్టర్ కె. హరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు చెల్లించని పక్షంలో ఏప్రిల్ 1 నుంచి 600 మంది కార్మికులతో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఎల్ అండ్ టి యాజమాన్యం వేతనాల చెల్లింపులో కాలయాపన చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రూ. 26 వేల కనీస వేతనం, బోనస్, పెట్రోల్ అలవెన్స్ అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ద్వారా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాపిడి బాలేష్, నాయకులు జంషద్, షకీర్, రఫీక్, శివ, శ్రీకాంత్, మారుతి, పురుషోత్తం, వెంకటేష్, గౌతమ్ పాల్గొన్నారు.

# మెదక్ మున్సిపల్ వార్షిక బడ్జెట్ రూ.104.94 కోట్లు

### బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ మున్సిపల్ బడ్జెట్, సాధారణ సర్వసభ్య సమావేశంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.104 కోట్ల 94 లక్షల 74 వేల రూపాయల బడ్జెట్ ను సోమవారం మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజ్ అధ్యక్షతన, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, స్థానిక కౌన్సిల్ సభ్యుల సమక్షంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లలందరూ ఏకగ్రీవంగా బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. మున్సిపల్‌కు ఆర్థిక సంవత్సరానికి 104.94 కోట్ల వార్షిక బడ్జెట్ రూపొందించారు. అదే విధంగా ఖర్చులు సైతం అదే తరహాలో రూ.104 కోట్ల 93 లక్షల 73 వేలుగా నిర్ణయించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే సుమారు ఈ ఏడాది 88.24 కోట్ల రూపాయలు అధికంగా నిధులు సమకూరతాయన్న అంచనాలతో రూపొందించారు. వివిధ గ్రాంటుల ద్వారా గత ఆర్థిక సంవత్సరం కంటే యుఐడిఎఫ్ కింద రూ.18.70 కోట్లు, టీయూఎఫ్ఐడీసీ రూ.37.50 కోట్లు, ఎల్డీఎఫ్ కింద రూ. 29.10 కోట్లు, ఎస్ఎఫ్‌సి కింద రూ.2.16 కోట్లు, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.కోటి, ఎమ్మెల్సీ ఎమ్మెల్యేల గ్రాంట్ల ద్వారా రూ.84 లక్షలు, ఎస్ఆర్ఎఫ్ ద్వారా రూ.20 లక్షలు ఈసారి సమకూరే అవకాశముందని బడ్జెట్లో పొందుపర్చారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్ మాట్లాడుతూ మెదక్ పట్టణ అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ రూపొందించడం జరిగిందన్నారు. అన్ని వార్డులలో ఉన్న సమస్యలు పరిష్కరించి ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా పట్టణంలో ప్లాస్టిక్ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి అధికారితో పని చేయించి ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తామని వివరించారు. వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ మాట్లాడుతూ అధికారులు ఏ పని చేసినా ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. పారిశుద్ధ్య పనులకు సంబంధించి ట్రాక్టర్లకు, ఆటోలకు ఇతర వాహనాలకు జిపిఎస్ ట్రాకర్లు అమర్చాలని సూచించారు. కౌన్సిలర్లు మామిళ్ల ఆంజనేయులు, బట్టి ఉదయ్, జుబేర్ అహ్మద్ లు మాట్లాడుతూ టియూఎఫ్ఐడిసి నిధులు టెండర్లు వేయక వృథాగా పోతున్నాయని దీంతో పట్టణ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. తై బజార్ వేలం పాట ఎందుకు జాప్యం జరుగుతోందన్నారు. ఆస్తి పన్నుల వసూలలో నిబంధనల ప్రకారం అధికారులు వసూలు చేయాలన్నారు. అనంతరం కౌన్సిలర్లు లలిత, శృతి, లక్ష్మీ స్వరాగిని, రాజమణి, సంధ్యారాణి, పల్లె రాణి, స్వరూప, రాజవ్వ, అనిస్ ఫాతిమా మాట్లాడుతూ వార్డుల్లో తాగునీటి సమస్యలు ఉన్నాయని, డ్రైనేజీలు, రోడ్లు బాగుచేయలని, రోడ్ల వెంబడి విధి దీపాలు వెలగడం లేదని సభ దృష్టికి తెచ్చారు. 29 కోట్ల రూపాయలతో వేసిన రోడ్డు మున్నాలకే కంకరతేలిందని కౌన్సిలర్ గంట సంపత్ తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు లక్ష్మి, హరిత, శంసున్నిసా బెగం, శివరామకృష్ణ, మన్సూర్ అహ్మద్, అఖిల, గౌస్ ఖురేషి, రాజమణి, సోహెల్, మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

### కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నస్పూర్/ మంచిర్యాల :** ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను ఆయన ఆకస్మికంగా సందర్శించి పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నూతన భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే వైద్య పరికరాలు సమకూర్చి ఆసుపత్రిని అక్కడికి తరలిస్తామన్నారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఆయన, వర్షాకాలంలో గర్భిణులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నస్పూర్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాత మంచిర్యాలలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరం, హెచ్‌పివి వ్యాక్సినేషన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు సర్వైకల్ కేన్సర్ రాకుండా ముందస్తుగా ఈ వ్యాక్సిన్ ఇప్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత, ఆసుపత్రి పర్యవేక్షకులు వేదవ్యాస్, ఆర్ఎంఒ డాక్టర్ శ్రీధర్, కార్పొరేటర్ తూముల నరేష్, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రమాదాలు విధి కాదు..మన నిర్లక్ష్య ఫలితమే

### ఎస్‌పి డివి శ్రీనివాస్ రావు




**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల్ రంగాయిపల్లి గ్రామంలోని ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో అరైవ్ అలైవ్ అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్‌పి డివి శ్రీనివాస్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్,అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు.హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని స్పష్టం చేశారు. ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని, ఒక్కరి నిర్లక్ష్యం వల్ల కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. ప్రమాదం ముందస్తుగా చెప్పి రాదు అనే విషయాన్ని గుర్తుంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్‌పి నరేందర్ గౌడ్, సిఐలు సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, రంగకృష్ణ, ఎస్ఐలు సుభాష్ గౌడ్, గంగరాజు రాజు, ఎంఎస్ అగర్వాల్ అధికారులు, కార్మికులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు అధికారులు సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు నుండి మొత్తం 81 దరఖాస్తులు స్వీకరించి సంబందిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసినట్లు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పరిష్కార స్వభావం దరఖాస్తు దారునికి తెలియచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాధాన్యతతో స్పందించాలని ఆమే సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి పర్యవేక్షణ లోపం ఉన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వేసవికాలంలో పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా పరిశ్రమల మేనేజర్ ప్రకాష్ రావు, అధికారులకు సూచించారు. పరిశ్రమలకు వివిధ శాఖల అనుమతులను నిర్ణిత గడువు లోగా మంజూరు చేయాలని ఆదేశించారు. వేసవికాలంలో పరిశ్రమలు ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకోవలని కర్మాగార శాఖ అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యాక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్‌డిఓ శ్రీనివాసరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా ప్రగతికి 'ఫౌండేషనల్ లెర్నింగ్' దిక్సూచి: డిఇఓ యాదయ్య



**ప్రజాపక్షం / మంచిర్యాల :** విద్యార్థుల భాషా, గణిత సామర్థ్యాలను అంచనా వేసేందుకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ ఒక దిక్సూచిలా పనిచేస్తుందని మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య పేర్కొన్నారు. 2022 నుంచి అమలవుతున్న ఈ కార్యక్రమ పనితీరును మదింపు చేసే ఉద్దేశంతో ఈ నెల 30, 31 తేదీల్లో మూడో తరగతి విద్యార్థులకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని నాలుగు పాఠశాలలను ఈ స్టడీ కోసం ఎంపిక చేసినట్లు వెల్లడించారు. మంచిర్యాల స్ప్రింగ్ ఫీల్డ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, హాజీపూర్ మండలం నాగారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కోటపల్లి మండలం దేవులవాడలోని పాఠశాల, వేమనపల్లి మండలం ముల్కలపేట్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎస్ఆర్‌కెఎం డిఇడి కళాశాలకు చెందిన నలుగురు ఛాత్రోపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఈ సర్వేకు పంపినట్లు వివరించారు. విద్యార్థుల సామర్థ్యాలతో పాటు పాఠశాలల్లోని వసతులు, ఉపాధ్యాయుల లభ్యత, అర్హతలు, బోధన అభ్యసన ప్రక్రియలు, వినూత్న కార్యక్రమాల వివరాలను కూడా సేకరిస్తున్నామని తెలియజేశారు. ఈ స్టడీ ద్వారా రాష్ట్ర విద్యా వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వానికి ఒక స్పష్టమైన అంచనా వస్తుందని, భవిష్యత్తులో చేపట్టే విద్యా ప్రణాళికలకు ఈ సమాచారం ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థిని ఛాత్రోపాధ్యాయుడు విష్ణు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** సోమవారం గీతం ( డిమ్డ్ టు బి యూనివర్సిటీ ) సంగారెడ్డి క్యాపంస్‌లోని కిన్నెర హాల్‌లో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో స్టూడెంట్ ప్రోగ్రాం ఫర్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సబుల్ సేస్ కార్యక్రమం నిర్వహించి సైబర్ అవగాహన ,సెనిటైజేషన్ వర్క్ షాప్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో శిఖాగోయల్ ఆదేశానుసారంగా ప్రారభించబడినదిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పెరుగుతున్న సైబర్ ముప్పులు ,ఆన్‌లైన్ భద్రత ,బాధ్యాతయుత డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌పి హరికృష్ణ ,డిఎస్పీ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సైబర్ కార్యకలాపాలను వెంటనే నిషేధించడం ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. వేణుగోపాల్‌రెడ్డి డిఎస్‌పి సైబర్ సెక్యూరిటీ బ్యూరో సంగారెడ్డి సైబర్ నేరాల తాజా దోరణులు ముఖ్యంగా యుపిఐ మోసాలు, ఒటిపి ప్రాడ్స్ ,సోషల్ మీడియా హ్యాకింగ్ పై అవగాహన కల్పించారు. శాలిని రాథోడ్ హెడ్ పీపుల్ కల్చర్ ఇండియా ఫ్యూచర్ ఫౌండేషన్ యువతలో డిజిటల్ బాధ్యత సైబర్ , ఆన్‌లైన్ నడవడికపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమానికి 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు , చివరగా సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తు చేశారు.

## సేవామార్గంలో ముందుకు సాగుతా

### డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లిఖార్జున్

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** తన తండ్రి ఏలే సంఘమేశ్వర్ చూపిన సేవా మార్గంలో ముందుకు సాగుతానని కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లిఖార్జున్ అన్నారు. సోమవారం నిజాంసాగర్ మండలంలోని బంజపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మాజీ ఎంపీటీసీ అయిన ఏలే సంఘమేశ్వర్ వర్ధంతిని పురస్కరించుకుని ఏలే మల్లిఖార్జున్ తండ్రి సమాధి వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీకి సంఘమేశ్వర్ చేసిన సేవలు ఎనలేనివని, ఎంపీటీసీగా, సర్పంచ్‌గా ఆయన ప్రజల సంక్షేమానికి ఎంతో కృషిచేశారని, పేదలకు అండగా ఉంటూ వారికి ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించేవారన్నారు. పేద ప్రజలకు సేవ చేయడమే తన తండ్రి సంఘమేశ్వర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు.

"డ్రగ్స్ కేసులో తీవ్రంగా మానసికంగా క్రుంగిపోయాను
తెలుగు సినిమా ఇండస్ట్రీలో నటి హేమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా ఎన్నో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, తన సహజమైన నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు."

# రీల్

## వెంకట్ హీరోగా 'హరుడు'


శ్రీ సీతా రాముల కల్యాణం చూదాము రారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివ రామరాజు లాంటి సినిమాలతో అలరించిన హీరో వెంకట్ సినిమాల్లోకి కమ్ బ్యాక్ ఇస్తున్నారు. విఆర్ ఎంటర్‌టైన్‌మెట్స్ బ్యానర్‌లో వెంకట్ హీరో రూపొందుతున్న మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్ 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. సహ నిర్మాతలుగా డాక్టర్ దిక్కల లక్ష్మ ణారావు, డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. సమ్మర్ స్పెషల్‌గా మే 8న ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో హెబ్బపటేల్, సలోని, నాటషా ,అలీ, సుమన్, రవి వర్మ, సుభాశ్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మని జీన్న సంగీతం అందిస్తుండగా ఆనంద్ డిఒపిగా పని చేస్తున్నారు. ఉప్పు మారుతీ ఎడిటర్.



## రెండు సంవత్సరాల కష్టం ఇది
## బైకర్ హీరో శర్వానంద్

శర్వానంద్ హీరోగా నటించిన తాజా చిత్రం బైకర్ కోసం అద్భుతంగా ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. వ్యక్తిగతంగా, క్రియేటివ్‌గా తనను మళ్లీ ఛాలెంజ్ చేసే పాత్ర బైకర్ రూపంలో వచ్చింది. ఇందులో అతను 18 ఏళ్ల రేసర్‌గా కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం అతను తన శరీరాన్ని, మనసును పూర్తిగా మార్చుకున్నారు. ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించగా, యువి క్రియేషన్స్ నిర్మిస్తోంది. సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుంది.

ఒకసారి కమిట్ అయిన తర్వాత శర్వానంద్ పూర్తిగా తనను డెడికేట్ చేశారు. ఉదయం సూర్యోదయం కంటే ముందే మొదలయ్యే రోజు, అలసటతో ముగిసేది. లాంగ్ డిస్టెన్స్ పరుగులు, కఠినమైన స్ట్రెంత్ ట్రైనింగ్, మొబిలిటీ సెషన్స్‌తో అతను తన పరిమితులను దాటాడు. ఇది కేవలం శారీరకంగా మాత్రమే



కాదు, మానసికంగా కూడా ఛాలెంజ్ గా మారింది. ఈ ప్రయాణంలో యోగా అతనికి కీలకంగా నిలిచింది. జిమ్ అతనికి బలం, సహనం ఇచ్చినప్పుడు, యోగా అతని ఆలోచనలను ప్రశాంతం చేసి, ఫోకస్‌ను పెంచింది. ఈ ఫెరోసిటీ, ప్రశాంతత కలయికే అతని మార్పుకు బలం అయింది. దీంతో అతను బరువు తగ్గి, మరింత షార్ప్ లుక్‌తో పాటు కొత్త కాన్ఫిడెన్స్‌ను పొందారు. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ షూటింగ్ మొదటి రోజు అద్దంలో చూసుకున్నప్పుడు, నేను సిద్ధంగా ఉన్న, క్రమశిక్షణతో ఉన్న, అప్‌డేటెడ్ వ్యక్తిని చూశాను. ఏప్రిల్ 3న మీరు స్క్రీన్‌పై విక్కీని చూస్తే, అది కేవలం నటన కాదు – రెండు సంవత్సరాల కష్టం, మారాలనే పట్టుదల ఫలితాన్ని చూస్తారు.

## పోస్ట్ ప్రొడక్షన్‌లో 'మా ఇంటి బంగారం'

ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దిగంత్, గుల్షన్ దేవయ్య ఇతర ప్రాతల్లో నటిస్తున్నారు. శ్రీముఖి, గౌతమి, ఆనంద్, లక్ష్మి , శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుషా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ బేబి వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత మరోసారి సమంత, నందిని రెడ్డి కాంబోలో రానున్న ఈ సినిమాను రాజ్ నిడిమోరు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం పోస్పట్‌లో పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని మే15న రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. యాక్షన్ డ్రామా మూవీ అందరికీ నచ్చేలా, అన్ని అంశాలతో రూపొందుతోంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను బలమైన భావోద్వేగాలతో పాటు ఉత్కంఠతను యాక్షన్ ఎలిమెంట్స్‌ను బ్యాలెన్స్ చేస్తూ డైరెక్టర్ నందిని రెడ్డి డైరెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాష్, స్టోరీ, స్క్రీన్‌ప్లే: రాజ్ నిడిమోరు, వసంత్, మారింగంటి, సీతా మీనన్, యాక్షన్: లీ విట్టాకెర్, ఎడిటింగ్: ధర్మేంద్ర కాకరాల.



## సల్మాన్ ఖాన్‌తో దిల్ రాజు సినిమా

తెలుగు తెరపై నెంబర్ చిత్ర నిర్మాణ సంస్థ గా పేరు గాంచిన శ్రీవేంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్ అధినేత దిల్ రాజు తాజాగా బాలీవుడ్ లో ఎంట్రి ఇస్తున్నారు. ఏకంగా సల్మాన్ ఖాన్ తో సినిమా చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాకు వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల సల్మాన్ ఖాన్ కు వంశీ చెప్పిన కథ చాలా బాగా నచ్చడంతో షూటింగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పక్కా మాస్ కమర్షియల్ సినిమాగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్‌లోనే ప్రారంభం కానుందని నిర్మాత దిల్ రాజు తెలిపారు. మిగతా నటీ నటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని దిల్ రాజు అన్నారు. ఎస్ వి సి బ్యానర్ పై ఇది 63వ చిత్రంగా నిర్మిస్తున్నామని దిల్ రాజు పేర్కొన్నారు.



## ఆ క్షణం చనిపోవాలనుకున్నా: నటి హేమ

### డ్రగ్స్ కేసులో తీవ్రంగా మానసికంగా క్రుంగిపోయాను

తెలుగు సినిమా ఇండస్ట్రీలో నటి హేమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా ఎన్నో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, తన సహజమైన నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు. అదే సమయంలో నేరుగా, బహిరంగంగా తన అభిప్రాయాలను చెప్పే స్వభావం వల్ల కూడా తరచూ వార్తల్లో నిలుస్తూ ఉం టారు. టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా దశాబ్దాల పాటు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న న టి హేమ ఫిలిం ఛాంబర్ లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆమె ఇటీవల తనపైన మోదైన డ్రగ్స్ కేసు, దాని వల్ల తన కుటుంబం ఎదుర్కొన్న సమస్య గురించి మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పా రు. డ్రగ్స్ కేసులో తనపై వచ్చిన ఆరోపణలు తనను తీవ్రంగా మానసికంగా కలచివేశాయని చెప్పారు. ఆ సమయంలో నేను చచ్చిపోవాలనిపించింది. అంతగా మానసికంగా కుం గిపోయాను అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తాను ఎలాంటి తప్పు చేయలేదని, అందుకే చివరకు నిర్దోషిగా బయటకు వచ్చానని స్పష్టం చేశారు. డ్రగ్స్ వ్యవహారంలో కొందరు మీడియా సంస్థలు తనపై నిరాధార ఆరోపణలు చేస్తూ బురదజల్లాయని ఆమె ఆరోపించారు. ఆ వార్తల కారణంగా తన వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబ సభ్యులు కూడా తీ వ్రంగా బాధపడ్డారని చెప్పారు. నా కుటుంబం చాలా సఫర్ అయింది. మాకు ఇది చాలా కఠినమైన కాలం అని ఆమె పేర్కొన్నారు. అయితే మొత్తం మీడియాను ఒకే తాటిపై వేయలేమని, నిజాయితీగా వ్యవహరించే మీడియా సంస్థలు తనకు మద్దతుగా నిలుస్తాయని తాను నమ్ముతున్నానని హేమ తెలిపారు. భవిష్యత్తులో కూడా మీడియా తనకు న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.





## ప్రకాష్ రాజ్‌కు మాతృ వియోగం

ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ మాతృమూర్తి సువర్ణలత కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం ఉదయం కన్నుమూశారు. ఈ విషయం తెలిసి చింతిస్తున్నామని నటుడు ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. శ్రీమతి సువర్ణలత ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను. మాతృ వియోగానికి లోనైన ప్రకాష్ రాజ్ , ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

## సంగీత రంగంలో కొత్త ప్రభంజనం 'కార్మేని సెల్వం'

పాత్వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా సంగీతం దర్శకుడు రామానుజన్ ఎం.కె చిత్ర విశేషాల గురించి ఇలా వివరించారు.

ఒక చిత్రానికి సంగీతాన్ని అందించిన ఘనత ఏ ఒక్క వ్యక్తికీ కాకుండా, ఒక సంస్థకు దక్కాలని కోరుకున్నాం. అందుకే 2017లో బెంగళూరులో ప్రారంభించాను. మొదట్లో కార్పొరేట్ ప్రాజెక్టులను స్వీకరిస్తూ, నెమ్మదిగా నా పనితీరును మెరుగుపరుచుకోవడం మొదలుపెట్టాను. ఆ తర్వాత మీడియా సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకోవడం ప్రారంభించాను.



మేము సౌండ్ డిజైన్, వాయిస్‌ఓవర్లు మరియు డబ్బింగ్ వంటి అన్ని సేవలను అందించాము. ప్రస్తుతం 'కార్మేని సెల్వం' ప్రాజెక్ట్‌ను విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఈ సినిమాకు సంగీతం దర్శకుడి పేరు కాకుండా.. (మ్యూజిక్ యాజ్ ఏ సర్వీస్) మ్యూజిక్ క్లౌడ స్టూడియో అండ్ టెక్నాలజీ పేరును ప్రకటించాం. చివరగా, కార్మేని సెల్వం ఒక హృదయానికి హత్తుకునే సినిమా. మన జీవితంలో ఎదురయ్యే భావోద్వేగాలను ప్రతిబింబిస్తుంది. నా పేరు కంటే నా సంగీతమే ప్రేక్షకుల హృదయాల్లో నిలవాలని కోరుకుంటున్నాను'.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
# సింగరేణి సిరిని దోచుకుంటున్నాయ్

- కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి
- సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా.కె.నారాయణ
- సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి: తీవ్ర ఉద్రిక్తం
- సింగరేణి నేతలు, కార్మికులు - పోలీసుల మధ్య తోపులాట
- సిపిఐ నేతలు నారాయణ, సాబీర్ పాషా, యూనియన్ నాయకులు అరెస్ట్

ప్రజాపక్షం/ కొత్తగూడెం : సింగరేణి పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వర్కర్స్ యూనియన్ చేపట్టిన సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి తీవ్ర ఉద్రిక్తతగా మారింది. కోల్ బెల్టు ప్రాంతాల నుండి తరలి వచ్చిన వేలాది మంది కార్మికులు, యూనియన్ కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కార్యాలయం చేరుకుని ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. పొర్లు దండాలతో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. మూడు గంటల పాటు ధర్నా చేపట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు నేతలు, కార్మికులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. దీంతో ప్రధాన కార్యాలయం ఎదుట తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. సిపిఐ జాతీయ నాయకుడు డా.కె.నారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో పాటు యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ తదితరులను పోలీసులు నిర్బంధించి 1టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులకు ముందు కార్మికులను ఉద్దేశించి సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా.కె.నారాయణ మాట్లాడుతూ సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రూ.50 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని, ఆ నిధులను ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త గనులు ప్రారంభంపై యాజమాన్యం చూపుతున్న నిర్లక్ష్యం సంస్థ మనుగడగే ముప్పని, ఎసిబి విచారణ సాకుతో మెడికల్ బోర్డును నిలిపి వేయడం కార్మికుల ప్రాణాలతో చెలగాటమేమిటని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సిరిని దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. కార్మికుల కష్టంతో మనుగడ సాగిస్తున్న సింగరేణి సంస్థ కార్మికులను నట్టేట ముంచేందుకు ప్రయత్నిస్తోందని, ఇందులో మితిమీరిన రాజకీయ జోక్యమే కారణం అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుంటే రాబోయే రోజుల్లో మరిన్నిగట్టి పోరాటాలు చేస్తామని, అవసరమైతే సింగరేణి కార్యాలయాలను స్వాధీనం చేసుకుని తమ సత్తా చాటుతామని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, సొంతింటి పథకం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్లర్క్ పోస్టులకు కోర్టు కేసులతో సంబంధం లేకుండా పరీక్షలు జరపాలని, 350 మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్ట పరిహారం ప్రకటించాలన్నారు. సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో మెడికల్ బోర్డు వల్ల సింగరేణికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతోందని ప్రకటించడం దుర్మార్గం అన్నారు. కొత్త గనులు ఏర్పాటు చేసే క్రమంలో ప్రైవేటు పెత్తనానికి స్వస్థి చెప్పి సింగరేణి కార్మికులతోనే బొగ్గు ఉత్పత్తి చేయాలని, పాత పద్ధతిలోనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీలో ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు కార్మికుల గొంతుకగా నిలుస్తున్నారని కొనియాడారు. సింగరేణి యాజమాన్య తప్పుడు విధానాలతో కార్మికుల బ్రతుకులు తీవ్ర ఇబ్బందుల్లోకి వెళుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సేవ్ సింగరేణి నినాదంతో చేపట్టిన ఈ ముట్టడికి అనూహ్య స్పందన వచ్చిందని, కార్మికుల సమస్యల పరిష్కారానికి పాలకులు చొరవ చూపకుంటే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంగరేణి కార్మికులతో చెలగాటం ఆడిన ప్రభుత్వాలేవి మనుగడ సాగించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, నాయకులు మిర్యాల రంగయ్య, కే సారయ్య, వీరభద్రం, వైవి రావు, ముస్కే సమ్మయ్య, వంగ వెంకట్. జీ వీరస్వామి, ఎస్ వి రమణమూర్తి, వి మల్లిఖార్జున రావు, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, కంచర్ల జమలయ్య తదితరులు పాల్గొన్నారు.





## జాతీయ హోదా ఇవ్వలే
(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సిఎం మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంతో పాటు రెండు లక్షల ఎకరాల గిరిజన, ఆదివాస భూములను కేంద్రం అప్పనంగా అప్పగించిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని, రాజకీయాలు ముఖ్యం కాదని, అందుకే సిఎం, మంత్రులు కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధానిని కలుస్తున్నామని వివరించారు. 'పిఎం కుసుమ్' స్కీమ్ అమలు చేసేందుకు తాము ఇది వరకే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసి, దీనిని ఒక కేంద్ర ప్రయోజిత కార్యక్రమంగా అమలు చేస్తోందని విమర్శించారు. విజిరాంజీ స్కీమ్ ద్వారా ఖమ్మంలోని లేదా ఇతర గ్రామాల్లో ఏమి పనులు చేయాలో ఢిల్లీలో కూర్చొని నిర్ణయిస్తామంటే ఎలా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సభను, పంచాయతీలను కేంద్రం నిర్వీర్యం చేసిందని, వాటిని నియంత్రణలో పెట్టుకుని, తాము చెప్పిన పనే చేయాలనడం దుర్మార్గమన్నారు. అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రభుత్వ ఆలోచిస్తుందని, గిగ్ వర్కర్ల చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. అన్ని కుటుంబాలకు, అన్ని వర్గాలకూ ఉపయోగపడే విధంగా రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని, ఇది పీపుల్స్ బడ్జెట్ అని, అందుకే రాష్ట్ర బడ్జెట్ విశిష్టతో కూడుకున్నదన్నారు. కేంద్ర ప్రయోజిత కార్యక్రమాలలో ఏ ఒక్క వాటాను కూడా రాష్ట్ర ప్రభుత్వం వదులుకోవద్దని నిర్ణయించామని, ఇందులో భాగంగానే రాష్ట్ర వాటాలను కూడా చెల్లిస్తున్నామని వివరించారు.

## దాదాపు నిర్మూలించాం
(మొదటి పేజీ తరువాయి)

రేషన్ దుకాణాలు తెరుస్తామన్నారు.నక్సలిజాన్ని నిర్మూలిస్తామని మోదీ ప్రభుత్వం ప్రతిజ్ఞ చేసింది. దానికొక గడువు తేదీని నిర్ణయించింది. 2026 మార్చి 31వ తేదీతో మోదీ ప్రభుత్వం విధించకున్న గడువు ముగిసిపోతుంది. అంటే ఈ గడువు ఇంకా కొద్ది గంటల్లో ముగుస్తుంది. కశ్మీరులో, ఈశాన్య రాష్ట్రాలలో ఉగ్రవాదం కంటే దేశానికి నక్సలిజం అతిపెద్ద సవాలుగా మారిందని నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చెప్పారని అమిత్ షా గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్‌పార్టీ నక్సలిజం నిర్మూలనకు ఏమీ చేయలేదని అన్నారు. కానీ నరేంద్ర మోదీ ప్రభుత్వం మాత్రం దేశంలో ఏ విధమైన ఉగ్రవాదాన్నైనా సహించబోదని అన్నారు. దేశంలో నక్సలైట్ ఉద్యమ హింస నిర్మూలనకు కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని అన్నారు. 12 రాష్ట్రాలు దేశంలో రెడ్ కారిడార్ పాలనలోకి వెళ్ళాయని, ఈ రెడ్ కారిడార్‌లో ఎలాంటి చట్టబద్ధమైన పాలనా లేకుండా పోయిందని, అనేక సంవత్సరాలుగా ఈ రాష్ట్రాలలో 12 కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికంలో జీవించారని చెప్పారు. నక్సలైట్ల హింసాత్మక చర్యల కారణంగా ఈ రాష్ట్రాలలో అనేక సంవత్సరాలుగా 5,000 మంది భద్రతా సిబ్బందితోపాటు 20,000 మంది ప్రజలు మరణించారని చెప్పారు. ''నక్సలిజం అంతం చేసేందుకు మేం బాధ్యత తీసుకున్నాం, 75 ఏళ్ళ స్వతంత్ర్య భారతదేశంలో 60 సంవత్సరాలపాటు మీరు పరిపాలన చేశారు, ఐనాగానీ దేశంలో గిరిజన ప్రజలు ఇంకా ఎందుకు పేదరికంలో ఉన్నారు? గిరిజన ప్రాంతాలలో ఎందుకు పాఠశాలలు నిర్మించలేదు? ఈనాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ గిరిజనుల అభివృద్ధికి పాటుపడుతున్నారు'' అని అమిత్ షా చెప్పుకొచ్చారు. 60 సంవత్సరాల కాంగ్రెస్‌పాలనలో గిరిజనుల నివాసాల అభివృద్ధికి, అభ్యున్నతికి కాంగ్రెస్‌పార్టీ చేసింది ఏమీ లేదన్నారు. వారికి నీరు ఇవ్వలేదని, స్కూలు భవంతులు నిర్మించలేదని, బ్యాంకు సదుపాయాలు కూడా వారికి సమకూర్చలేదని అమిత్ షా విమర్శించారు. మీ పాలనలో మీరు ఏం చేయలేదు. కానీ మోదీని విమర్శిస్తున్నారన్నారు. అదేవిధంగా లోక్‌సభలో ఎన్‌డిఎ కూటమి పార్టీల ఎంపీలు తీవ్రస్థాయిలో కాంగ్రెస్ పాలకులపై ముఖ్యంగా యుపిఎ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. నక్సలిజం నిర్మూలనకు వారేమీ చేయలేదని విమర్శించారు. అదే సమయంలో కాంగ్రెస్‌పార్టీ కూడా దీటుగా స్పందిస్తూ నక్సలిజం నిర్మూలనకు దేశంలో తమపార్టీ ఎంతో కృషి చేసిందని చెప్పింది. శివసేన ఎంపి శ్రీకాంత్ షిండే మాట్లాడుతూ, బిజెపి పాలనలో దేశంలో రెడ్ కార్నర్ గణనీయంగా క్షీణించిపోయిందన్నారు. గత ఏడాది 317 మంది నక్సలైట్లు హతం కాగా, 862 మంది అరెస్టయ్యారని, 1,900 మంది లొంగిపోయారని చెప్పారు. 2024లో 2025 సంవత్సరాల్లో 28 నక్సలైట్ నాయకులు హతులయ్యారని, వీరిలో ఆరుగురు సెంట్రల్ కమిటీ సభ్యులున్నారని, 2026 లో ఇప్పటివరకూ 630 మంది నక్సలైట్లు భద్రతా దళాల దాడుల్లో హతులయ్యారని, ఇప్పుడు మిగిలినవారు ఆ మార్గం వదిలిపెట్టి బయకు వచ్చారన్నారు. తెలుగుదేశంపార్టీ ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, వామపక్ష తీవ్రవాదం కారణంగా తాను తన కుటుంబాన్ని కోల్పోయానన్నారు. కాంగ్రెస్‌పాలనలో భారీ స్థాయిలో నక్సలైట్ల దాడులు జరిగాయని చెబుతూ మోదీ అనుసరించిన విధానంపట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. మోదీ,అమిత్ షా అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపి సప్తగిరి ఉలేఖ స్పందిస్తూ కాంగ్రెస్‌పాలనలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ జరిగిందని గుర్తుచేశారు. కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూషన్ యాక్షన్ (కోబ్రా)ను కాంగ్రెస్‌పార్టీ సృష్టించిందని చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం తన వీపు తానే చరుచుకుని అభినందనలు చెప్పుకుంటోందని విమర్శించారు. ప్రజలు యుద్ధం వల్ల గ్యాస్ లభించక ఎన్నో కష్టాలు పడుతోందని, ఈ సమస్యలను మోదీ ప్రభుత్వం తాను సృష్టించిన సమస్యగా తన సొంతం చేసుకోవాలని అన్నారు.

## టూరిజంలో అక్రమాలు
(మొదటి పేజీ తరువాయి)

కోట్ల ఆదాయం రాగా, 2025లో రూ.13.12 కోట్లకు ఆదాయం పడిపోయింది. హుస్సేన్ సాగర్, దుర్గం చెరువు, నాగార్జున సాగర్, లక్నవరం లాంటి ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ పెరుగుతున్నా ఒక్క ఏడాదిలో రూ.1.48 కోట్ల ఆదాయం పడిపోవడంతో పర్యాటక శాఖలో అవినీతి జరుగుతున్నట్లు గుర్తించిన ఉన్నతాధికారులు బోటింగ్ కేంద్రాల్లో ఇంచార్జీలు, మేనేజర్లు, సిబ్బందితో కుమ్మక్కయి, టిక్కెట్లు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే తక్కువ ధరలకు బోటింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రూ.500 ఉన్న టికెట్‌ను రూ.200కు విక్రయించడం, టికెట్ లేకుండా బోట్‌లోకి అనుమతించడం, 10 ట్రిప్పులు తిరిగితే 8 ట్రిప్పులు తిరిగినట్లు చూపించి మిగతా 2 ట్రిప్పుల డబ్బులు తీసుకోవడం, ఒక్క ట్రిప్పుకు 3 లీటర్లు డీజిల్ అవసరం ఉండగా అదనంగా 2 లీటర్లు బిల్లులో రాయడం లాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని ఉన్నతాధికారులు గుర్తించారు. నాగార్జునసాగర్ బోటింగ్ కేంద్రంలో ఇంచార్జి ఏకంగా నకిలీ టికెట్ బుక్కునే ప్రింట్ చేసి, ప్రభుత్వానికి రావలసిన లక్షల ఆదాయం కొల్లగొట్టాడని, అతన్ని విధుల నుండి అధికారులు తొలగించారు. ప్రతీ బోటింగ్ కేంద్రంలో ఇలాంటి అవినీతి జరుగుతుందని, మంత్రి జూపల్లి కృష్ణారావు ఇప్పటికైనా ఇలాంటి అక్రమార్కుల పట్ల చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## నితీశ్ రాజీనామా
(మొదటి పేజీ తరువాయి)

ఏదో ఒక సభ్యత్వానికి రాజీనామా చేయడానికి 14 రోజుల గడువును రాజ్యాంగం నిర్దేశించింది. కాగా, మార్చి 30తో ఈ గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో రాజ్యసభకు ఎన్నికైన నితీశ్ కుమార్ తన శాసన మండలి సభ్యత్వానికి సోమవారం రాజీనామా చేశారు. సిఎం పదవికి కూడా త్వరలో రాజీనామా చేయనున్నారు. ఏప్రిల్ 9న నితీశ్ కుమార్ రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. మరోవైపు 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితీశ్ కుమార్ తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2005లో తొలిసారి బిహార్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. పలు రాజకీయ కూటములు మారుతూ రికార్డు స్థాయిలో బిహార్ పదో సిఎంగా ఉన్న నితీశ్ కుమార్ త్వరలో ఆ పదవికి కూడా రాజీనామా చేయనున్నారు. అయితే బిహార్ చరిత్రలో తొలిసారి బిపిపి నేత సిఎం పదవి చేపట్టనున్నారు. డిప్యూటీ సిఎం, బిజెపి శాసనసభా పక్ష నేత సామ్రాట్ చౌదరి ప్రధాన పోటీదారుగా కనిపిస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com